అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 20-02-2025
సంపుటి : 11 సంచిక : 50 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ప్రజలంటే లెక్కేలేదు
కార్పొరేట్ ప్రయోజనాలకే కేంద్ర బడ్జెట్



- శతకోటీశ్వరులపై సంపద పన్ను, కార్పొరేట్ పన్ను పెంచాలి
- ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసేలా బడ్జెట్ సవరణలు చేయాలి
- బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు: వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసనలు

నవతెలంగాణ-సిటీబ్యూరో/విలేకరులు

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసనలకు పిలుపు నివ్వగా.. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసనలు జరిగాయి. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో జాన్‌వెస్లీ పాల్గొని మాట్లాడారు. సామాన్య ప్రజలకు నేరుగా లబ్ది ...13లో

టెస్లాకు మోడీ సర్కార్ రెడ్ కార్పెట్
త్వరలోనే భారత్‌లో ఈవీ కార్ల అమ్మకాలు
- రెండు నగరాల్లో షోరూంల ఏర్పాటు
- మరో వైపు 'ఎక్స్' ప్రీమియం చార్జీలు రెట్టింపు

13లో..





చట్టబద్ధతకు సిద్ధం
బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై మార్చి మొదటి వారంలో ప్రత్యేక అసెంబ్లీ

త్వరలో మంత్రివర్గ సమావేశం
- మూడుబిల్లులకు రూపకల్పన
- ఆ తర్వాతే స్థానిక సమరం
- బీసీ రిజర్వేషన్లపై డిఫెన్స్‌లో ప్రతిపక్షాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దానికోసం మార్చి 1 నుంచి 5వ తేదీ లోపు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్టు సమాచారం. దీనికోసం మూడు ప్రత్యేక బిల్లులకు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. అయితే ఎస్సీ వర్గీకరణపై తుది బిల్లు ప్రతిని ఏకసభ్య కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా రూపొందించనున్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి, చట్టబద్ధత కల్పిస్తారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతంతో పాటు, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ మరో బిల్లును ప్రభుత్వం రూపొందించనుంది. దీనికి సంబంధించి త్వరలోనే మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ముసాయిదా బిల్లులకు తుదిరూపు ఇవ్వనున్నారు. ఆ తర్వాతే దీనికి సంబంధించిన పూర్తి స్థాయి రోడ్ మ్యాప్ తయారవుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మూడు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి, చట్టరూపం ...5లో

మార్చి మూడో వారంలో బడ్జెట్ సమావేశాలు
బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల చట్టబద్ధత అనంతరం మార్చి మూడోవారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు లేని నేపథ్యంలో ఇప్పటి వరకు ఆయా శాఖలు ప్రతిపాదించిన ప్రణాళికల్లో భారీ ఎత్తున మార్పులు చేర్పులు చేయాల్సి వచ్చింది. దీనితో బడ్జెట్ సమావేశాల్ని మార్చి మూడోవారానికి వాయిదా వేసినట్టు తెలిసింది.

ఎవరికీ మినహాయింపుల్లేవ్ !
భారత్‌పై టారిఫ్‌ల పట్ల ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్ : పరస్పరం టారిఫ్‌లు విధించే విషయమై ఇతర అన్ని దేశాలతో సహా భారత్‌కు ఎలాంటి మినహాయింపులు లేవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. టారిఫ్‌ల విషయంలో తనతో ఎవరూ వాదించలేరని అన్నారు. ట్రంప్, ఎలన్ మస్క్‌లతో సంయుక్తంగా ...6లో

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి
సీఎం రేవంత్‌రెడ్డికి టీఎన్జీవో వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవో ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీఆర్సీ, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, కొత్త జిల్లాల్లో అదనపు క్యాడర్, ఉద్యోగుల ఆరోగ్య కార్డులు తదితర అంశాల పట్ల ప్రభుత్వం వెంటనే ఆలోచించి పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అన్ని సమస్యలనూ పరిష్కరిస్తుందనీ, ఎవరు ఆందోళనకు గురి కావొద్దనీ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను రాబోయే రెండు మూడు నెలల్లో చెల్లిస్తామనీ, పెండింగ్ బిల్లులు లేకుండా చేస్తామనీ, పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం, సీపీఎస్ రద్దు, ...13లో


16 వేల మెగావాట్లకు విద్యుత్ డిమాండ్
నిరంతర సరఫరాకు ఇబ్బందుల్లేవు : డిప్యూటీ సీఎం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఆల్‌టైం రికార్డుకు చేరింది. బుధవారం ఉదయం 7 గంటల 55 నిమిషాలకు 16,058 మెగా వాట్ల అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఈనెల 10వ తేదీ గరిష్టంగా నమోదైన 15,998 మెగావాట్ల డిమాండ్‌ను అధిగమించింది. అయితే ఈ డిమాండ్‌ను ముందే అంచనావేసి, సరఫరాకు తగిన ఏర్పాట్లు చేశామని తెలంగాణ ఉత్తర, దక్షిణ ప్రాంతాల ...5లో

మళ్లీ అధికారం మనదే
కాంగ్రెస్ గ్రాఫ్ పూర్తిగా పడిపోయింది
- పార్టీ మారిన స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయం
- ప్రజల కోసం పనిచేయాలి : బీఆర్ఎస్ విస్తృత సమావేశంలో అధినేత కేసీఆర్ పిలుపు



నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

"రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం. రాబోయే రోజుల్లో అధికారం మనదే. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైంది. దాని గ్రాఫ్ పూర్తిగా పడిపోయింది. గత గాయాల నుంచి కోలుకున్న రాష్ట్రాన్ని మళ్లీ అదే స్థితికి తీసుకెళుతున్నారు. మరోసారి దోపిడీ, వలసవాదుల బారిన పడకుండా తెలంగాణను కాపాడాలి. ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు తథ్యం. పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రస్తుత తరుణంలో పార్టీ అభ్యర్థులను గెలిపించి మన సత్తా చాటాలి" అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, సంస్థాగత ఎన్నికలు, భవిష్యత్ కార్యచరణపై ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, చారిత్రక బాధ్యతను నిర్వహించిన ప్రజల పార్టీగా బీఆర్ఎస్ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని ...13లో

ప్రత్యేక బోర్డుతోనే మిర్చికి రేటు
మిరప ధరల స్థిరీకరణకు ఇదో మార్గం
- సుగంధద్రవ్యాల బోర్డు నుంచి విడదీయాలని డిమాండ్
- రేటు తగ్గుతుండటంతో నిరసనల వెల్లువ
- మద్దతు ధర కోసం రైతుసంఘాల పోరాటం
- ఖమ్మంలో తెలంగాణ రైతు సంఘం మహాధర్నా
- క్వింటాకు రూ.25 వేలు ఇస్తేనే గిట్టుబాటు



"ఓవైపు మిర్చికి పెట్టుబడులు పెరుగుతుండగా.. మరోవైపు ధరలు తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. క్వింటాకు రూ.25,000 ఉంటేనే కొంతమేర గిట్టుబాటు అవుతుందను కుంటున్న దశలో ఏటేటా ధరలు క్షీణిస్తుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మిర్చి రైతులు కన్నెర్రజేస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మిర్చి సాగవుతున్న దృష్ట్యా ఖమ్మం కేంద్రంగా మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఊపందుకుం టోంది. బోర్డు నెలకొల్పి మిర్చి ధరలు స్థిరీకరించాలని తెలంగాణ రైతు సంఘం నిర్వహిస్తున్న ఉద్యమాలకు పెద్ద ఎత్తున రైతుల నుంచి మద్దతు లభిస్తోంది."

ఆహారపంటగా గుర్తించాలి
- తెలంగాణ రైతుసంఘం మహాధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు పోతినేని

వివరాలు 3లో

మాజీమంత్రి హరీశ్‌రావుకు ఊరట



ఫోన్‌ట్యాపింగ్ కేసు దర్యాప్తు నిలిపివేత
పంజాగుట్ట పోలీసులకు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు పెట్టిన ఎఫ్ఐఆర్‌పై దర్యాప్తును నిలిపి వేస్తూ హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ పోలీస్ అధికారి ...6లో

ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా
నేడు ప్రమాణ స్వీకారం | నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా అవకాశం
- తొలిసారి గెలిచిన ఎమ్మెల్యే వైపే బీజేపీ మొగ్గు
- అధిష్టానంపై సీనియర్లు గుర్రు

న్యూఢిల్లీ: ఢిల్లీ కొత్త సీఎం ఎవరనే అంశానికి తెరపడింది.ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ఎంపికయ్యారు. పలువురు సీనియర్ నేతలు రేసులో ఉన్నా... రేఖా గుప్తా వైపే బీజేపీ హైకమాండ్ మొగ్గు చూపింది. షాలిమార్‌బాగ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన 50 ఏండ్ల రేఖా గుప్తాకు ఢిల్లీ సీఎం పగ్గాలు అప్పగించడం విశేషం. ఏబీవీపీ నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. బీజేపీలో పలు విభాగాల్లో పనిచేశారు. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగానూ గతంలో సేవలందించారు.


అయితే తమను కాదని, తొలిసారి గెలిచిన ఎమ్మెల్యే వైపే బీజేపీ అదిష్టానం మొగ్గు చూపటంతో సీనియర్లు గుర్రు మంటున్నారు.

ఢిల్లీకి నాలుగో మహిళా సీఎం..

రేఖా గుప్తా ఢిల్లీకి నాలుగో మహిళా సీఎంగా సేవలందించనున్నారు. గతంలో సుష్మాస్వరాజ్ (బీజేపీ), షీలాదీక్షిత్ (కాంగ్రెస్), అతిశీ (ఆప్) ముఖ్య మంత్రులుగా పనిచేసిన విషయం తెలిసిందే.

ప్రమాణస్వీకారానికి భారీ ఏర్పాట్లు

ఢిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువు తీరేందుకు ఏర్పాట్లు కొనసాగు తున్నాయి. గురువారం రాంలీలా మైదానంలో ప్రమాణ స్వీకా రోత్సవం జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మూడు దశాబ్దాల తర్వాత బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చింది. అయితే దేశ రాజధానిలో ఎవరు అధికారంలో ఉన్నా.. కేంద్రపాలిత రాష్ట్రం కావటంతో పెత్తనమంతా లెఫ్టినెంట్ గవర్నర్‌పైనే ఆధారపడి ఉంటుంది. దశాబ్దకాలం పాటు పాలించిన ఆప్‌ను కాదని ఢిల్లీ ఓటర్లు కమలానికి జై కొట్టారు. అయితే ఢిల్లీ నూతన సీఎం ఇప్పుడు ఐదు ప్రధాన సవాళ్లు దాటాల్సి ఉంటుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇది వారి నెత్తిన ముండ్ల కిరీటంలా మారబోతుందని చెబుతున్నారు.

ముందున్నవి ఐదు సవాళ్లు
- బీజేపీ ఇచ్చిన హామీలపై ఓటర్ల ఆశ
- అమలు అంత ఈజీ కాదంటున్న విశ్లేషకులు

న్యూఢిల్లీ: దేశంలో ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి. కానీ సమస్యలు మాత్రం అలాగే ఉంటాయి. దేశరాజధాని ఢిల్లీలోనూ పైన పటారం..లోన లోటారం అన్నట్టుగానే ఉంది. ప్రధాన మార్గాలు మినహా గతుకుల రోడ్లు, పగిలిన మురుగునీటి కాలువల నుంచి ప్రవహించే మురికి నీరు, చెత్త కుప్పలు, అధ్వానమైన పారిశుధ్య వ్యవస్థతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇక్కడ చాలా తక్కువ మంది సీఎంల పదవీకాలంలో విస్తృత మార్పులు సంభవించాయి. అంతేకాక ఢిల్లీ ఇప్పటికీ పూర్తి స్థాయి రాష్ట్రం కాలేదు. హక్కుల విషయానికొస్తే, లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) ఢిల్లీ ప్రభుత్వం మధ్య చాలా సంక్లిష్టత ఉంటుంది. ఒక నిర్దిష్ట సమస్యను పరిష్కరించడానికి ఢిల్లీ ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకోవాలో అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. స్పష్టంగా, ఢిల్లీని అభివృద్ధి చేయడానికి, ఏ ముఖ్యమంత్రి అయినా అనేక రంగాలలో పని చేయాల్సి ఉంటుంది.

దేశరాజధాని నియంత్రణ ఎల్జీదా లేక ఢిల్లీ సీఎందా?

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం లెఫ్టినెంట్ గవర్నర్, ఢిల్లీ ప్రభుత్వం మధ్య ఉద్రిక్తత తారాస్థాయికి చేరుకుంది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఢిల్లీని కఠినంగా నియంత్రించడానికి మార్గాలను వెతుకుతోంది. ఇప్పుడు.. స్వంత ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అలానే చేస్తుందా? అన్నదే పెద్ద చర్చ.

ఎల్జీ వీకే సక్సేనా ఇప్పటికే ఢిల్లీ ప్రభుత్వంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తారా అనే దానిపైనే మీమాంస. చట్టబద్ధంగా చూస్తే.. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వం కంటే శక్తివంతుడిగా మారారు. చట్టపరంగా శక్తివంతుడైనప్పటికీ ఆయన ఢిల్లీ పాలన పట్ల మృదువైన వైఖరిని అవలంబిస్తారా? లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఢిల్లీ ప్రభుత్వం ఏర్పడక ముందే యమునా నదిని శుభ్రపరిచే పనిని ప్రారంభించడం ద్వారా.. వీకే సక్సేనా తన ప్రాముఖ్యతను తగ్గించుకోబోనని సంకేతాలిచ్చారు. మరోవైపు బీజేపీ అధిష్టానం కూడా సీఎంగా ఎంపికైన నేత, లెఫ్టినెంట్ గవర్నర్ ప్రభావంతో పని చేయకూడదని కోరుకుంటున్నట్టు వినికిడి.

నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీసెస్ అథారిటీ 2023లో ఒక ఆర్డినెన్స్ ద్వారా స్థాపించబడింది. దీని ప్రకారం ...5లో

దేశ నిర్మాణంలో మొదటి అడుగు ఓటే..
- సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

సీఈసీ చెల్లుబాటుపై సుప్రీంలో విచారణ వాయిదా

13లో



అమెరికా ఏకపక్ష టారిఫ్‌లతో
తీవ్ర పర్యవసానాలు
- డబ్ల్యూటీఓ సమావేశాల్లో చైనా ఆందోళన

13లో



మధ్యప్రదేశ్‌లో
ఎన్‌కౌంటర్
- ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి

వివరాలు 5లో

మార్చి 31 వరకు
ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

5లో



ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదు

ఒత్తిడితో కాకుండా ఆత్మ సంతృప్తి కోసం పని చేయాలి

పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలతో మమేకమై పనిచేసే అదృష్టం లభించింది

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్



నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని, మనం చేసే పనిని ఒత్తిడితో కాకుండా ఆత్మ సంతృప్తి కోసం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ సెక్రెటరీ డీఎస్ చౌహన్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ ఫణిందర్ రెడ్డి ఆధ్వర్యంలో అజామాబాద్ వద్ద ఉన్న పౌర సరఫరాల శాఖ సర్కిల్ క్మీ౦ డ ఎక్మీ ఎంఎల్‌ఎస్ పాయింట్లలో పునరుద్ధరించిన గోడౌన్‌లను సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ప్రియాంకతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్ చౌహన్ మాట్లాడుతూ.. అధికారులు, కార్మికులు, కిందిస్థాయి వర్కర్లు మనం చేసే పనిని పై వారు చూస్తున్నారని వాళ్ల మెప్పు కోసం చేయకూడదని సూచించారు. చేసే ప్రతి పనిని ఆత్మసంతృప్తి కోసం చేయాలన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని, పౌర సరఫరాల శాఖ ద్వారా ఆ అవకాశం వచ్చిందని సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు రాష్ట్ర జనాభాలో 90 శాతం మంది ప్రజలతో కలిసి నిత్యం పనిచేస్తున్నామని అందుకు గర్వంగా ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పౌరసరఫరాల శాఖ ద్వారా సేవలు అందిస్తున్నామని చెప్పారు. చిత్తశుద్ధితో పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజలు అమ్ముకోవడానికి కాకుండా వండుకోవడానికి ఉపయోగపడే విధంగా నాణ్యమైన రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, గత సంవత్సర కాలంతో పోల్చి చూస్తే రేషన్ బియ్యం నాణ్యత చాలా మెరుగుపడిందని, దీనిని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. మన రైతులు పండించే పంటలను ఇతర రాష్ట్రాల వారు ఎగుమతి చేసుకోవడానికి పోటీ పడుతున్నారన్నారు. పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న అధికారులు, కార్మికులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అజామాబాద్ సివిల్ సప్లయ్ గోడౌన్లు అతి ప్రాచీనమైనవని, వాటిని పునరుద్ధరించి పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ సామగ్రిని భద్రపరచడానికి ఉపయోగించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా మేనేజర్ సాయి అరుణ్, ముషీరాబాద్ సివిల్ సప్లయ్ ఏఎస్ఓ దీప్తి, గోడౌన్ ఇన్‌చార్జి కిరణ్ తదితర అధికారులు పాల్గొన్నారు

శివాజీ పాలన కులమతాలకతీతం.. సమగ్రాభివృద్ధికి మార్గదర్శకం

మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఛత్రపతి శివాజీ పాలన కుల,మతాలకు అతీతమనీ, సమగ్రాభివృద్ధికి మార్గదర్శకమని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు కొనియాడారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శివాజీ 395వ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్పీ ఉపనేత, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ కరీంనగర్-నిజామాబాద్-అదిలాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) చంద్రశేఖర్ తివారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి(సంస్థాగత)మధుకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ..శివాజీ ఆదర్శ పరిపాలన అందించిన యోధుడనీ, నేటి రెవెన్యూ వ్యవస్థ, సివిల్ సర్వీసెస్ విధానాలు శివాజీ మహారాజ్ పరిపాలనా మోడల్ ఆధారంగా రూపుదిద్దుకున్నవేనని గుర్తుచేశారు. శివాజీ స్ఫూర్తిగా పాలకులు అవినీతిరహిత పాలన అందించాలని ఆకాంక్షించారు. చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ..శివాజీ పాలన మానవతా విలువలకు అద్దంపట్టిందన్నారు. శివాజీ మహారాజ్ స్ఫూర్తితోనే సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ ఐక్యత కోసం కృషిచేశారని గుర్తుచేశారు. అదే మార్గాన్ని అనుసరించి ప్రధాని నరేంద్ర మోడీ పాలన అందిస్తున్నారని కొనియాడారు.

ఫీజుల నియంత్రణపై సర్కారు దృష్టి

శ్లాబులుగా విభజించాలని సమాలోచన

మంత్రివర్గ ఉపసంఘానికి త్వరలో నివేదిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందుకు సంబంధించి ఇటీవల తెలంగాణ విద్యా కమిషన్ నివేదికను పాఠశాల విద్యాశాఖకు సమర్పించిన విషయం తెలిసిందే. దానిపై విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని ప్రయివేటు పాఠశాలల ఫీజులను శ్లాబులుగా విభజించాలని అధికారులు సమాలోచన చేస్తున్నారు. ఈ పద్ధతి గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అమల్లో ఉన్నది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి మంత్రివర్గ ఉపసంఘానికి నివేదికను సమర్పించాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. విద్యారంగ సమస్యలపై శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క నేతృత్వంలో ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఆ సంఘం ఈ నివేదికపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోనుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశ పెట్టే ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ ఆ బిల్లు ఆమోదం పొందితే 2026-27 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు అమల్లోకి వచ్చే అవకాశమున్నది. ఎందుకంటే 2025-26 ఫీజులను ఇప్పటికే ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు నిర్ణయించి విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేశాయి. దీంతో వచ్చే విద్యాసంవత్సరంలో ఫీజుల నియంత్రణ సాధ్యమయ్యే అవకాశం లేదు. ఇంకోవైపు ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ఇంజినీరింగ్, వృత్తి విద్యాకోర్సుల ఫీజుల ఖరారు కోసం ఉన్నట్టుగానే తెలంగాణ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఎఫ్ఆర్సీ)ని ఏర్పాటు చేసే అవకాశమున్నది. కనీస ఫీజును నిర్ణయించాలని అధికారులు భావిస్తున్నారు.

మౌలిక వసతులు, అర్హులైన ఉపాధ్యాయులు, జీతభత్యాలు, ఆడిట్ నివేదికల ఆధారంగా శ్లాబులు గా ఫీజులు ఉండేలా నిర్ణయం తీసుకోవాలని సమాలోచన చేస్తున్నారు. కనీస ఫీజులోపు ఆయా పాఠశాలల ఫీజులుంటే టీఎఫ్ఆర్సీకి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఒకవేళ కనీస ఫీజు కంటే ఎక్కువ ఫీజులను వసూలు చేయాలని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు భావిస్తే టీఎఫ్ ఆర్సీకి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి ఫీజులను ఖరారు చేస్తుంది.

ప్రత్యేక బోర్డుతోనే మిర్చికి రేటు

ధరల స్థిరీకరణకు ఇదో మార్గం | సుగంధద్రవ్యాల బోర్డు నుంచి విడదీయాలని డిమాండ్

రేటు తగ్గుతుండటంతో నిరసనల వెల్లువ
మద్దతు ధర కోసం రైతుసంఘాల పోరాటం
క్వింటాకు రూ.25 వేలు ఇస్తేనే గిట్టుబాటు
ఖమ్మంలో తెలంగాణ రైతు సంఘం మహాధర్నా

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి
మిర్చి రైతులు కన్నీర చేస్తున్నారు. ఆరుగాలం కష్టం అంగట్లో సరుకులా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఎకరానికి రూ.3 లక్షల పెట్టుబడి పెడితే.. దానిలో సగం కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆందోళనలు చేపడుతున్నారు. ధరల స్థిరీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 4 లక్షల ఎకరాలకుపైగా మిరప వేస్తుండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 1.25 లక్షల ఎకరాలు సాగవుతోంది. పైగా ఆంధ్రప్రదేశ్‌లోని పెద్ద మిర్చి మార్కెట్ గుంటూరుకు, తెలంగాణలోని వరంగల్‌కు అనుసంధానంగా ఉన్న ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కేంద్రంగా మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని రైతులతో కలిసి తెలంగాణ రైతు సంఘం ఉద్యమాలు నిర్వహిస్తోంది. క్వింటాకు రూ.25 వేల గిట్టుబాటు ధర కోసం పోరాటాలు చేస్తోంది. ఆహార పంటల జాబితాలో మిర్చిని కూడా చేర్చాలని డిమాండ్ చేస్తోంది. ఈ సీజన్‌లో ఇప్పటికే తెలంగాణ రైతు సంఘం మూడు పర్యాయాలు మిర్చి ధరలపై ఆందోళనలు నిర్వహించింది. ఖమ్మంలో మంగళవారం మహాధర్నా చేపట్టారు. రాష్ట్రంలోనే మిర్చి పంటకు ఖమ్మం జిల్లా కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇక్కడి తేజా రకం మిర్చికి అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. ప్రతి ఏటా రూ.1500 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల వరకు ఎగుమతులు జరిగేవి. కానీ, ఈ ఏడాది మాత్రం మిర్చి రైతులకు కన్నీళ్లే మిగిలాయి. రకరకాల చీడపీడలతో పంట



దిగుబడి తగ్గిపోయింది. ఒకప్పుడు ఎకరానికి 40 క్వింటాళ్లు వచ్చిన దిగుబడి ఇప్పుడు 20 క్వింటాళ్లలోపే వస్తుంది. రేటు కూడా ఏటేటా తగ్గుతుండటంతో పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఎకరానికి కూలీలతో కలిపి రూ.3 లక్షల పెట్టుబడి పెడితే దానిలో సగం కూడా వచ్చేలా లేవు.

రూ. 25,500 నుంచి పడిపోయిన ధర
రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో మిర్చిని ఎక్కువగా సాగు చేస్తారు. 2023లో ఖమ్మం మార్కెట్‌లో రూ.25,500 పలికిన క్వింటా మిర్చి ఇప్పుడు రూ.11వేల నుంచి రూ.13 వేల వరకే అమ్ముడవుతోంది. జెండా పాట రూ.14 వేల చిల్లర పలుకుతోంది. ఒకట్రెండు లాట్లకు మాత్రమే ఈ రేటు పెడుతున్నారు. రైతుల అవసరాల దృష్ట్యా రూ.10 వేలకు అమ్ముకుంటున్నారు. కొన్నేండ్ల కింద ఒక్క ఖమ్మం జిల్లాలోనే 1.35 లక్షల ఎకరాల్లో మిర్చి సాగయ్యేది. ఈ ఏడాది 90 వేల ఎకరాల్లోనే పంట వేశారు. సీజన్ ప్రారంభంలో ఎక్కువగా కురిసిన వర్షాలతో తోటలు దెబ్బతిన్నాయి. ఒకటికి రెండు సార్లు మొక్కలు నాటుకోవాల్సి రావడంతో పెట్టుబడి ఖర్చులూ భారీగా పెరిగాయి. ఎరువులు, పురుగు మందులకు ఒక్కో రైతు ఎకరానికి రూ.1.50 లక్షలకు పైగా ఖర్చు పెట్టాడు. ఇంత చేసినా దిగుబడి మాత్రం అంతంత మాత్రమే వచ్చింది. ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే మిర్చి తోటలు, ఈ ఏడాది 10 క్వింటాళ్లలోపే వచ్చాయి. దిగుబడి కూడా ఆశాజనకంగా లేకపోవడంతో రైతుకు కన్నీళ్లే దిక్కయ్యాయి. అటు రేటు లేక ఇటు దిగుబడి తగ్గటంతో ఈ సీజన్‌లో ఒక్క ఖమ్మం జిల్లాలోనే నలుగురు మిర్చి రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

మిర్చి బోర్డు ఏర్పాటుకు డిమాండ్

వ్యాపారులు, ట్రేడర్లు అంతర్జాతీయ ఆర్డర్లు లేకపోవడంతోనే రేటు తగ్గుతుందని అంటున్నారు. ధరలు పతనం దృష్ట్యా వాణిజ్య పంట అయిన మిర్చికి మిగిలిన కమర్షియల్ క్రాప్స్ తరహాలోనే ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం సుగంధ ద్రవ్యాల్లో భాగంగా ఉన్న మిర్చి బోర్డు కేరళలో ఉంది. మిరపను స్పైసీ బోర్డు నుంచి విడదీసి పసుపు, పొగాకు తరహాలో ప్రత్యేక బోర్డుగా ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేస్తోంది. పసుపు, పొగాకు, ఆయిల్ పామ్‌లకు సంబంధించి ధరల స్థిరీకరణకు నేషనల్ టర్మరిక్ బోర్డు, టొబాకో బోర్డు, ఆయిల్ ఫెడ్ పర్యవేక్షణ చేస్తున్నాయి. పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ ఉంది. కానీ మిర్చికి ఎటువంటి ప్రత్యేక బోర్డు లేకపోవడం లోపంగా ఉంది. మార్క్‌ఫెడ్ కందులు, మొక్కజొన్నలు, పెసలు వంటి ఆహార పంటలను కొనుగోలు చేస్తోంది. కారం లేకుండా ఏ కూరనూ తినలేము కాబట్టి ఆహార పంటల జాబితాలో మిరపను చేర్చి గిట్టుబాటు ధరలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది. ప్రస్తుతం మిర్చి ధరలు బాగా పతనమవుతున్న దృష్ట్యా మార్క్ ఫెడ్, నాఫెడ్‌లను రంగంలోకి దింపి కనీస ధర రూ. 25 వేలకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని తెలంగాణ రైతుసంఘం డిమాండ్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మిర్చి ధర రూ.15వేలకు తగ్గకుండా కొనుగోలు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ నిలుపుకోవాలని కోరుతోంది.

ఆహారపంటగా గుర్తించాలి

- మద్దతు ధర చెల్లించాలి
- ధరల స్థిరీకరణకు ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి
- పంటలు, ఎరువులు, పురుగుమందులపై జీఎస్టీ రద్దుకు డిమాండ్
- వ్యవసాయ రంగం గురించి పట్టని మోడీ ప్రభుత్వం
- తెలంగాణ రైతుసంఘం మహాధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు పోతినేని, రాష్ట్ర నాయకులు నున్నా

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి
మిర్చిని వ్యాపార పంటగా కాకుండా ఆహారపంటగా గుర్తించాలని, ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మిర్చికి రూ.25వేల గిట్టుబాటు ధర చెల్లించాలని తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా రూ.25వేలకు కొనుగోలు చేయాలన్నారు. రైతులు చనిపోతున్నా మిర్చి ధరలపై రాష్ట్రప్రభుత్వం కేంద్రంతో ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీకి వ్యవసాయ రంగం గురించి పట్టదని, రాష్ట్రంలో ఇద్దరు కేంద్రమంత్రులు, ఖమ్మం జిల్లాలో ముగ్గురు రాష్ట్రమంత్రులు ఉండి ఏమి ఉపయోగమని అన్నారు. గతంలో వామపక్షాల భాగస్వామ్యంతో పనిచేసిన యూపీఏ ప్రభుత్వం మిర్చికి 10శాతం కంటే ధర తగ్గినప్పుడు గిట్టుబాటు ధర కోసం చర్యలు చేపట్టిందని



గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వం పంటలు, ఎరువులు, పురుగుమందులపై జీఎస్టీ రద్దు చేయాలని కోరారు. మిర్చి రైతులు పురుగుమందులపై రూ.50వేల పెట్టుబడి పెడితే 18శాతం జీఎస్టీ పేరుతో రూ.9వేలు పన్ను కట్టాల్సి వస్తోందన్నారు. పంటలు, ఎరువులు, క్రిమిసంహారక మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని, ఎరువులపై 10-30శాతం పన్నులు, డీజిల్, పెట్రోల్‌పై కమీషన్లు దండుకుంటున్న కేంద్రప్రభుత్వం మిర్చి పంట ధరను మాత్రం 60శాతం తగ్గించిందని ఆరోపించారు. రైతులు పోరాటాలను నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. అనంతరం నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో ఇప్పటికీ రెండుసార్లు మిర్చి ధరల పెంపుపై ఆందోళనలు చేశామని తెలిపారు. మిర్చి రైతులు మరణిస్తున్నారని, ఇప్పటికీ జిల్లాలో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఇకనైనా స్పందించకపోతే మిర్చి రైతులతో మంత్రుల ఇండ్లు, క్యాంప్ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. వివిధ రకాల తెగుళ్లకు రైతు ఒక్కసారి పురుగు మందు కొడితే ఎకరానికి రూ.2వేలకుపైగా ఖర్చు వస్తుందని, అలాంటిది సీజన్‌కు 20 సార్లకు పైగా పిచికారీ చేయాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని, ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుకు ఎంపీ రఘురాంరెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ ధర్నాలో తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, నాయకులు యర్రా శ్రీకాంత్, భూక్యా వీరభద్రం, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావ్, తాతా భాస్కర్‌రావు, కొక్కెర పుల్లయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, మహేశ్వరరెడ్డి, ఎస్.నవీన్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, ఊరడి సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి

నేటి "చలో విద్యుత్ సౌధ"కు సీపీఐ(ఎం) మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో విద్యుత్ ఆర్టిజన్లను వెంటనే కన్వర్షన్ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్హతలను బట్టి విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన చలో విద్యుత్ సౌధ కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో సుమారు 20 వేల మంది విద్యుత్తు ఆర్టిజన్లు ఏడేండ్లుగా పని చేస్తున్నారని వివరించారు. ఈ కార్మికులందరూ గతంలో 15 నుంచి 20 ఏండ్లపాటు విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేశారని గుర్తు చేశారు. ఒకే సంస్థ, ఒకే సర్వీస్ రూల్ పద్ధతిని అనుసరించి ఇప్పటికే వారిని కన్వర్షన్ చేయాల్సి ఉన్నదని తెలిపారు. ఈ 20 వేల మందికి కన్వర్షన్ ఇవ్వడం వల్ల ప్రభుత్వంపైనగానీ, యాజమాన్యంపైనగానీ ఎలాంటి ఆర్థిక భారం పడబోదని స్పష్టం చేశారు. ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని కోరుతూ గత ఐదు నెలలుగా ముఖ్యమంత్రి, మంత్రులకు, అధికారులకు వినతిపత్రాలతోపాటు పలు రకాల పోరాటాలను చేస్తున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో చలో విద్యుత్ సౌధ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. వారి సమస్యల తీవ్రతను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని తక్షణమే స్పందించి దీర్ఘకాలంగా విద్యుత్తు విభాగంలో పనిచేస్తున్న ఆర్టిజన్లను కన్వర్షన్ చేసేందుకు ట్రాన్స్‌కో యాజమాన్యానికి తగు ఆదేశాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీఎస్‌యూఈఈయూ) ప్రతినిధి బృందం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కలిశారు. ఆర్టిజన్ల సమస్యతో పాటు విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల ఇతర సమస్యల పరిష్కారానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తమ సమస్యల్ని తీసుకెళ్లాలని కోరారు. ఆర్టిజన్ల కన్వర్షన్ డిమాండ్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నదనీ, దాని సాధన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. జాన్ వెస్లీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్, టీజీఎస్ఎస్పీడీసీఎల్ కంపెనీ ఉపాధ్యక్షులు కర్నాల అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అదానీ లంచం కేసులో సహకరించండి

భారత్‌ను కోరిన అమెరికా సంస్థ



న్యూయార్క్ : పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై నమోదైన ముడుపుల కేసులో సహకరించాల్సిందిగా అమెరికాకు చెందిన సెక్యూరిటీలు-ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) భారత ప్రభుత్వాన్ని కోరింది. సౌర ఇంధన కాంట్రాక్టుల కోసం 2020-24 మధ్య భారత ప్రభుత్వ అధికారులకు 250 మిలియన్ డాలర్లకు పైగా లంచం ఇచ్చారంటూ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్‌పై వచ్చిన ఆరోపణలపై అమెరికా ఎస్ఈసీ దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అదానీలకు ఫిర్యాదు అందించే విషయంలో సహకరించాల్సిందిగా భారత న్యాయ మంత్రిత్వ శాఖను కోరామని అమెరికా ఎస్ఈసీ మంగళవారం న్యూయార్క్ జిల్లా న్యాయస్థానానికి తెలియజేసింది. 'ముద్దాయిలు భారతదేశంలో ఉన్నారు. వారికి ఫిర్యాదును అందించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే హేగ్ సర్వీస్ కన్వెన్షన్‌లోని ఆర్టికల్ 5 (ఏ) కింద భారత అధికారుల సహకారాన్ని కోరాము' అని న్యూయార్క్ కోర్టు జడ్జి నికొలస్ గరౌఫిస్‌కు రాసిన లేఖలో ఎస్ఈసీ న్యాయవాది క్రిస్టోఫర్ ఎం. కొలొరాడో తెలియజేశారు. ఆ విషయంలో తమ ప్రయత్నాలు కొనసాగుతాయని, దర్యాప్తులో పురోగతిపై న్యాయస్థానానికి తెలియజేస్తుంటామని వివరించారు. ముద్దాయిలు మరో దేశంలో ఉన్నందున ఎఫ్ఆర్‌సీపీలోని 4 (ఎఫ్) నిబంధన ప్రకారం సమన్లు, ఫిర్యాదు అందజేయాల్సి ఉంటుందని చెప్పింది. అయితే అందుకు కాలపరిమితి ఏదీ ఆ నిబంధనలో లేదు. గత సంవత్సరం నవంబర్ 20వ తేదీన అమెరికా ప్రాసిక్యూటర్లు న్యూయార్క్ కోర్టులో ఎనిమిది మందిపై అభియోగాలు నమోదు చేశారు. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రకటనల ద్వారా అమెరికా, విదేశీ ఇన్వెస్టర్ల నుండి రెండు బిలియన్ డాలర్లు ఆర్జించిందని అందులో ఆరోపించారు. ప్రాసిక్యూటర్ల అభియోగాల ఆధారంగా అమెరికాలో విచారణ ప్రారంభమైంది. గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వినీత్ జైన్‌లపై ఎస్ఈసీ సివిల్ దర్యాప్తు జరుపుతోంది. గౌతమ్ అదానీ, సాగర్ అదానీలు అమెరికా సెక్యూరిటీల చట్టంలోని నిబంధనలను ఉద్దేశపూర్వకంగానో లేదా నిర్లక్ష్యంతోనో ఉల్లంఘించారని ఎస్ఈసీ ఆరోపించింది. ఓ వైపు ఎస్ఈసీ దర్యాప్తు కొనసాగుతుండగానే మరోవైపు దానికి సమాంతరంగా న్యూయార్క్ జిల్లా అటార్నీ కార్యాలయం అదానీ గ్రూప్, అజూర్ పవర్‌కు సంబంధించిన వ్యక్తులపై క్రిమినల్ ఆరోపణలు నమోదు చేసింది. వీరిలో గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, అజూర్ పవర్ గ్లోబల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ సిరిల్ కాబెన్స్ తదితరులు ఉన్నారు. కాగా తమపై వచ్చిన ఆరోపణలను అదానీ గ్రూప్ ఖండిస్తోంది.

అమెరికా ఎస్ఈసీ కోరిన విధంగా అదానీ కేసులో భారత ప్రభుత్వం సహకరిస్తుందా అని కాంగ్రెస్ ప్రశ్నించింది. అదానీ కేసు వ్యక్తిగతమైన వ్యవహారమని ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికే స్పష్టం చేసినందున అమెరికా ఎస్ఈసీ అభ్యర్థనకు అంగీకరిస్తారా అని ప్రశ్నిస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు.

హేగ్ సర్వీస్ కన్వెన్షన్ అంటే...
అదానీలకు లీగల్ డాక్యుమెంట్లు అందజేయడానికి భారత ప్రభుత్వ సాయాన్ని కోరతామని అమెరికా ఎస్ఈసీ న్యూయార్క్ జిల్లా కోర్టుకు తెలుపుతూ ఆ లేఖలో హేగ్ సర్వీస్ కన్వెన్షన్‌ను ప్రస్తావించింది. అసలు హేగ్ సర్వీస్ కన్వెన్షన్ అంటే ఏమిటి? దేశ సరిహద్దును దాటి విదేశాలలో ఉన్న వారికి లీగల్ డాక్యుమెంట్లు అందజేసే ప్రక్రియకు ప్రామాణికంగా ఈ కన్వెన్షన్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై 68 దేశాలు సంతకాలు చేశాయి. అంతర్జాతీయ న్యాయ సేవలకు సంబంధించి ఇది విస్తృతంగా గుర్తింపు పొందిన పద్ధతి. ఏ దేశంలో అయినా విదేశీ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయాలంటే కొంత ప్రక్రియ అవసరమవుతుంది. సంబంధిత వ్యక్తులు లేదా సంస్థలు ఆ ప్రక్రియకు లోబడే నోటీసులు అందుకుంటారు. హేగ్ సర్వీస్ కన్వెన్షన్‌కు కట్టుబడి ఉండడంలో విఫలమైతే న్యాయ సేవలో లోపం జరిగినట్లు పరిగణిస్తారు. అంతేకాదు...ఆ కేసులో ఇచ్చే తీర్పును అమలు చేయడం కూడా సాధ్యం కాదు. అంతర్జాతీయ న్యాయ సేవ అనేక సంక్లిష్టతలతో కూడి ఉంటుంది. ఏ చిన్న తప్పిదం జరిగినా తీవ్ర జాప్యం జరగవచ్చు. కేసును పరిష్కరించడంలో నెలలు, సంవత్సరాలు కూడా పట్టవచ్చు. ఈ కేసులో ముద్దాయిలైన గౌతమ్ అదానీ, సాగర్ అదానీలు భారత్‌లో ఉన్నందున అమెరికా ఎస్ఈసీ ఎఫ్ఆర్‌సీపీలోని 4 (ఎఫ్) నిబంధన ప్రకారం నడుచుకుంటోంది. హేగ్ సర్వీస్ కన్వెన్షన్ వంటి అంతర్జాతీయంగా అంగీకారం పొందిన పద్ధతుల ద్వారా ఫిర్యాదులు, నోటీసులు, లీగల్ డాక్యుమెంట్లు అందజేయడానికి ఈ నిబంధన అనుమతిస్తోంది.

డిజిటల్ యాక్సెసిబిలిటీ ప్రమాణాలలో వైఫల్యం

మంత్రిత్వ శాఖలకు జరిమానాలు



న్యూఢిల్లీ : డిజిటల్ యాక్సిసిబులిటీ ప్రమాణాలను పాటించడంలో విఫలమైన 155 సంస్థలపై వికలాంగులకు చెందిన చీఫ్ కమిషనర్ కోర్టు రూ.10,000 చొప్పున జరిమానా విధించింది. వీటిలో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు కూడా ఉన్నాయి. పలు వెబ్‌సైట్లు, మొబైల్ అప్లికేషన్లు, ఇతర డిజిటల్ వేదికలకు జరిమానాలు విధించారు. ఈ నెల 28వ తేదీ తర్వాత మరోసారి సమీక్ష జరుపుతామని, అప్పటికీ ప్రమాణాలకు కట్టుబడి ఉండకపోతే అధిక జరిమానాలు విధిస్తామని వికలాంగుల చీఫ్ కమిషనర్ (సీసీపీడీ) హెచ్చరించారు. జరిమానా మొత్తాన్ని వికలాంగుల జాతీయ నిధిలో జమ చేయాలని ఆయన ఆదేశించారు. చట్ట ప్రకారం ఆడిట్ నివేదికలు చూసేందుకు వీలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలను పీసీపీడీ కోరింది. అందుకు ఆడిటర్లను నియమించారా..? అని ఆరా తీసింది.

ఈ మేరకు సీసీపీడీ కోర్టు అన్ని మంత్రిత్వ శాఖలు, వివిధ డిపార్ట్‌మెంట్లు, ప్రయివేటు సంస్థల సీఈఓలకు లేఖలు పంపింది. అయితే కేవలం 20 సంస్థలు మాత్రమే ఆడిటర్లను నియమించాయని గుర్తించింది. మూగ, చెవిటి, గుడ్డి వారు ఆన్‌లైన్ మోడ్ సేవలు పొందేందుకు వీలుగా కొన్ని ప్రమాణాలను నిర్దేశించారు. వీటిని వెబ్‌సైట్లు, పోర్టల్స్, యాప్స్ పాటిస్తున్నాయా లేదా అనే విషయాన్ని ఆడిటర్లు పరిశీలించాల్సి ఉంటుంది. ఆరు సంస్థలు మాత్రమే యాక్సెస్ ఆడిట్ నివేదికలు సమర్పించాయి. వీటిలో విదేశాంగ శాఖ, టాటా డిజిటల్ ప్రయివేట్ లిమిటెడ్ (టాటా న్యూ), రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (జియో సెట్-టాప్ బాక్స్), నేషనల్ డిపాజిటరీ లిమిటెడ్, ఫ్లక్సీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, యాత్ర ఆన్‌లైన్ లిమిటెడ్ ఉన్నాయి. హోం, రక్షణ, ఆర్థికం, ఆరోగ్యం, వ్యవసాయం, రైల్వేలు, రోడ్డు, రవాణా-హైవేలు, కమ్యూనికేషన్లు, వాణిజ్యం-పరిశ్రమలు, వినియోగ వ్యవహారాలు, ఆహారం-ప్రజా పంపిణీ, మహిళ-శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, గిరిజన వ్యవహారాలు వంటి పలు మంత్రిత్వ శాఖలకు చెందిన విభాగాలు సీసీపీడీ ఆదేశాలను బేఖాతరు చేశాయి. నీతి ఆయోగ్, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ సైతం ప్రమాణాలను పాటించలేదు. ప్రమాణాలకు అనుగుణంగా ఆడిటర్లను నియమించేందుకు సీసీపీడీ కోర్టు ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగించినా మంత్రిత్వ శాఖలు, డిజిటల్ వేదికలు పట్టించుకోలేదు.



ఆధారాల్లేవు

ముడా కేసులో సిద్ధరామయ్యకు లోకాయుక్త పోలీసుల క్లీన్‌చిట్

బెంగళూరు : ముడా భూముల కేటాయింపు కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, మరో ఇద్దరికి రాష్ట్ర లోకాయుక్త పోలీసులు బుధవారం క్లీన్‌చిట్ ఇచ్చారు. నిందితులకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదని మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల కేటాయింపు కేసును విచారిస్తున్న కర్నాటక లోకాయుక్త పోలీసులు తేల్చి చెప్పారు. ఈ మేరకు కర్నాటక హైకోర్టుకు తుది నివేదిక సమర్పించారు. ముడా కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతితో పాటు బావమరిది (పార్వతి సోదరుడు) మల్లిఖార్జున స్వామి, భూ యజమాని దేవరాజ్ నిందితులుగా ఉన్నారు. 'ఈ కేసులో నిందితులపై మోపిన ఆరోపణలు రుజువు కాలేదు. వారికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. తుది నివేదికను రాష్ట్ర హైకోర్టుకు సమర్పిస్తున్నాం' అని ముడా కేసులో ఫిర్యాదుదారైన స్నేహమయి కృష్ణకు రాసిన లేఖలో లోకాయుక్త పోలీసులు తెలియజేశారు. 2016-2024 మధ్యకాలంలో 50:50 నిష్పత్తిలో ముడా నష్టపరిహార ప్లాట్లు కేటాయించిందంటూ వచ్చిన ఆరోపణలపై తదుపరి విచారణ జరుపుతామని, హైకోర్టుకు అదనపు తుది నివేదికను అందజేస్తామని వారు ఆ లేఖలో వివరించారు. కేసును సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను కర్నాటక హైకోర్ట్ కొద్ది రోజుల క్రితమే తోసిపుచ్చింది. మైసూరులో అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో సిద్ధరామయ్య భార్య పార్వతికి నష్టపరిహారం కింద ముడా స్థలాలను కేటాయించిందంటూ ఫిర్యాదులు వచ్చాయి. పార్వతికి చెందిన భూమిని సేకరించిన ధరతో పోలిస్తే దానికి బదులుగా ఆమెకు ముడా కేటాయించిన స్థలాల విలువ చాలా అధికంగా ఉన్నదని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదాలతో జీవితాలు ఛిద్రం

ఏటా 1.8 లక్షల మంది చిన్నారులు, వయోజనుల మృతి

ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల్లోనే అధికం : యూనిసెఫ్ నివేదిక వెల్లడి



మర్రాకెచ్ (మొరాకో) : ప్రపంచవ్యాప్తంగా ఏటా 1.8 లక్షల మంది చిన్నారులు, వయోజనులు రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. అంటే రోడ్డు ప్రమాదాలతో రోజుకు 500 మరణాలు సంభవిస్తున్నాయన్న మాట. వీటిలో 70 శాతం వరకూ పేద, ఓ మోస్తరు ఆదాయాన్ని కలిగిన దేశాల్లోనే (ఎల్ఐఎంసీలు) జరుగుతుండడం గమనార్హం. యూనిసెఫ్ మంగళవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల్లో రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య అధికంగా ఉంటోంది. మన దేశంలో 2023లో 18 సంవత్సరాల లోపు వయసున్న 9,500 మంది ప్రాణాలు కోల్పోయారు. మొరాకోలోని మర్రాకెచ్ నగరంలో జరిగిన నాలుగో మంత్రుల స్థాయి సదస్సులో యునిసెఫ్ నివేదికను విడుదల చేశారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఆఫ్రికాలో చనిపోతున్న చిన్నారుల్లో 46 శాతం మంది పాదచారులేనని యూనిసెఫ్ నివేదిక తెలిపింది. దీనికి భిన్నంగా యూరోపియన్ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న చిన్నారుల్లో 50 శాతం మంది వాహనదారులే ఉంటున్నారు. దక్షిణాసియా, తూర్పు ఆసియా, పసిఫిక్‌లో ద్విచక్ర వాహనాలు అధికంగా ఉన్నాయని, ఆఫ్రికా ఖండంలోనూ, కరేబియన్‌లోనూ వాటి సంఖ్య తక్కువగా ఉన్నదని నివేదిక తెలిపింది. సంపన్న దేశాలతో పోలిస్తే ఎల్ఐఎంసీ దేశాల్లో పిల్లలు, వయోజనులు మూడు రెట్లు ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. సంపన్న దేశాలతో పోలిస్తే ఈ దేశాల్లో మౌలిక వసతులు తక్కువగా ఉంటాయి. భద్రతా చర్యలు కూడా సరిగా ఉండవు. రోడ్డు భద్రతా విధానాల అమలు కూడా నామమాత్రమే. అందుకే అక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని యూనిసెఫ్ నివేదిక వివరించింది. అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే 19 సంవత్సరాల లోపు వయసున్న 3.3 బిలియన్ల చిన్నారులు, వయోజనుల్లో 90 శాతం మంది ఎల్ఐఎంసీ దేశాలకు చెందిన వారే. వివిధ దేశాల్లో నెలకొని ఉన్న విధానపరమైన వ్యత్యాసాలను కూడా నివేదిక ఎత్తిచూపింది. ఉదాహరణకు ఆల్కహాల్ సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న డ్రైవర్లకు కేవలం 37.2 శాతం దేశాలు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఏ వయసు వారు వాహనాలు నడపవచ్చునన్న విషయంలో 33.7 శాతం దేశాలు మాత్రమే ప్రమాణాలు నిర్దేశించాయి. పాఠశాలల పరిసరాల్లో గంటకు 30 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వాహనాలు నడపకుండా పరిమితి విధించాలని, అందుకు చట్టాలు రూపొందించాలని, పట్టణ రోడ్లపై గరిష్ఠ వేగాన్ని సురక్షిత స్థాయికి తగ్గించాలని యూనిసెఫ్ నివేదిక సూచించింది.



సంపాదకీయం

ప్రజానుకూల పద్దు కావాలి...



'షెడ్డులో సగం.. గుడిలో సగం...' ఆదిలాబాద్ జిల్లా దుబ్బగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితిని వివరిస్తూ పత్రికల్లో తాజాగా వచ్చిన కథనానికి శీర్షిక ఇది. 'ప్రసవానికి డోలీలోనే...' భద్రాచలం మారుమూల అటవీ ప్రాంతంలో గర్భిణీలు, బాలింతల పరిస్థితిపై వచ్చిన మరో కథనమిది. అత్యంత కీలకమైన విద్యా, వైద్య రంగాలపై పాలకుల నిర్లక్ష్యానికి ఇవి ప్రబల తార్కాణాలు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకూ ప్రభుత్వాలు ఈ రెండు రంగాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్నా... వాటి విడుదల, తద్వారా పథకాల అమల్లో మాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించలేకపోతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాకపోవటం శోచనీయం. గత బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు సైతం 'చేసింది గోరంత- చెప్పుకునేది కొండంత' అనే విధంగానే వ్యవహరిస్తున్నాయి తప్పితే ఆచరణలో చిత్తశుద్ధిని ప్రదర్శించటం లేదు. గత దశాబ్ద కాలంగా వైద్య విద్య, ఫుడ్ సేఫ్టీ, మాదక ద్రవ్యాల విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయంటూ ఇటీవల నిర్వహించిన బడ్జెట్ ప్రతిపాదిత సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వాపోయారు.. కానీ గత ఏడాది కాలంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు, ఆయా రంగాలను ఎందుకు ప్రక్షాళన చేయలేదు, వాటికి చాలినన్ని నిధులు ఎందుకు కేటాయించలేదన్నది ప్రశ్నార్థకం.

మరోవైపు రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన దళితులు, గిరిజనుల కోసం ఉద్దేశించిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక నిధుల విషయంలోనూ పాలకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటం ఆందోళనకరం. బీఆర్ఎస్ హయాంలో సంబంధిత నిధుల వ్యయం ఎప్పుడూ 70 శాతాన్ని దాటలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మిగతా ముప్పై శాతం నిధులను కేసీఆర్ సర్కారు ఇతర పనులకు వినియోగించిందన్న విమర్శలకు అప్పటి ప్రభుత్వం ఇప్పటిదాకా జవాబివ్వకపోవటం గమనార్హం. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు సైతం అదే బాటలో నడిచి, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసింది. 2023-24లో ప్రతిపాదించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పేర్కొన్న నిధుల్లో 77శాతాన్ని ఖర్చు చేసి, మిగతా 23 శాతాన్ని వదిలేసింది. 2024-25 బడ్జెట్‌లో ఇప్పటి వరకూ 48 శాతం నిధులను ఖర్చు చేశారు. అయితే ప్రస్తుత పద్దుకు మార్చి ఆఖరు వరకూ గడువుంది కాబట్టి, అప్పటి వరకూ ఎంత వ్యయం చేశారనే లెక్కలు తేలాల్సి ఉంది.

పరిస్థితి ఈ విధంగా ఉండగా... మరికొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి తన బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రాధాన్యతల గురించి సర్కారు ఆలోచించి, తదనుగుణంగా ముందుకెళ్లాలి. రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకూ విద్యారంగంలో అన్ని స్థాయిల్లోనూ సమూల మార్పులు తెస్తా మంటున్న రేవంత్ సర్కారు...అందుకోసం అవసరమైన నిధులను కేటాయించాలి. తెలంగాణలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలంటూ సీపీఐ(ఎం) ఇటీవల విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. ఆ కోవలోనే ఇతర రంగాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన బడ్జెట్‌ను ప్రతిపాదించాలి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు వీలుగా బడ్జెట్ కూర్పు ఉండాలి.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వాటిని చెల్లించేందుకు తిప్పల గురించి ఇప్పటిదాకా చెబుతూ వచ్చిన కాంగ్రెస్ సర్కారు... ఇక ఇప్పుడు తప్పించుకోవటానికి వీల్లేదు. అధికారంలోకి వచ్చిన కొత్తలో 'ప్రభుత్వ ఉద్యోగులం దరికీ ఒకటో తారీఖునే జీతాలు...' అంటూ ముఖ్యమంత్రి, మంత్రులు ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది.

ప్రభుత్వఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, సిబ్బందికి రావాల్సిన గ్రాట్యూటీ, ఇతర బెనిఫిట్లు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు చెల్లించాల్సిన ఈఎల్స్ డబ్బులు తదితరాలు రూ.వందల కోట్ల మేర పేరుకు పోవటంతో ఆర్థికశాఖ ఉన్నతాధికారులకు ఏం చేయాలో తెలియని దుస్థితి. వాటి కోసం నెలలు, ఏండ్లు ఎదురు చూసిన బాధితులు సహనం కోల్పోతున్న పరిస్థితి. ఇలాంటి సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారం బడ్జెట్. అది ప్రజానుకూలంగా ఉంటే ప్రభుత్వం సేఫ్. లేదంటే మళ్లీ ధర్నాచౌక్ దద్దరిల్లటం ఖాయం.

మరికొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి తన బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రాధాన్యతల గురించి సర్కారు ఆలోచించి, తదనుగుణంగా ముందుకెళ్లాలి. రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకూ విద్యారంగంలో అన్ని స్థాయిల్లోనూ సమూల మార్పులు తెస్తా మంటున్న రేవంత్ సర్కారు...అందుకోసం అవసరమైన నిధులను కేటాయించాలి. తెలంగాణలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలంటూ సీపీఐ(ఎం) ఇటీవల విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. ఆ కోవలోనే ఇతర రంగాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన బడ్జెట్‌ను ప్రతిపాదించాలి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు వీలుగా బడ్జెట్ కూర్పు ఉండాలి.

మెయిల్ @ నవతెలంగాణ

ప్రయాణికుల ప్రాణాలపై పట్టింపేది?

'పుణ్యం కోసం వెళ్తే ..పాపం ఎదురైందనే' నానుడి మహా కుంభమేళా యాత్రికులకు సరిగ్గా సరిపోతుంది. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ శనివారం రాత్రి ప్రయాగరాజ్ వెళుతున్న ప్రయాణికుల తొక్కిసలాటలో పద్దెనిమిదిమంది నిండు ప్రాణాలు గాల్లో కలిశాయి. రైల్వేశాఖ ముందస్తు ప్రణాళికలు, భద్రతా ఏర్పాట్లలో విఫలం చెందిందనే విమర్శలు మూటకట్టుకుంది. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రయాణికులు రైళ్లలో కుంభమేళాకు వెళ్తున్న సంగతి తెలిసిందే. అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన రైల్వే సిబ్బంది పూర్తి నిర్లక్ష్యం వహించింది. అవగాహనా రాహిత్యం, పరస్పర సమాచారం లోపం ఈ దుర్ఘటనకు కారణమైంది. స్టేషన్‌లో సిబ్బంది ప్లాట్‌ఫారం నెంబర్లు మార్చినట్టు ప్రకటనలు చేయడం, ఒకటే పేరుతో రెండు రైళ్లు ప్రయాగరాజ్‌కు వెళ్లడానికి పట్టాలపైకి రావడం, వేలాదిమంది స్టేషన్‌లోపలికి పరిగెత్తుకు రావడం, వారిని నియంత్రించకపోవడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని రైల్వేశాఖ ప్రాథమికంగా వెల్లడించింది. ఇంతమంది యాత్రికులు స్టేషన్‌కు వస్తున్నప్పుడు వారి రక్షణకు తగిన సిబ్బందిని ఎందుకు కేటాయించలేదనేది ప్రశ్న? గంట గంటకు పదిహేను వందల జనరల్ టికెట్లు అమ్మి నట్టు రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్యాసింజర్ రైళ్లలో రెండు లేదా మూడు జనరల్ బోగీలు ఉంటాయి. ఒక్కో బోగిలో వందమంది చొప్పున అనుకున్నా మూడు వందల మందికి మించరు. ఎంత కిక్కిరిసినా మహా అయితే ఐదు వందలు అందులో ప్రయాణించగల్గుతారు. అలాంటప్పుడు అన్ని టిక్కెట్లు ఎలా అమ్ముతారు?వారిని ఎక్కడ కూర్చోబెడతారు? ఇవి ఏమైనా ఆలోచించారా? ఇది రైల్వే శాఖ లాభాపేక్షనే అనుకోక తప్పదు. టిక్కెట్లు అమ్ముకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో లేదు. దీనికి ఎవరు కారణం, మృతుల కుటుంబాలకు జవాబు చెప్పేదెవరు? ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత రైల్వేశాఖదే. ఇప్పుడు చనిపోయిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వమే ఆదుకోవాలి. గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఉచితంగా వైద్యమందించాలి. వారు కోలుకునే వరకు దగ్గరుండి పర్యవేక్షించాలి. మృతుల కుటుంబాల్లో విద్యార్హతలను బట్టి రైల్వేశాఖలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలి.

- దండంరాజు రాంచందర్ రావు,
9849592958

ఎవరిమేలు కోసం ఇథనాల్ పరిశ్రమలు?

సూర్యాపేట జిల్లా మోతె మండలం రావిపహాడ్ గ్రామం వద్ద బయో ఫ్యూయల్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ ఇథనాల్ తయారీ కర్మాగారం 34 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్నది. స్థానికుల అభిప్రాయ సేకరణ లేకుండానే ప్రభుత్వం అన్ని రకాల అనుమతులిచ్చింది. ఇథనాల్ పరిశ్రమతో ప్రజలకు మేలుకంటే నష్టమే ఎక్కువని పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు,మేధావులు హెచ్చరిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. ఇది ఎవరి మేలుకోసం ఈ పరిశ్రమలు కడుతున్నారు? ఇథనాల్ ఫ్యాక్టరీ కడితే సాగు, తాగు నీరు, పర్యావరణ కలుషితమై, చుట్టు పక్కల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయనే భయాందోళన గ్రామాలను వెంటాడుతున్నది. సందేహాలను నివృత్తి చేయకుండానే ఏకపక్షంగా ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు సాగుతున్నది. నెలల తరబడి ఈ ఫ్యాక్టరీ వద్దని ప్రజలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పైగా అరెస్టులతో ఉద్యమాల్ని ఉక్కుపాదం మోపి అణిచివేయాలని చూస్తున్నది తప్ప, ఈప్రాంత ప్రజల ఆకాంక్షల్ని, ఆవేదనను అర్థం చేసుకునే పరిస్థితిలో సర్కార్, స్థానిక నాయకులు లేకపోవడం సిగ్గుచేటు. ప్రజల అభిప్రాయాన్ని స్వీకరించని పాలన ప్రజాపాలన ఎలా అవుతుంది? రాష్ట్రంలో 30 ఇథనాల్ ఫ్యాక్టరీలు నిర్మాణం కోసం కేంద్రం అనుమతులిచ్చింది. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే ఈ పరిశ్రమలు ఎందుకోసం? ప్రజలకు ఉపాధి,ఉద్యోగాలు ఏమైనా కల్పిస్తున్నారా? లేదంటే ఈ పరిశ్రమల్లో ప్రజలకు ఉపయోగపడేవి ఏమైనా తయారుచేస్తున్నారా? ఇప్పటికైనా ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఇథనాల్ పరిశ్రమల నిర్మాణాల్ని రద్దు చేయాలి.

- అనంతుల మధు,
9505866698

పేదలకిస్తే ఉచితాలు...పెద్దలకిస్తే రాయితీలా?


ఎస్.వీరయ్య

ఉచితాలతో సోమరితనం పెరుగుతుందని అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఉచితాలంటే ఏమిటి? రాయితీల మర్మం ఏమిటి? ఇదే ఇప్పుడు చర్చనీయాంశం. మరోవైపు రాష్ట్రంలో రాహుల్‌గాంధీ కులం ఏమిటి, మతం ఏమిటని బీజేపీ నాయ కులు ప్రశ్నించారు. వెలమలు ఎందరు? రెడ్లు ఎందరు? అన్న చర్చ మరొకరు ప్రారంభించారు. రాష్ట్రంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. ఉచితాలకు, కులగణనకు ఉన్న సంబంధం కూడా పరిశీలించాలి. ఎరువులు, పురుగుమందుల మీద ఇచ్చే సబ్సిడీలు రైతులకు పెట్టుబడి భారం తగ్గిస్తాయి. విద్యుత్తు, మంచినీరు, రేషన్ సరుకుల మీద ఇచ్చే సబ్సిడీలు, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పేద కుటుంబాల మీద భారం తగ్గిస్తాయి. వృద్ధులకు, మహిళలకు, వికలాంగులకు ఇచ్చే పింఛన్లు వారి రోజువారీ ఆదాయానికి తోడవుతాయి. ఎంతోకొంత కొనుగోలు శక్తి పెంచుతాయి. కేంద్ర బడ్జెట్‌కు ముందురోజు ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే రిపోర్టు, ప్రజల కొనుగోలు శక్తి పడిపోయినందువల్ల సరుకుల అమ్మకాలు తగ్గాయని చెప్పింది. ఉపాధి అవకాశాలు పడిపోయాయని, ధరలు పెరిగాయని, ఆహార సరుకుల ధరలు మరింత పెరిగాయని తేల్చింది. ఆర్థిక వ్యవస్థ మీద వీటి పర్యవసానాలు తీవ్రంగా ఉన్నాయని హెచ్చరించింది. రానున్న కాలంలో అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించే పన్నులు మన ఎగుమతులకు ఆటంకాలు కానున్నాయని కూడా చెప్పింది. ఇప్పటికే మన ప్రధాని అమెరికా పర్యటనలో, పన్నులు పెంచి తీరుతామని మోడీ ముఖం మీదనే చెప్పారు ట్రంప్. అంటే సరుకులు దేశంలో అమ్ముడుపోవు. విదేశాల్లో అమ్ముకునే అవకాశాలూ తగ్గిపోతాయి. ఇది రానున్న ప్రమాదం. గత ఐదేండ్లుగా నెలసరి వేతన జీవులకు, స్వయం ఉపాధి కార్మి కులకు నిజవేతనాలు పడిపోయాయని ఆర్థిక సర్వే రిపోర్టు స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం వెచ్చించే ప్రతి రూపాయి ప్రజల కొనుగోలు శక్తి పెంచుతుంది. ధరల పెరుగుదలతో ప్రస్తుతం పేదల ఆదాయం తిండికే సరిపోతున్నది. పారిశ్రామిక సరుకులు కొనగల స్థితి లేదు.

అందుకే పేదలకు ప్రభుత్వం ఏ రూపంలో ఆర్థిక సహాయం చేసినప్పటికీ అది బట్టలు కుట్టించుకోవడానికో, చెప్పులకో, టూత్ బ్రష్‌కో, టూత్ పేస్టుకో, ఆడపిల్లల బొట్టుబిళ్లలకో, పౌడర్ డబ్బాల కొనుగోళ్లకో ఉపయోగిస్తారు. ఇందుకు భిన్నంగా రాయితీల పేరుతో పాల కులు బడాబాబులకు లక్షల కోట్ల రూపాయలు కట్టబెడుతున్నారు. ఫలితంగా వారి ఆస్తులు పెంచుకుంటున్నారే తప్ప పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించేవైపు వారి దృష్టి లేదు. ముఖేశ్ అంబానీ కొడుకు పెండ్లికి రూ.ఐదు వేల కోట్లు ఖర్చు చేశారు. పెండ్లికొడుకు ఉంగరం ఖర్చు 9.5కోట్లు. చేతి గడియారం విలువ 22కోట్లు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను



ఇలాంటి దుబారా ఖర్చులకు వినియోగిస్తున్నారు. ఈ డబ్బును పెట్టుబడిగా వినియోగిస్తే ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు, ఉత్పత్తి పెంచవచ్చు. అది స్థూల జాతీయోత్పత్తిని పెంచుతుంది. గతంలో మోడీ ప్రభుత్వం పది శాతం కార్పొరేట్ పన్ను తగ్గించడం ద్వారా ప్రభుత్వం వదులుకున్న ఆదాయం ఏటా రూ.ఒక లక్షా నలభైఐదు వేల కోట్లు. ఇది పెట్టుబడుల్లోకి రాలేదని, బడాబాబులు ఆస్తులు పెంచుకున్నారని తర్వాత తేలింది. రాయితీల పేరుతో వీరికిచ్చేవన్నీ ఉచితాలు కాదా? కార్మికులు కంపెనీల్లో, వ్యవసాయ కూలీలు భూమి మీద పని చేస్తారు. యజమానులు వీరికి తగిన వేతనం చెల్లించటంలేదు. ఫలితంగా వారి ఆదాయం తిండి ఖర్చుకే సరిపోవడంలేదు. వీరికి కనీసం నెలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని ఆదేశించడానికి పాలకులు సిద్ధంగా లేరు. ప్రభుత్వం సహాయం చేయవలసింది ఈ పేదలకు. కానీ యజమానులకే రాయితీలిస్తున్నది ప్రభుత్వం. సమాజంలో సరుకులు బడాబాబులు మాత్రమే కొంటే సరిపోదు. ప్రజలందరూ కొనుగోలు చేసినపుడే ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుంటుంది. అంబానీ అయినా, అదానీ అయినా, కార్మికుడైనా, వ్యవసాయ కార్మికుడైనా ఒక మనిషి వాడేది ఒక సబ్బు, ఒక టూత్ పేస్టు, ఒక టూత్ బ్రష్. 143కోట్ల మంది ప్రజలకు ఆర్థిక సహాయం అందితే 143కోట్ల సబ్బులు, బ్రష్‌లు, పేస్టులు అమ్ముడవుతాయి. ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఈమాత్రం సోయి లేని పాలకులు కష్టం చేసేవారికి ఇచ్చే సబ్సిడీలు, సహాయాలను ఉచితాల పేరుతో ఈసడించుకుంటూ లాభాలు పీల్చే జలగల్లాంటి బడాబాబులకు మాత్రం రాయితీలు గుప్పిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వాడే ప్రతి మాటా, చేసే ప్రతి వ్యాఖ్య ఆచితూచి చేయటం అవసరం. న్యాయమూర్తులు చెప్పే మాటల ప్రభావం సమాజం మీద ఎక్కువగా ఉంటుంది. బాధ్యతారహిత పాలకులు న్యాయమూర్తుల వ్యాఖ్యలను దుర్వినియోగం చేస్తారు.

కుటుంబ ఆదాయంలో విద్య, వైద్యం, ఇంటి కిరాయిలకే మూడొంతులు పోతున్నది. మిగిలిన పావు వంతు మాత్రం ఇతర కుటుంబ అవసరాలకు వెచ్చించవలసి వస్తున్నది. ప్రభుత్వం విద్య, వైద్యం ఉచితంగా అందిస్తూ, అందరికీ ఇంటి సౌకర్యం, చవకగా ప్రయాణ సౌకర్యం, కనీస వేతనాలు, ఉపాధి అవకాశాలు, రైతులకు మద్దతు ధర కల్పించి సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థను అమలు జరిపితే ఎవరూ ఇన్నిరకాల సంక్షేమ పథకాలు కోరుకోరు. కానీ ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వం వీటిని కార్పొరేట్ సంస్థలకు వదిలేసింది. దీని ఫలితమే పెరుగుతున్న ఆర్థిక అసమానతలు. కొనుగోలు చేసే ప్రతి సరుకు మీదా సాధారణ ప్రజలు పన్ను కడుతున్నారు. నిజానికి ప్రభుత్వానికి అందు తున్న పన్ను ఆదాయంలో అత్యధిక భాగం సాధారణ ప్రజలు చెల్లించేదే. పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌లు ఏది చెపితే అదే సిద్ధాంతం అవుతున్నది. బడాబాబులకు ఏది లాభం అనుకుంటే అదే వీరు చెపుతున్నారు. అవే పాలకుల విధానాలు అవుతున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వరంగ సంస్థలు, సహకార రంగం, సంక్షేమ రాజ్యం అన్న నినాదాలు ఇట్లా వచ్చినవే. నిజానికి సంక్షేమ పథకాల పేరుతో పెద్దఎత్తున ప్రభుత్వం ఖర్చు పెట్టాలని పెట్టుబడిదారీ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ చెప్పారు. అందుకే దీన్ని 'కీనిషియన్ సిద్ధాంతం' అంటారు. సంక్షేమ పథకాలు, నిరుద్యోగ భృతి, ఆహార సబ్సిడీ, ధరల స్థిరీకరణ తదితర పేర్లతో ప్రభుత్వం జోక్యం చేసుకుని పెద్ద ఎత్తున ఖర్చు చేయాలన్నాడు. ఆదాయాన్ని బట్టి పన్ను విధించాలన్నాడు. 70వ దశకంలో ప్రారంభమైన సంక్షేమ పథకాలన్నీ ఈ సిద్ధాంతం పర్యవసానమే. ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్‌ల ఏర్పాటుకు సహకరించిన ఆర్థికవేత్త కీన్స్. ఆ ప్రపంచబ్యాంకు విధానాలే ఇప్పుడు మన దేశాన్ని వెన్నాడుతున్న విషయాన్ని చూస్తున్నాం. బడాబాబుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వరంగం, సహకార రంగం స్థానంలో ఇప్పుడు ప్రయివేటీకరణ తెచ్చారు. సంక్షేమ రాజ్యం స్థానంలో మార్కెట్ ఆర్థిక వ్యవస్థ అన్నారు. సంక్షేమ పథకాలను ఉచితాలని హేళన చేస్తున్నారు. వీటితో ప్రజల కొనుగోలుశక్తి తగ్గి ఆర్థిక వ్యవస్థలు చితికిపోయాయి. ప్రపంచంలో అనేక దేశాల్లో ప్రజల్లో అశాంతి ప్రబలింది. ఇప్పుడు ఈ బడాబాబుల సమర్థకులే ప్రపంచబ్యాంకు రూపంలో ప్రజల సంక్షేమం, సమ్మిళిత అభివృద్ధి పేరుతో సుద్దులు వల్లిస్తున్నారు. అంటే బడాబాబుల ప్రయోజనాల కోసం అవసరమైనపుడు సంక్షేమ పథకాలనీ, లేనప్పుడు ఉచితాలనీ మాట్లాడతారు. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా నిజ వేతనాలు, ఉపాధి అవకాశాలు పడిపోయాయి. నిరుద్యోగం, ధరలు పెరిగాయి. ప్రజల్లో అసంతృప్తి విస్తరించింది. ఇది ప్రతిఘటన రూపం తీసుకోకుండా కులాల చుట్టూ, మతాల చుట్టూ ప్రజల భావోద్వేగాలు పెంచుతున్నారు.

దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీల్లోనే పేదరికం, నిరుద్యోగం అత్యధికం. దీనికితోడు తరతరాలుగా సమాజాన్ని కులవివక్ష పట్టి పీడిస్తున్నది. ఒకవైపు కులవ్యవస్థ, భూస్వామ్య సంబంధాలు, మరోవైపు పెట్టుబడిదారీ విధానం విస్తరణ ఫలితంగా ఆర్థిక, సామాజిక అసమానతలు వేగంగా పెరుగుతున్నాయి. అందుకే కులగణన సమస్య ముందుకొచ్చింది. కుల వ్యవస్థ కొనసాగించాలన్న ఆరెస్సెస్ విధానం ఫలితంగా మోడీ సర్కారు కులగణనకు నిరాకరిస్తున్నది. జనగణనతో పాటు కులగణన చేయవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. ఆ సమాచారం ఆధారంగా ఆర్థిక, సాంఘిక, సామాజిక అసమానతల నిర్మూలనకు అవసరమైన విధానాలు రూపొందించవచ్చు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కులగణనను కేవలం రిజర్వేషన్ల చుట్టూ తిప్పుతున్నారు. రాహుల్‌గాంధీ కులం గురించి, మతం గురించి బీజేపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కులగణన నుంచి మోడీ ప్రభుత్వం తప్పించుకుంటున్న తీరుపై ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ వివాదం. అంతేకాదు, కులాంతర మతాంతర వివాహాలు ఆరెస్సెస్-బీజేపీలకు గిట్టవు. మోడీ కులం గురించి చర్చ పెడుతున్నందువల్లనే రాహుల్‌గాంధీ కులం అడుగుతున్నామని అనడంలో అర్థం లేదు. మోడీ తాను బీసీ అని చెప్పుకోవడం వల్లనే, అది నిజమా కాదా అన్న చర్చ సహజంగానే సాగుతున్నది. తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణనలో కూడా అనేక లోపాలుంటాయి. కానీ వాటిని ప్రశ్నించే నైతిక అర్హత బీజేపీకి లేదు. కేంద్ర ప్రభుత్వమే కులగణన చేపడితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన సర్వేలో గానీ, కేసీఆర్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో గానీ ఉన్న లోపాలు పక్కకు పోతాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్‌కు కూడా సుప్రీంకోర్టు తీర్పు ఆటంకంగా ఉన్నది. కేంద్ర ప్రభుత్వం చట్టం చేయడమే దీనికి పరిష్కారం. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ ఎన్నికల వాగ్దానం మేరకు శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపాలి. కేంద్రం మీద ఒత్తిడి చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇవి పక్కనపెట్టి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు వెలమల సంఖ్య, రెడ్ల సంఖ్య చుట్టూ చర్చ తిప్పుతున్నారు. కులాల కుంపటికి తెర లేపుతున్నారు. కులగణనను కులాల కుంపటికి దిగజార్చుతున్నారు. ఇది పాలకవర్గాల సహజ లక్షణం. కుల వ్యవస్థ, కుల వివక్ష నిర్మూలన వీరికి నచ్చదు. అందుకే కుల దురహంకార దాడులకు వ్యతిరేకంగా ఈ పార్టీల నాయకులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ, మంత్రులు గానీ స్పందించరు. బాధితులకు అండగా నిలవరు. ఇలాంటి సందర్భాలలో కేవలం కమ్యూనిస్టులు మాత్రమే బహిరంగంగా బాధితులకు అండగా నిలవటం మనం చూస్తున్నాం. ■


కుటుంబ ఆదాయంలో విద్య, వైద్యం, ఇంటి కిరాయిలకే మూడొంతులు పోతున్నది. మిగిలిన పావు వంతు మాత్రం ఇతర కుటుంబ అవసరాలకు వెచ్చించవలసి వస్తున్నది. ప్రభుత్వం విద్య, వైద్యం ఉచితంగా అందిస్తూ, అందరికీ ఇంటి సౌకర్యం, చవకగా ప్రయాణ సౌకర్యం, కనీస వేతనాలు, ఉపాధి అవకాశాలు, రైతులకు మద్దతు ధర కల్పించి సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థను అమలు జరిపితే ఎవరూ ఇన్నిరకాల సంక్షేమ పథకాలు కోరుకోరు. కానీ ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వం వీటిని కార్పొరేట్ సంస్థలకు వదిలేసింది. దీని ఫలితమే పెరుగుతున్న ఆర్థిక అసమానతలు. కొనుగోలు చేసే ప్రతి సరుకు మీదా సాధారణ ప్రజలు పన్ను కడుతున్నారు. నిజానికి ప్రభుత్వానికి అందు తున్న పన్ను ఆదాయంలో అత్యధిక భాగం సాధారణ ప్రజలు చెల్లించేదే.

సమ సమాజ నిర్మాణం - సామాజిక న్యాయం


డి.జనక మోహనరావు
8247045230

సామాజిక న్యాయం అంటే వ్యక్తికి సమాజానికి మధ్య న్యాయమైన సంబంధం. సరళంగా చెప్పాలంటే, సమాజంలో సంపద, అవకాశాలు, హక్కుల పంపిణీ పరంగా న్యాయాన్ని ఇది సూచిస్తుంది. జాతి, లింగం, మతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వంతో జీవిస్తున్నా రనే భరోసా ప్రజల్లో కలగాలి. చట్టబద్ధమైన పాలన ద్వారా సామాజిక ఆర్థిక అసమానతల సవాలును ఎదుర్కోవడం దీని లక్ష్యం. ఒక దేశం అభివృద్ధి బాటలో పయనించాలంటే అక్కడ ఉండే ప్రజల సహకారం అవసరం. దీనికి ప్రజలందరికీ వివక్ష లేకుండా సామాజిక న్యాయం అందించ బడాలి. ఒకవేళ సరైన రీతిలో సామాజిక న్యాయం అమలు కాకపోతే అక్కడ ప్రజల్లో అసంతృప్తి పేరుకుని ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు చెలరేగుతాయి. అనేక దేశాల్లో ఇలాంటి నిరసనలు ఈ కాలంలో పెరగ డాన్ని మనం గమనించొచ్చు. సమాజంలో వనరులు, అవకాశాలు, విశేషాధికారాల నిష్పాక్షిక, సమాన పంపిణీని సామాజిక న్యాయం అంటారని ప్లేటో తాను రాసిన " ది రిపబ్లిక్" గ్రంథంలో ప్రస్తావించారు. ఆధునిక కాలంలో ఇది పంతొమ్మిదో శతాబ్దం ప్రారంభంలో పారిశ్రామిక విప్లవ అనం తరం పెట్టుబడిదారీ దోపిడీకి బలైపోతున్న మానవ శ్రమకు పరిష్కారం చూపించి సమానత్వ సమాజా లను సృష్టించే లక్ష్యంగా యూరప్ అంతటా జరిగిన పౌర విప్లవాల సమయంలో ఉద్భవించింది.

సామాజిక న్యాయం సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు మెరుగ్గా పనిచేసేలా చేస్తుంది. పేదరికం, అసమానతలు, సామాజిక ఉద్రిక్తతలను తగ్గిస్తుంది. చట్టపరమైన, రాజకీయ, ఆర్థిక, ఇతర పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రజలు సంపద, ఆరోగ్యం, శ్రేయస్సు, న్యాయం, సమాన ప్రాప్తిని కలిగి ఉంచుతుంది. ఇంకా ఆర్థిక పరంగా, సామాజిక న్యాయ ప్రయత్నాలు సాధారణంగా జాతి, లింగ, మతం వంటి సమూహ గుర్తింపు లేదా జనాభా లక్షణాల ద్వారా నిర్వచించబడిన వివిధ సమూహాల ఆర్థిక స్థితిని పెంచడానికి ప్రయత్నిస్తుంది. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న నిర్వహించ బడుతుంది. చట్ట పరంగా ఎలాంటి వివక్షత, తారతమ్యం లేకుండా ప్రజలందరికీ సమన్యాయం జరగాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చిన రోజుకు గుర్తుగా, పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలను అధిగమించడానికి చేయవలసిన కృషికోసం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నేడు నిర్వహించుకుంటారు. "సామాజిక న్యాయం కోసం ప్రపంచ కూటమి- అంతరాలను తగ్గించి పొత్తులను నిర్మించడం." అనే ఇతివృత్తాన్ని ఈ ఏడాది తీసుకున్నారు. దేశాల్లో అంతర్గతంగా, విభిన్న దేశాల మధ్య శాంతి, భద్రతను సాధించడానికి, నిర్వహించడానికి సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం ఎంతో అవసరమని, అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛల పట్ల గౌరవం లేనప్పుడు సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం పొందలేమని ఈ దినోత్సవం గుర్తిస్తుంది. పేదరిక నిర్మూ లన, పూర్తి ఉపాధి, గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడం, లింగ సమానత్వం, సామాజిక శ్రేయస్సు, అందరికీ న్యాయం పొందడంలో అంత ర్జాతీయ సమాజం ప్రయత్నాలను మరింత బలోపేతం చేయడానికి ఈ దినోత్సవం దోహదపడుతుంది. సమాజం తన సామాజిక వనరులను ఎలా విభజిస్తుందో దానిలో న్యాయాన్ని ఇది నొక్కి చెబుతుంది. సామాజిక న్యాయం సామాజిక సంస్థల్లో హక్కులు బాధ్యతలను ఏర్పరుస్తుంది. సహకార ప్రయోజనాలు, ఖర్చుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావడానికి అనుమతిస్తుంది. పన్నులు, సామాజిక బీమా, ప్రజారోగ్యం, ప్రజా విద్య, ప్రజాసేవలు, కార్మిక చట్టం, మార్కెట్ నియంత్రణ అనేవి సమాన అవకాశాలు, సంపద పంపిణీని నిర్ధారించడంలో ఇది సహాయపడే విధంగా ఉంటుంది. నేడు రష్యా-ఉక్రెయిన్, పాలస్తీనా-ఇజ్రాయిల్ యుద్ధాల వల్ల వేలాది మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి. ఈ దేశాల మధ్య సామరస్యాన్ని పెంపొందించి దేశ ప్రజలకు భరోసానిచ్చే విధంగా ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయస్థానం జోక్యం చేసుకోవడం తక్షణ అవసరం.



మనదేశంలో సామాజిక న్యాయం సమస్య సామాజిక సమానత్వంతో ముడిపడి ఉంది. స్వాతంత్ర్యం సమయంలో సామాజిక సమా నత్వం, సామాజిక న్యాయం అనే భావన రాజ్యాంగ నిర్మాతలను బాగా ప్రభావితం చేసింది. సోషలిస్ట్, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర వంటి పదాలను అదే కారణంతోనే రాజ్యాంగ ప్రవేశికలో చేర్చబ డింది. అన్ని వర్గాల ప్రజలను ఎటువంటి సామాజిక భేదం లేకుండా న్యాయంగా చూసుకోవడమే సామాజిక న్యాయం. ఇది సమాజంలోని పేద, బలహీన వర్గాల తరగతులు, మహిళల సమస్యలు, సంపద, జీతం, ఆస్తిలో స్పష్టమైన అసమానతలను తొలగిస్తుంది. కానీ ఈ దశాబ్దకాలంగా చూస్తే నేడు అధికారంలో ఉన్న పాలకులు దేశాన్ని మతప్రాదికన పాలించడం ఆందోళనకరం. విభజించు, పాలించు విధానాన్ని అవలంభించడంతో రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య అసమా నతలు పెచ్చుమీరుతున్న పరిస్థితి. సందదంతా కొద్ది మంది సంపన్నులకు చెందేలా చూడటం పేద, ధనిక మధ్య అంతరాలు పెరగడానికి కారణం. "పంపిణీ న్యాయం" అని పిలువబడే సామాజిక, ఆర్థిక న్యాయాల కలయిక. ప్రవేశిక కింద భారతీయులందరికీ అవకాశం, హోదాలో సమానత్వం హామీ ఇవ్వ బడింది. సామాజిక పురోగతికి సామాజిక న్యాయాన్ని ఒక సమర్థవంతమైన సాధనంగా మార్చడానికి, విధానాలు సరిగ్గా, నిష్పాక్షికంగా అమలు చేయబడతాయని పాలకులు హామీనివ్వడం చాలా ముఖ్యం. మన దేశంలో సామాజిక న్యాయం రాజ్యాంగం ఆర్టికల్స్ ద్వారా దేశ ప్రజలకు హామీ ఇస్తుంది. ఆర్టికల్ 15(1) మతం, జాతి, కులం, లింగం లేదా పుట్టిన ప్రదేశం ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. ఆర్టికల్ 16(1) అందరికీ సమానావకాశాలు కల్పిస్తుంది. ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిర్మూలించి దాని ఉనికిని నిషేధించింది. ఆర్టికల్ 19 దేశ ప్రజల ప్రాథమిక హక్కులను ప్రతిబింబిస్తుంది. 23, 24 ఆర్టికల్స్ దోపిడీకి వ్యతిరేకంగా ప్రాథమిక హక్కులను కల్పిస్తున్నాయి. ఆర్టికల్ 38 ప్రజల సంక్షేమాన్ని పెంపొందించడానికి ఒక సామాజిక క్రమాన్ని రూపొందించాలని రాష్ట్రాన్ని నిర్దేశిస్తుంది.

జీవితం అర్థవంతంగా, గౌరవంతో జీవించగలిగేలా ఉండాలంటే, మన రాజ్యాంగంలో పొందుపరచబడిన విధంగా అందరికీ న్యాయం చేయడం, వారి హక్కులను కాపాడడం చాలా ముఖ్యం. ఇది సమాజంలోని పేదలు, బలహీన దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాల బాధలను తగ్గించడానికి ఒక సాధనం. ఆరోగ్యం, విద్య సౌకర్యాలను అందించడం ద్వారా మానవ వనరుల పరిరక్షణకు సహాయపడుతుంది. సమాజంలో కులవ్యవస్థ, అంటరానితనం, ఇతర వివక్షత వంటి సవాళ్లను నిర్మూలించడానికి దోహదపడుతుంది. అదనపు కట్నం, ఆడ భ్రూణహత్యల వంటి దురాచారాల్ని రూపుమాపేలా చేస్తుంది. ఇది తగ్గుతున్న లింగ నిష్పత్తి, బాలికలకు పరిమిత విద్యా అవకాశాల సమస్యల్ని కూడా పరిష్కరిస్తుంది. అన్ని వర్గాల ప్రజలకు సామాజిక, ఆర్థిక స్థితి, వారి ఆర్థిక వనరులతో సంబంధం లేకుండా సామాజిక న్యాయాన్ని అందించేందుకు పాలకులు కృషి చేయాలి. పిల్లలకు సంబంధించి బాలకార్మిక, బాల్యవివాహం, పోషకాహార లోపం, మహిళల పట్ల లింగ వివక్షత, పిల్లలపై వేధింపులు, అశ్లీలత, శిశు మరణాలు లేకుండా చూడాలి. మైనార్టీలకు సంబంధించి అన్ని సమస్యలు పరిష్కరించి వారికి భరోసాగా నిలవాలి. అందరికీవిలువలతో కూడిన విద్యనందించాలి. దళితులు, గిరిజనులకు రాజ్యాంగ పరమైన హక్కులు కల్పించబడాలి. మహిళలకు అన్ని హక్కులు అమలు కావాలి. ఎటువంటి వివక్ష లేకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలి. ఇలా సామాజిక సమస్యల్ని, సవాళ్లను పరిష్కరించి ముందుపోయినప్పుడే సమ సమాజం నిర్మాణం సాధ్యం.

(నేడు ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం)

మిర్చికి కనీస మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించాలి

- రైతుల కడుపు కొడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు : రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-దామరచర్ల

మిర్చి పంటకు కనీస మద్దతు ధర రూ.25 వేలు ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కల్లేపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో మిర్చి రైతులతో మాట్లాడి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు పండించిన మిర్చికి ధర దారుణంగా పడిపోతున్నదన్నారు. గతేడాది క్వింటాకు రూ.25 వేలు ఉంటే ఈ ఏడాది రూ.12 వేలకు తగ్గిందన్నారు. కేంద్ర, ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు లేకుండా చేస్తున్నాయని, ఫలితంగా మిర్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిర్చి మార్కెట్ ఏర్పాటు చేసి మద్దతు ధర నిర్ణయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటకాలంలో వ్యాపారులు మార్కెట్లలో ధరలు తగ్గించడం, రైతుల నుంచి సరుకు వ్యాపారులకు చేరిన తర్వాత ధరలను రెట్టింపు చేయడం ప్రతి ఏటా జరుగుతున్నదన్నారు. ఒకవైపు వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయి మరోవైపు దిగుబడులు బాగా తగ్గాయని అన్నారు. ఎకరాకు 30, 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా క్రిమికీటకాల వల్ల ఎకరాకు దిగుబడి 12 క్వింటాళ్లకు తగ్గిందన్నారు. రైతులకు ఎకరాకు రూ.1.5లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం పెట్టిన పెట్టుబడులు కూడా రాని స్థితి ఉందన్నారు. వ్యవసాయ మార్కెట్లలో ప్రభుత్వ నియంత్రణ పెరగాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మిరపకు మంచి ధర ఉన్నందున వ్యాపారులకు పోటీగా మార్క్‌ఫెడ్ ద్వారా రూ.25వేలకు క్వింటాల్ కొనుగోలు చేసినప్పటికీ ఎలాంటి నష్టం రాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, వినోద్ నాయక్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్ర నాయక్, జిల్లా నాయకులు దయానంద్, రైతులు దీరావత్ మాలు నాయక్, దీరావత్ సైదా, సక్రు, మంగ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి సీఎం రేవంత్ నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో గల తన నివాసంలో శివాజి చిత్రపటానికి సీఎం పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, బండ్లకృష్ణ మోహన్ రెడ్డి తదితరులు

16వేల మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్ సరఫరా సంస్థల సీఎమ్‌డీలు వరుణ్‌రెడ్డి, ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. 16వేల మెగావాట్ల డిమాండ్‌ను అధిగమించడంతో విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క అత్యసరంగా విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 18వేల మెగావాట్ల వరకు సరఫరా నెట్‌వర్క్ ఉన్నదనీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు ఆయనకు వివరించారు. 2024 మార్చి 8న నమోదయిన 15,623 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండును ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీ విద్యుత్ సంస్థలు అధిగమించాయి. అలాగే దక్షిణ డిస్కంలో సైతం 10 వేల మెగావాట్ల డిమాండ్ దాటిందని ఆ సంస్థ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. బుధవారం 10,049 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదయ్యిందన్నారు. 2024 ఫిబ్రవరిలో రాష్ట్ర విద్యుత్ వినియోగం 267.23 మిలియన్ యూనిట్లు ఉండగా, ఇప్పుడు 290.84 మి.యూ.,కు పెరిగింది. యాసంగి సీజన్, వేసవికాలం ప్రభావంతో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశమున్నదని విద్యుత్ సంస్థల అధికారులు తెలిపారు.

త్రిఫ్ట్ పథకాన్ని యథాప్రకారం కొనసాగించాలి

- సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలి : మంత్రి తుమ్మలకు తెలంగాణ చేనేత కార్మిక సంఘం వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్రిఫ్ట్ పథకాన్ని యథాప్రకారం కొనసాగించాలనీ, చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు పాలకవర్గం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రుల నివాస సముదాయంలో చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌కు తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రతినిధుల బృందం వినతిపత్రాన్ని అందజేసింది. కార్యక్రమంలో ఆ సంఘం సలహాదారులు కూరపాటి రమేశ్, రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి ముషం నరహరి, తదితరులు పాల్గొన్నారు. చేనేత పరిశ్రమ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలని మంత్రిని చెరుపల్లి కోరారు. నూలు సబ్సిడీ కింద నగదు బదిలీ పథకం ద్వారా కార్మికునికి రూ.2వేలు, అనుబంధ కార్మికులకు వెయ్యిరూపాయలు ఇవ్వాలని విన్నవించారు. చేనేత కార్మికులకు హౌస్‌కమ్ వర్క్‌షెడ్‌లను హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్ బోర్డు నుంచి మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. చేనేత కార్మికులకు ఆరోగ్యబీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం కింద కార్మికులకు రూ.5 లక్షల చొప్పున కొత్త రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. చేనేత కార్మికులు సంక్షేమం కోసం చేనేత అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి దానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.1200 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని విన్నవించారు. చేనేత కార్మికుల సమస్యలు, సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణపై కమిషనర్‌తో గురువారం సమావేశం నిర్వహిస్తామని బృంద సభ్యులకు మంత్రి తుమ్మల హామీనిచ్చారు.

ముందున్నవి ఐదు సవాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో ముఖ్యమంత్రి, ఢిల్లీ ప్రధాన కార్యదర్శి, ఢిల్లీ ప్రధాన హోంశాఖ కార్యదర్శి ఉంటారు. ఈ అధికారం అధికారుల బదిలీలు, నియామకాలు, క్రమశిక్షణకు సంబంధించిన విషయాలకు సంబంధించి లెఫ్టినెంట్ గవర్నర్‌కు సూచనలు ఇవ్వగలదు. దీని అర్థం ఢిల్లీలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి అధికారులను నియమించే, బదిలీ చేసే లేదా నియమించే హక్కు లేదు. ఈ నేపథ్యంలో ఢిల్లీ నూతన ప్రభుత్వం ఎలా ముందుకు సాగుతుందో అన్నదే హాట్ టాపిక్.



మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల అమలు అంత ఈజీ కాదు

గతంలో మత రాజకీయాలతో నెట్టుకొచ్చిన బీజేపీకి.. ఈ సారి అలాంటి పప్పులు ఉడకవన్న సంగతి తెలిసి.. పైకి జనం గురించే ఆలోచిస్తున్నట్టు మ్యానిఫెస్టోను ప్రకటించింది. ఢిల్లీలోని పేద మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ప్రతిజ్ఞ చేసింది. సమస్య ఏమిటంటే పంజాబ్ ప్రభుత్వం నెలకు రూ. 1,000 కూడా ఇవ్వలేకపోతోంది. మహారాష్ట్రలో కూడా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేయడంలో ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన రికార్డు ఇప్పటివరకు చాలా పేలవంగా ఉంది. ఢిల్లీలో కూడా గత ప్రభుత్వం ఉచిత విద్యుత్తు, ఉచిత రవాణాను అందించలేకపోయింది. బీజేపీ తన మ్యానిఫెస్టోలో ఢిల్లీ ప్రజలకు రూ.10 లక్షల వరకు ఉచిత చికిత్సను అందించనున్నట్టు హామీ ఇచ్చింది. ఆయుష్మాన్ యోజన ద్వారా రూ. 5 లక్షల వరకు చికిత్స అందిస్తామని, మిగిలిన రూ.5 లక్షలు ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం ఇస్తుందని ఆ పార్టీ తెలిపింది. దీంతో పాటు ఓపీడీ సౌకర్యాలు , ల్యాబ్ పరీక్షలు కూడా ఉచితమని హామీ ఇచ్చింది. వీటిని అమలు చేయటం అంత సులభం కాదని నిపుణులు అంటున్నారు.

బలమైన ప్రతిపక్షంగా ఆమ్‌ఆద్మీ

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ పట్టు ఇంకా తొలగిపోలేదని బీజేపీకి బోధపడింది. ఆప్ ఓడిపోయిన ఓట్ల సంఖ్య కంటే కాంగ్రెస్ 14 సీట్లలో ఎక్కువ ఓట్లు పొందింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం సమయాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని అధిష్టానం సూచిస్తున్నది. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందున, వారి స్వరం మరింత పదునుగా మారనున్నది. అసెంబ్లీ లోపల ఆమ్ ఆద్మీ పార్టీ సంఖ్యా బలంతో పాటు.. బయట ఆమ్ ఆద్మీ పార్టీ ప్రణాళికాబద్ధంగా చేస్తున్న సన్నాహాలను ఎదుర్కోవడం బీజేపీ ప్రభుత్వానికి అనుకున్నంత సులువుకాదు.

మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ)పై ఇప్పటికీ ఆప్ నియంత్రణ

ఎంసీడీ ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ నియంత్రణలో ఉంది. సామాన్యులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత దీనిదే. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీకి ఎలాంటి మద్దతు లేదు. అయితే కేంద్రం ముందు రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది..ఎంసీడీని రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించడం. రెండు.. కమిషనర్ల ద్వారా కార్పొరేషన్‌ను నడపడం.

శిథిలమైన ఢిల్లీ ఇమేజ్ మారుతుందా.!

ఢిల్లీ రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎటు చూసినా చెత్త కొండలే. డ్రయినేజీలు పొంగిపొర్లుతూ రోడ్లపై ప్రవహిస్తున్నాయి. మురికివాడల్లోనే కాదు, జనావాసాల్లో కూడా జీవించడం కష్టంగా మారింది. వేసవి వచ్చిందంటే చాలు నీరు, విద్యుత్ కొరత ఏర్పడుతోంది. ఈ సమస్యలన్నింటినీ ఒకేసారి పరిష్కరించడం అంత సులభం కాదు.

వేసవి ముగిసిన వెంటనే వర్షాలు ప్రారంభమవుతాయి. ఈ వర్షాలకు ముందు వీధుల్లో నీరు నిలిచిపోకుండా నిరోధించడానికి, తక్కువ వర్షపాతంలోనే ప్రాంతాలు మునిగిపోకుండా నిరోధించడానికి, చాలా పెద్ద ఎత్తున పనులు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రజలకు అంత ఓపిక లేదు. వారు అన్ని సమస్యలను మంత్రదండంతో పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నారు. ఎంసీడీ, కేంద్ర ప్రభుత్వం ,ఎల్జీ మధ్య సమన్వయాన్ని కొనసాగించడానికి ఓపిక చాలా అవసరం. ఈ ఐదు కారణాలే కాదు. బీజేపీలో ఉన్న అసమ్మతి సెగలు ఎటువైపు దారితీస్తాయోనన్న భయం కూడా అధిష్టాన వర్గాల్లో వ్యక్తమవుతోంది.

మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మరణించారు. పోలీసుల సమాచారం మేరకు బలఘట్ జిల్లాలోని గార్హి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌండ అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఛత్తీస్‌గఢ్‌కు సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాంతంలో జిల్లా పోలీసులు, సిఆర్‌పిఎఫ్, కోబ్రాకు చెందిన 12 సంయుక్త బృందాలు తనిఖీలు నిర్వహిస్తుండగా మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులు ప్రారంభించడంతో తాము ఎదురుకాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని, అయితే దట్టమైన అటవీ ప్రాంతం ఆసరాగా వారు పారిపోయారని చెప్పారు. అలాగే, సంఘటనా స్థలం నుంచి మూడు రైఫిల్స్, రోజువారీ వినియోగ వస్తువులను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు, ఈ ఎన్‌కౌంటర్ ఘటన సందర్భంగా పోలీసు బలగాలకు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అభినందనలు తెలిపారు. 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్ణయానికి అనుగుణంగా తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందని తెలిపారు.

ఎన్‌హెచ్‌సీ సిబ్బందికి వేతనాలు చెల్లిస్తాం

- సెర్ప్ సీఈవో హామీ
- వినతిపత్రం అందజేసిన ఎన్‌పీఆర్‌డీ బృందం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 74 నైబర్ వుడ్ సెంటర్ల(ఎన్‌హెచ్‌సీ)లో పని చేస్తున్న 225మంది కార్యకర్తలు, ఆయాలకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేస్తామని సెర్ప్ సీఈఓ దివ్య హామీనిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో ఇదే విషయంపై సెర్ప్ సీఈఓకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) బృందం వినతిపత్రం అందజేసింది. వారిలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్, కోశాధికారి ఆర్ వెంకటేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 225 మంది సిబ్బంది 15 ఏండ్ల నుంచి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని అన్నారు. సెర్ప్‌లో పని చేస్తున్న అనేక మంది ఉద్యోగస్తులను రెగ్యులర్ చేస్తున్న ప్రభుత్వం ఎన్‌హెచ్‌సీ కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలను, ఆయాలను ఎందుకు రెగ్యులర్ చేయడం లేదని ప్రశ్నించారు. వారిని రెగ్యులర్ చేసి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిది నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వేతనాలు చెల్లించడంలో జిల్లా స్థాయిలో డీపీఎంలు తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లిస్తాం:సెర్ప్ సీఈఓ హామీ

రాష్ట్రంలో ఎన్‌హెచ్‌సీ కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలకు, ఆయాలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని సెర్ప్ సీఈఓ దివ్య హామీ ఇచ్చారు. పెన్షన్ రానటువంటి కార్యకర్తలకు, ఆయాలకు పెన్షన్స్ మంజూరు చేస్తామని భరోసానిచ్చారు.

డిప్యూటీ సీఎంకు థ్యాంక్స్-టీజీపీఈజేఏసీ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రామగుండం థర్మల్ స్టేషన్ (1x800 మెగావాట్లు)ను టీజీ జెన్‌కో ద్వారానే నిర్మించాలనే ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) తెలిపింది. ఈ మేరకు బుధవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కను సచివాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల అభీష్టం మేరకు రామగుండంపై నిర్ణయం తీసుకున్నామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. 1999 నుంచి 2004 వరకు నియమితులైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాలు కొనసాగించాలనీ, సబ్‌స్టేషన్లు కట్టేటప్పుడే ఆపరేటర్లను నియమించాలని, విద్యుత్ సంస్థల్లో పదవీ విరమణ పొందిన ఖాళీల్లో పదోన్నతులు కల్పించాలని కోరారు. డిప్యూటీ సీఎంను కలిసినవారిలో జేఏసీ కో చైర్మెన్ శ్రీధర్, వైస్ చైర్మెన్ అనిల్‌కుమార్, కో కన్వీనర్లు బీసీ రెడ్డి, వజీర్, తులసీనాగరాణి, తాజుద్దీన్‌బాబా, సదానందం, నరేష్ తదితరులు ఉన్నారు.

తొందర పడి చేర్చుకోవద్దు

- పార్టీ ఇబ్బందుల్లో ఉంటే పారిపోతారు : రాష్ట్ర ఇన్‌చార్జులు, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్టీని బలోపేతం చేయడానికి చాలా మందిని తొందరపడి చేర్చుకుంటారని, కానీ సిద్ధాంతపరంగా బలహీనంగా ఉన్నవారు పార్టీ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పారిపోతారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ పునరుద్ధరించే వ్యూహాన్ని చర్చించడానికి రాష్ట్ర ఇన్‌చార్జులు, పార్టీ ప్రధాన కార్యదర్శులతో ఖర్గే సమావేశం నిర్వహించారు. కొత్తగా నిర్మించిన పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో బుధవారం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ, పార్టీ ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు, బిజెపి ఓటర్ల జాబితాలో కొత్త పేర్లను జోడిస్తుందని, ఈ రిగ్గింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపాలని అన్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం నిరంతర సమస్యలుగా ఉన్నాయని, ఈ సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమ ర్శించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి, ప్రతికూల పరిస్థితుల్లో కూడా మనతో ఒక శిలలా నిలబడే వ్యక్తులను మనం ప్రోత్సహించాలని అన్నారు. 'రాజ్యాంగాన్ని కాపాడండి' ప్రచారం కొనసాగుతోందని ఆయన అన్నారు. ఇది వచ్చే ఏడాది పాటు కొనసాగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా వివిధ కార్యక్రమాలు, సమావేశాలు వంటివి నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, బికె హరిప్రసాద్, జైరామ్ రమేష్, మాణిక్‌రావ్ థాకరే, భూపేశ్ బఘేల్, సుఖ్‌జిందర్ రంధావా, మాణికం ఠాగూర్, అవినాష్ పాండే, అల్కా లాంబా, దీపా దాస్ మున్షీ, ఖాజీ నిజాముద్దీన్, కృష్ణ అల్లవారు, అజయ్ కుమార్ లల్లు, జితేంద్ర సింగ్, రజనీ పాటిల్, కుమారి సెల్జా, కన్హయ్య కుమార్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఇన్‌చార్జ్‌ల సమావేశానికి హాజరయ్యారు.

ఘనంగా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు

- ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ
- కులగణన పేరుతో బీసీలకు కాంగ్రెస్ అన్యాయం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తి కావస్తున్న తరుణంలో పార్టీ రజతోత్సవ వేడుకలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించబోతున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓ వైపు పార్టీ రజతోత్సవ సంబరాలను ఏడాదంతా నిర్వహిస్తూనే, మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల తరుపున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఏప్రిల్ 10 నుంచి 27 వరకు సభ్యత్వ నమోదు, రెండో వారంలో ప్రతినిధుల సభ, 27న భారీ బహిరంగ సభ ఉంటుదని వెల్లడించారు. అ తర్వాత అక్టోబర్, నవంబర్‌లో పార్టీ అధ్యక్షుని ఎన్నిక ఉంటుందని తెలిపారు. విద్యార్థి, మహిళా విభాగాలు సహా పార్టీ అనుబంధ విభాగాలను మరింత పటిష్ట పరచాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు.. ఇందు కోసం త్వరలో పార్టీ సీనియర్ నేతలతో కూడిన సబ్ కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రారంభిస్తామని వివరించారు. "కాంగ్రెస్ ఏడాది పాలనలో 400 మంది రైతులు, 50 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆటో డ్రైవర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆత్మహత్యలు ఆగడం లేదు. ఎండా కాలం రాకముందే తాగునీటి సమస్య, కరెంట్ కోతలు తలెత్తాయి. విద్య, వైద్యాన్ని పేదలకు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని కేటీఆర్ విమర్శించారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించడంలో ఎనిమిది మంది ఎంపీలున్న బీజేపీ, కాంగ్రెస్‌లు విఫలమయ్యాయని ఆరోపించారు. ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలుంటే గతంలో లాగా కేంద్రం మెడలు వంచేందుకు పోరాడేదని గుర్తు చేశారు. కులగణన పేరిట కాంగ్రెస్ సర్కార్ బీసీలకు అన్యాయం చేసిందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఏ ప్రాతిపదికన ఇస్తారో చెప్పాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ (భూ క్రమబద్ధీకరణ పథకం) అమలులో వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలు ప్రగతిపై బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం జరిగింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం అమలులో వేగం పెంచే కార్యక్రమంలో భాగంగా 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్లాట్ కొనుగోలుదారులకు ఈ రాయితీని మార్చి 31 వరకు వెసులుబాటు కల్పించింది. దీంతోపాటు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిష్టర్ చేసుకోని వారికి, లే అవుట్లో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు పలు వెసులుబాటు కల్పించింది. ఒక లేఅవుట్‌లో10 శాతం ప్లాట్లు రిజిష్టర్ అయి ఉండి మిగిలిపోయిన 90 శాతం ప్లాట్‌లకు ఎల్ఆర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్‌కు అవకాశం కల్పించారు. వీరు కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా 31లోగా ఎల్ఆర్ఎస్ చేసుకుంటే, 25శాతం రాయితీ కల్పించింది. పేద ప్రజలు, నాలుగేండ్ల నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం గురించి ఎదురు చూస్తున్నారని పేర్కొంది. పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ఎల్ఆర్ఎస్ అమలులో భాగంగా పలు వెసులు బాటు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలనీ, వాటి విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించింది. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ఎల్ఆర్ఎస్ పథకాన్ని సులభతరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకనుగుణంగా అధికారులు పని చేయాలని దిశా నిర్దేశం చేసింది. దీనికోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ కోసం సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దనే చెల్లింపులు చేసి ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పురపాలక పట్టణ అభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ బుద్ధప్రకాష్ జ్యోతి, గృహనిర్మాణ కార్పొరేషన్ ఎమ్‌డీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధతకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన తర్వాత వాటిని ఆమోదించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. కులగణనపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. బీజేపీకి చెందిన కేంద్రమంత్రి బండి సంజయ్, జీ కిషన్‌రెడ్డి ముస్లింలను బీసీ జాబితా నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. దీనికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఘాటుగా స్పందించారు. సచార్ కమిషన్ సహా పలు నివేదికల్ని ఆయన ప్రస్తావించి, అప్పట్లోనే ముస్లింలను బీసీలుగా గుర్తించారనీ, బాధ్యత కలిగిన కేంద్ర మంత్రి పదవుల్లో ఉండి, ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని హెచ్చరించారు. మరోవైపు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారకరామారావు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన తప్పుల తడక అంటూ విమర్శలు చేశారు. అయితే దీనిపై 2015, 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సకల జనుల సర్వే నివేదికలను ప్రస్తావించేందుకు ఆపార్టీ నేతలు జంకుతున్నారు. దీన్ని ప్రస్తావిస్తే, ఆ నివేదికలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తుందనే భయం వారిని వెంటాడుతుంది. దీనిపై ఇప్పటికే గత అసెంబ్లీ సమావేశాల్లో అధికారపక్షం ఎంఐఎం సహకారంతో బీఆర్ఎస్ తీరును తీవ్రంగా ఎండగట్టింది. అయితే మరోసారి కులగణన చేస్తే, బీఆర్ఎస్ శ్రేణులు సహకరిస్తాయని కే తారకరామారావు ప్రభుత్వానికి సవాలు విసిరారు. అనూహ్యంగా దాన్ని స్వీకరించిన ప్రభుత్వం ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు కులగణన సర్వేలో పాల్గొనని వారికోసం మరో అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. దీనికోసం మూడు ఆప్షన్లను కూడా ప్రకటించారు. దీనితో బీఆర్ఎస్ ఇరుకున పడింది. తొలివిడత కులగణన సర్వేలో 3,54,75,554 మంది ప్రజలు పాల్గొన్నారని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర జనాభాలో ముస్లిమేతర బీసీ జనాభా 1,64,09,179 మంది (46.25 శాతం) ఉన్నారనీ, బీసీ ముస్లింలు 35,76,588 మంది (10.08 శాతం) ఉన్నారని పేర్కొన్నారు. ఎస్సీ జనాభా 61,84,319 మంది (17.43 శాతం), ఎస్టీ జనాభా 37,05,929 మంది (10.45 శాతం), అగ్రవర్ణ ముస్లింలతో కలిసి మొత్తం ఓసీ జనాభా 56,01,539 మంది (15.79 శాతం) ఉన్నారని లెక్కించిన విషయం తెలిసిందే. కులగణన సర్వేలో కేవలం 3.1 శాతం మంది మాత్రమే పాల్గొనలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. వారు సర్వేలో పాల్గొనేందుకు మరోసారి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. మరి ఈ సర్వేలో అయినా మాజీ సీఎం కే చంద్రశేఖరరావు కుటుంబం పాల్గొంటుందో లేదో చూడాలి!

ఆ తర్వాతే ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికలను ఈ రెండు అసెంబ్లీ సమావేశాల తర్వాతే నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఏప్రిల్, మే నెలల్లో విద్యార్థులకు పరీక్షలు ఉన్నందున జూన్‌లో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి జులై రెండోవారానికి ఎన్నికలను పూర్తిచేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. అయితే ఇప్పటికే పలు స్థానిక సంస్థల పాలకమండళ్ల కాలపరిమితి తీరినందున ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- నల్లగొండ జిల్లా పానగల్ బైపాస్ వద్ద, యాదాద్రి జిల్లా దండుమల్కాపురంలో ఘటనలు



నవతెలంగాణ-నల్లగొండక్లాక్‌టవర్ /చౌటుప్పల్‌రూరల్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటనలు బుధవారం నల్లగొండ జిల్లా పానగల్ బైపాస్‌వద్ద, యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద జరిగాయి. నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్ బైపాస్ వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. తమిళనాడు నుండి ఢిల్లీకి మందుల లోడుతో వెళ్తున్న యూపీ77ఏ 9602 ఐచర్ వాహనం పానగల్ ఫ్లైఓవర్ వద్ద కిందికి దిగే సమయంలో ముందుగా వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేశారు. దాంతో ఐచర్ వాహనం అదుపుతప్పి లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో ఐచర్ వాహనం డ్రైవర్ అభిదేవ్ (40), క్లీనర్ రాజీవ్ (39) అక్కడికక్కడే మృతిచెందారు. మృతులు ఇద్దరిదీ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం. ఘటనా స్థలాన్ని టూ టౌన్ సీఐ రాఘవరావు, ఎస్ఐ నాగరాజు సందర్శించి అతి కష్టం మీద క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి సాయికుమార్(33) తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో సూర్యాపేటకు బయల్దేరారు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్దకు రాగానే హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి సూర్యాపేటకు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయికుమార్‌తో పాటు తన ఐదు నెలల కుమారుడు వీరాన్ష్‌కు కూడా తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. హైదరాబాద్‌కు వెళ్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూడండి

ఏకసభ్య కమిషన్ చైర్మెన్‌కు ఎంఆర్‌పీఎస్ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూడాలని వివిధ సంఘాల నేతలు ఏకసభ్య కమిషన్ చైర్మెన్ షమీమ్ అక్తర్‌ను ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కోరారు. నివేదికను సరిగా చూడకుండా మంత్రివర్గం ఆమోదించిందని ఆయన పేర్కొన్నారు. దానిపై పూర్తి చర్చ జరగకుండా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ వెంకటేష్ నేతకాని, బీసీ నేత పృథ్వీరాజ్ యాదవ్, సయ్యద్ ఇస్మాయిల్, తెలంగాణ విఠల్, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జి సోమారపు మురళీ కృష్ణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, రచయిత మచ్చ దేవేందర్ తదితరులతో కలిసి ఆయన కమిషన్ చైర్మెన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పులో హేతుబద్ధత, న్యాయ సమ్మతంగా జరపాలంటూ సూచించిందనీ, అవి ప్రస్తుత కమిషన్ నివేదికలో మిస్ అయ్యాయని వివరించారు. అత్యంత వెనుకబడిన కులాలు బుడగ జంగం, డక్కలి, మాంగ్ వంటి కులాలను అభివృద్ధి చెందిన పంబాల, మన్నె కులాలతో కలిపి వారికి ఒక శాతం రిజర్వేషన్ కేటాయించారని పేర్కొన్నారు. దీంతో వెనుకబడిన కులాలు మళ్ళీ దోపిడీకి గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని కులాలకు న్యాయం జరిగేలా ఎస్సీవర్గీకరణను సంపూర్ణంగా పూర్తి చేయాలని కోరారు.

మార్చి 5 నుంచి ధర్నాలు

- కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా ఎస్‌కేఎం పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. బుధవారం హైదరాబాద్ మార్క్స్‌భవన్‌లో రాష్ట్ర సంయుక్త కిసాన్ మోర్చా సమావేశమైంది. జాతీయ కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 5 నుంచి 13 వరకు విస్తృత ప్రచారం నిర్వహించి, జిల్లా మండల కేంద్రంలో ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, వి. ప్రభాకర్, జక్కుల వెంకటయ్య, కెచ్చెల రంగయ్య, ఆర్.వెంకట్రాములు, నాగిరెడ్డి, కొండల్, నరసింహులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల్లో కోత విధించిందని తెలిపారు. ఎరువుల సబ్సిడీలో తగ్గింపు చేసిందన్నారు. ధరల స్థిరీకరణ నిధి పెంచలేదని చెప్పారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతాంగానికి ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల తో పాటు ప్రజాసంఘాలు, మేధావులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, ఎస్‌కేఎం నాయకులు ప్రభులింగం, మధన్‌రెడ్డి, బి.రాము, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎప్‌సెట్ నోటిఫికేషన్

25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాత పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. ఇతర వివరాల కోసం ఈనెల 20న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అదేరోజు సమగ్ర నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, కర్నూల్ జోన్లలో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కేంద్రం హోం శాఖ నుంచి తెలంగాణకు రూ. 231.75 కోట్లు

- వరదలు, విపత్తుల సాయం ఫండ్స్ రిలీజ్
- మరో నాలుగు రాష్ట్రాలకు సైతం..

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

వరదలు, విపత్తు సాయం కింద తెలంగాణ రాష్ట్రానికి రూ. 231.75 కోట్లను కేంద్రం రిలీజ్ చేసింది. బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో హై లెవెల్ మీటింగ్ (హెచ్ఎస్ సీ) మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో 2024లో వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుఫానులు సంభవించిన ఐదు రాష్ట్రాలకు అదనపు ఆర్థిక సాయంపై చర్చించారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్డీఆర్ఎఫ్) ద్వారా ఐదు రాష్ట్రాలకు రూ.1554.99 కోట్ల అదనపు ఆర్థిక సాయం అందించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మొత్తంలో ఏపీకి అత్యధికంగా రూ. 608.08 కోట్లు, త్రిపురకు రూ.288.93 కోట్లు, ఒడిశాకు రూ.255.24 కోట్లు, తెలంగాణకు రూ. 231.75 కోట్లు, నాగాలాండ్‌కు రూ.170.99 కోట్లు కేటాయించారు. కాగా... ఇప్పటికే ఆయా రాష్ట్రాలకు కేంద్రం విడుదల చేసిన నిధులకు అదనంగా ఈ ఆర్థిక సహాయం ఉంటుందని కేంద్రం వెల్లడించింది. ఎస్డీఆర్ఎఫ్ నిధులను 2024-25 లో కేంద్ర ప్రభుత్వం దేశంలోని 27 రాష్ట్రాలకు రూ.18,322.80 కోట్ల విడుదల చేసింది. 18 రాష్ట్రాలకు రూ.4,808.30 కోట్లు కేటాయించగా, 14 రాష్ట్రాలకు స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ (ఎస్డీఎంఎఫ్) నుంచి రూ.2,208.55 కోట్లు, 8 రాష్ట్రాలకు నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ (ఎన్డీఎంఎఫ్) నుంచి రూ. 719.72 కోట్లు విడుదలయ్యాయి. అలాగే ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన పరిస్థితుల్లో కేంద్రం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడేంత వరకు ఎదురు చూడకుండా ఇంటర్ మినిస్ట్రీయల్ సెంట్రల్ టీంల (ఐఎంసీటీ)ను ప్రభుత్వం నియమించింది.

ట్రాన్స్ జెండర్ వెల్ఫేర్ అకాడమీని ఏర్పాటు చేయాలి

టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ట్రాన్స్ జెండర్ అండ్ హిజ్రా వెల్ఫేర్ అకాడమీని ఏర్పాటు చేయాలని టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ట్రాన్స్‌జెండర్ల విస్తృత స్థాయి సమావేశం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ సమాజంలో అత్యంత వివక్షకు గురవుతున్న ట్రాన్స్ జెండర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనిఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తెలంగాణ హిజ్రా వెల్ఫేర్ అకాడమీ ఏర్పాటు చేసి రూ.1,000 కోట్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 32 మంది ట్రాన్స్‌జెండర్లకు మాత్రమే ట్రాఫిక్ కానిస్టేబుళ్లుగా నియమించిందనీ, అర్హత కలిగిన వారందరికీ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రియా, నగ్మా అరతి, పప్పి, సురేఖ తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్ సీజనల్ పొలిటీషియన్

మళ్లీ అధికారంలోకి వస్తామని పగటికలలు కంటున్నారు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందన్నట్టు ఫాంహౌస్ దాటని దొరవారు అధికారంపై పగటికలలు కంటున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన సీజనల్ పొలిటీషియన్ అనీ, స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయనే ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారం కోల్పోగానే తనకు పదేండ్లు అధికారం కట్టబెట్టిన ప్రజలను మరిచి అజ్ఞాతంలోకి వెళ్లిన కేసీఆర్‌కు 14 నెలల కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగినపుడు గానీ, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు గానీ ఆయనకు ప్రజలు గుర్తుకురాలేదని పేర్కొన్నారు. శాసనసభలో కీలకమైన తీర్మానాలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, భూభారతి బిల్లు, తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సైతం గైర్హాజరయ్యారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెడితే ఆయన ఏనాడూ ప్రజాతీర్పును గౌరవించలేదనీ, అసెంబ్లీ వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షనేత అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలిగానీ కేసీఆర్ తాను ప్రజలు జవాబుదారీగా లేనట్టుగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన అసెంబ్లీకి వస్తే ఆయన పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని ఏవిధంగా తిరోగమనదిశలోకి తీసుకెళ్లారు.. ఆయన చేసిన నిర్వాకాలను, తప్పులను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ 14నెలల్లో తాము సాధించిన అభివృద్ధిని సవివరంగా కేసీఆర్ ముందు ఉంచుతామని తెలిపారు. కాంగ్రెస్ భవిష్యత్తు గురించి కాకుండా కేసీఆర్ తన, బీఆర్ఎస్ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుంటుం దని సూచించారు. పదేండ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ క్షమించదని పేర్కొన్నారు.

త్వరలో భూభారతి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

త్వరలో భూభారతి చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. భూభారతి చట్టానికి సంబంధించి విధి విధానాలు రూపొందించడంపై హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డిలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో బుధవారం మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని భూ సమస్యలను సమగ్రంగా పరిశీలించి పొరపాట్లకు తావు లేకుండా విధివిధానాలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. గత సర్కార్ తెచ్చిన ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు తీరక పోగా, మరింతంగా పెరిగాయని గుర్తు చేశారు. కొన్ని చోట్ల అధికారులు చేసిన తప్పిదాల వల్ల సామాన్య రైతులు తమ భూములు కోల్పోయారని వ్యాఖ్యానించారు. ఆ పరిస్థితి రాకుండా అధికారులు భూ భారతి చట్టాన్ని రూపొందించాలని సూచిం చారు. సామాన్యులకు రెవెన్యూ సేవలు అందుబాటులోకి తేవడం, ప్రభుత్వ ఆస్తులు, భూములను పరిరక్షించడం ప్రధాన బాధ్యతగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తమ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, భూ చట్టాల నిపుణులు సునీల్, సీసీఎల్ఏ సహాయ కార్యదర్శి లచ్చిరెడ్డి, పలు జిల్లాల కలెక్టర్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో 'సీతారామ' కు అనుమతి

మేడిగడ్డపై త్వరలోనే ఎన్‌డీఎస్‌ఏ నివేదిక

పరిశీలనలో జీరో పర్సెంట్ వడ్డీ రుణాలు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ఉదయ్‌పూర్‌లో రెండో రోజు కొనసాగిన వాటర్ సదస్సు : కేంద్ర జలవనరుల శాఖామంత్రి సీఆర్ పాటిల్‌తో మంత్రి భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీతారామ ప్రాజెక్టుకు నెల రోజుల్లో అనుమతులు వస్తాయని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాజస్థాన్‌లో బుధవారం జాతీయ నీటిపారుదల శాఖా మంత్రుల రెండో సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం కేంద్ర జలవనరుల శాఖామంత్రి సీఆర్.పాటిల్, ఆ శాఖా కార్యదర్శి దేబాశ్రీ ముఖర్జీతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ ఎదుర్కొంటున్న అంతర్ రాష్ట్ర వివాదాలను సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులన్నింటికీ క్లియరెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాక ఈ ప్రాజెక్టులకు జీరో పర్సెంట్ వడ్డీతో 50 ఏండ్ల వెసులుబాటుతో రుణాలందించే అంశం కేంద్రం పరిశీలనలో ఉందని ఆయన తెలిపారు. మేడిగడ్డపై ఎన్‌డీఎస్ఏ నివేదికను నెలాఖరులోగా అందించి తదుపరి చర్యలకు సిఫారసు చేసేందుకు కేంద్రం సన్నద్ధమవు తున్నదని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ నుంచి రబీ సీజన్‌లో అధిక నీటిని అక్రమంగా వాడుకుంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలకు చెందిన పూర్వ నల్లగొండ ఖమ్మం జిల్లాల్లో రబీ పంటను కాపాడేందుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వ జోక్యం అవసరమని ఆయన పేర్కొన్నారు. దీనికి ప్రతిస్పందనగా కేంద్ర మంత్రి పాటిల్, నీటి పంపిణీ సమానంగా ఉండేలా, అనధికారిక నీటి వాడకాన్ని నిరోధించే చర్యలు తక్షణమే తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో వివాదాలను నివారించడానికి, పారదర్శకతను మెరుగుపరచడానికి శ్రీశైలం, నాగార్జునసాగర్ ఆనకట్టల్లో, అలాగే కృష్ణానదిపై మొత్తం 35 ప్రాంతాల్లో టెలిమెట్రీ వ్యవస్థలను అమలు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ వ్యవస్థలు నీటి వినియోగాన్ని రియల్-టైమ్‌లో గమనించేందుకు, కేటాయించిన వాటాను పాటించేలా చేయడంలో ఉపయోగపడతాయని అన్నారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ నీటి పర్యవేక్షణను మెరుగుపర్చే వ్యవస్థల ప్రాముఖ్యతను అంగీకరించారు. అనుమతులు త్వరగా మంజూరు చేయడం, నిధులు అందుబాటులో ఉండేలా చేయడం అవసరమని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (పీఆర్ఎల్ఐఎస్), సీతారామసాగర్ ప్రాజెక్ట్, సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్‌లకు నిధులు మంజూరు చేయాలని ఆయన కేంద్రాన్ని కోరారు. పీఆర్ఎల్ఐఎస్‌ను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తి నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కార్యదర్శి ముఖర్జీ, తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సున్నా శాతం వడ్డీతో 50 ఏండ్ల రుణ విరామంతో నిధుల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌కు కావాల్సిన అనుమతులను ఒక నెలలోగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మూసీ నది పునరుద్ధరణకు కేంద్ర సహాయం కోరిన మంత్రి ఉత్తమ్ మూసీ నది శుద్ధి, పునరుద్ధరణ, అలాగే గోదావరి-మూసీ లింక్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని మంత్రి ఉత్తమ్ కోరారు. ఈ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర మంత్రి, తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

మేడిగడ్డ ప్రాజెక్ట్‌పై నెలాఖరులోపు ఎన్‌డీఎస్‌ఏ నివేదిక

కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కింద నేషనల్ డ్యామ్‌సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిర్వహిస్తున్న మేడిగడ్డ ప్రాజెక్ట్ పతనంపై విచారణ ఒక సంవత్సరంగా కొనసాగుతున్నదనీ, తక్షణమే నివేదికను విడుదల చేసి, తదుపరి చర్యల కోసం సిఫారసులు అందించాలని మంత్రి ఉత్తమ్ డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి పాటిల్, నివేదికను నెలాఖరులోగా అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎన్ఎస్‌పీ, శ్రీశైలం ఆనకట్టల మరమ్మతులకు డీఆర్ఐపీ నిధుల వినియోగం

కేంద్రం సూచించిన విధంగా, వరల్డ్ బ్యాంక్ సహకారంతో అందిస్తున్న డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ (డిఆర్ఐపీ) నిధులను నాగార్జునసాగర్, శ్రీశైలం ఆనకట్టల మరమ్మతులకు, అలాగే తెలంగాణలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల నదీ పరిరక్షణ, మట్టినిక్షేపాల తొలగింపునకు వినియోగించాలని సూచించారు.

కృష్ణా జలాల వివాద పరిష్కారానికి కేంద్రం జోక్యం అవసరం

తెలంగాణకు తగిన నీటి వాటా హక్కును సాధించేందుకు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 (కెడబ్ల్యూడీటీ-2) విచారణను వేగవంతం చేయాలనీ, ఇందులో కేంద్రం జోక్యం చేసుకోవాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఈ హామీలతో, తెలంగాణ ప్రభుత్వం తన నీటి హక్కుల కోసం పోరాడుతున్న అంశానికి ఈ సమావేశం సంపూర్ణ మద్దతు పలికిందని ఆయన చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు వేగవంతంగా జరగడానికి రెండు రోజుల పాటు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్ పూర్ లో జరిగిన రెండు రోజుల జాతీయ స్థాయి నీటిపారుదల శాఖామంత్రుల సదస్సు ఎంతగానో దోహదపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

61 ఏండ్లు నిండిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 61 ఏండ్లు నిండిన వీఆర్ఏల వారసులకు జీవోనెంబర్ 81,85 ప్రకారం ఉద్యోగాలను ఇప్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. వీఆర్ఏల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో 20,555 మంది వీఆర్ఏలున్నారని తెలిపారు. వీఆర్ఏల జేఏసీ సమ్మె పోరాట ఫలితంగా 2020 సెప్టెంబర్ తొమ్మిదిన నాటి ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తామంటూ హామీ ఇచ్చి జీవోనెంబర్ 81, 85 విడుదల చేసిందని గుర్తు చేశారు. వివిధ శాఖల్లో 16,758 మందిని సర్దుబాటు చేసిందని తెలిపారు. 61 ఏండ్లు నిండిన వీఆర్ఏలు ఇంకా 3,797 మంది మిగిలిపోయారని పేర్కొన్నారు. వారి వారసులకు ఉద్యోగాలివ్వాలని తెలిపారు. గతంలో పనిచేసిన 20,555 మంది పనులు మిగిలిపోయిన 3,797 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వారి ఆవేదన, ఆందోళనను పరిగణనలోకి తీసుకుని 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏల వారసులకు వెంటనే ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. అందుకోసం ఉత్తర్వులను జారీ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ఎవరికీ మినహాయింపుల్లేవ్ !

(మొదటిపేజీ తరువాయి)

చేసిన ఇంటర్వ్యూను ఫాక్స్ న్యూస్ మంగళవారం రాత్రి ప్రసారం చేసింది. ఆ ఇంటర్వ్యూలోనే ట్రంప్ పై వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 13న వైట్‌హౌస్‌లో ట్రంప్, ప్రధాని మోడీ ద్వైపాక్షిక భేటీకి కొద్ది గంటల ముందే పరస్పర టారిఫ్‌లపై ట్రంప్ ప్రకటన చేశారు. ఈ టారిఫ్ ప్రణాళిక ప్రకారం ఆయా దేశాలు అమెరికా నుండి దిగుమతి చేసుకున్న ఉత్పత్తులపై ఎంత సుంకమైతే విధిస్తాయో అంతే మొత్తాన్ని అమెరికా, ఆయా దేశాల నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై విధించనుంది. ప్రతి ఒక్క విదేశీ వాణిజ్య భాగస్వామికి సంబంధించి ఈ పరస్పర టారిఫ్ అమలవుతుందనిచెప్పారు.

"మనం ఇక్కడ ఏం చేయబోతున్నామంటే, పరస్పరం టారిఫ్‌లు విధించుకోబోతున్నాం. మీరు మా ఉత్పత్తులపై ఎంత సుంకం విధిస్తారో, అంతే మొత్తంలో మేం కూడా మీ ఉత్పత్తులపై సుంకం విధిస్తాం." అని ప్రధాని మోడీకి స్పష్టం చేసినట్లు ట్రంప్ చెప్పారు. "ఈలోగా మోడీ ఏదో చెప్పడానికి ప్రయత్నించారు. నో, నో, మీరేమీ చెప్పొద్దు, నాకిష్టం లేదు. మీరే ఏదైతే చార్జీ విధిస్తారో మేం కూడా అదే చార్జీలు విధిస్తాం. ప్రతి దేశంతోనూ మేం ఇలాగే వ్యవహరిస్తాం." అని తేల్చి చెప్పినట్లు ట్రంప్ చెప్పారు. "ఒకవేళ నేను 25శాతం పన్నులు విధిస్తానని చెప్పాననుకోండి, అబ్బో చాలా ఎక్కువ అంటారు. అందుకే నేను ఏం చెప్పదలచుకోలేదు..మీరేది విధిస్తే, మేం కూడా అదే విధిస్తాం...ఇప్పుడేం జరుగుతుందో తెలుసా? వారు ఆపేస్తారు." అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా నుండి వచ్చే కొన్ని దిగుమతులపై అంటే ఆటో మొబైల్ రంగ ఉత్పత్తులు వంటి వాటిపై భారత్ చాలా పెద్ద మొత్తంలో టారిఫ్‌లు విధిస్తుంది. అమెరికా తయారీ కార్లపై వంద శాతమూ టారిఫ్‌లు విధిస్తారని మస్క్ వ్యాఖ్యానించారు. మోడీతో సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నపుడు భారత్‌పై పరస్పర టారిఫ్‌ల గురించి విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ, "ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా భారత్‌లో అధిక సుంకాలు వున్నాయి. భారత్‌కు విక్రయించడం చాలా కష్టం, అనేక వాణిజ్య అవరోధాలు వుంటాయి, పెద్ద మొత్తాల్లో పన్నులు వుంటాయి." అని అన్నారు. "అందుకే ఇప్పుడు మేం పరస్పర పన్నుల విధింపు చర్యలు అమలు చేస్తున్నాం. ఎవరైనా ఒకవేళ తగ్గించారనుకోండి, మేం కూడా అలానే తగ్గిస్తాం. భారత్ ఏ తరహాలో పన్నులు విధిస్తుందో, మేం కూడా అదే రీతిలో పన్నులు వేస్తాం. ఇదే చాలా సరైన మార్గమని భావిస్తున్నా" అని ట్రంప్ చెప్పారు. అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌లో గత కొద్ది నెలలుగా చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను 'రాజకీయ కారణాల'తోనే బైడెన్ ప్రభుత్వం అక్కడ వుంచేసిందని మస్క్ వ్యాఖ్యానించారు. త్వరలోనే తమ స్పేస్ ఎక్స్ సంస్థ వారిని తీసుకువస్తోందని చెప్పారు.

మాజీమంత్రి హరీశ్‌రావుకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

రాధాకిషన్‌రావులను అరెస్ట్ చేయరాదన్న గత ఉత్తర్వులను పొడిగించింది. తన ఫోన్‌ను ట్యాప్‌చేయించారని చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలని వారిద్దరూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌లను జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదిస్తూ, సుప్రీం కోర్టు సీనియర్ అడ్వొకేట్ సిద్ధార్థలూథ్రా వాదించేందుకు వస్తారని, విచారణను వాయిదా వేయాలని కోరారు. దీనిపై హరీష్ లాయర్ అభ్యంతరం తెలిపారు. పీపీ 3 సార్లు వాయిదా తీసుకున్నారనీ, పోలీసులు మరో పక్క నిందితులను అరెస్టు చేసి వాళ్లతో తమకు అనుకూలంగా వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. దర్యాప్తుపైస్టే ఇవ్వాలని కోరారు. ఇందుకు పీపీ వ్యతిరేకించారు. దీనిపై కల్పించుకున్న హైకోర్టు, వాయిదాలు కోరుతూ పోలీసులు దర్యాప్తు పేరుతో అరెస్టు చేయడాన్ని తప్పుపట్టింది. కేసు దర్యాప్తుపై స్టే విధిస్తూ విచారణను వచ్చే నెల 3కి వాయిదా వేసింది.

ప్రజారోగ్య వైద్యులకు పదోన్నతులు కల్పించాలి

142 జీవో లోపాలను సరిదిద్దాలి : మంత్రి దామోదర రాజనర్సింహతో ప్రభుత్వ వైద్యుల సంఘం సమీక్ష



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజారోగ్య వైద్యులకు నిర్ణీత కాలపరిమితిలో (టైం బౌండ్) పదోన్నతులను కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. జీవో నెంబర్ 142లోని లోపాలను సరిదిద్దాలని కోరింది. బుధవారం హైదరాబాద్ వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కుటుంబ సంక్షేమ శాఖ సమావేశ మందిరంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, డీఎంఈ వాణి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలు ప్రసాద్ రాథోడ్ మంత్రికి వివరించారు. 142 జీవోలోని లోపాలను వెంటనే సవరించాలని కోరారు. ప్రతి జిల్లాకూ డీఎంహెచ్‌వో పోస్టులను మంజూరు చేయాలని తెలిపారు. 33 జిల్లాలకు 66 సివిల్ సర్జన్ జనరల్ లైన్ పోస్టులు (33 డీఎంహెచ్‌వో, 33 అడిషనల్ డీఎంహెచ్‌వో) మంజూరు చేయాలని సూచించారు. ప్రజారోగ్య వైద్యులకు 142 జీవో వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని వివరించారు. ప్రజారోగ్య వైద్యులు పదోన్నతుల్లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. నెల రోజుల్లో ప్రతిపాదనలను పంపించాలంటూ అధికారులను దామోదర రాజనర్సింహ ఆదేశించారని పేర్కొన్నారు. క్యాడర్ స్ట్రెంత్ విషయంలో పోస్టుల సంఖ్య పెంచాలనీ, సివిల్ సర్జన్ పదోన్నతులను వర్టికల్ సీనియార్టీ ప్రకారం (జనరల్ లైన్) ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రవూఫ్, డాక్టర్ దీనదయాళ్, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వినోద్ బాల, డాక్టర్ ఖాన్, డాక్టర్ జయ లక్ష్మీ, డాక్టర్ శిరీష, డాక్టర్ శోభ, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ నవనీత, డాక్టర్ పవిత్ర, డాక్టర్ గీత, డాక్టర్ సత్యవతి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారి టీ స్టాల్ మూసివేత



ట్రేడ్ లైసెన్స్ లేదని బంద్ చేసిన మున్సిపల్ అధికారులు

కేటీఆర్ ఫొటో ఉన్నందునే హోటల్ మూసివేసారని యజమాని ఆరోపణ : ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

ట్రేడ్ లైసెన్స్ లేదంటూ సిరిసిల్ల మున్సిపల్ అధికారులు ఓ చిరు వ్యాపారికి చెందిన టీ స్టాల్ మూసివేసిన ఘటన సిరిసిల్లలో చర్చనీయాంశంగా మారింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన బత్తుల శ్రీనివాస్ గత కొద్ది ఏండ్ల నుంచి బతుకమ్మ ఘాటు వద్ద టీ స్టాల్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా టీ స్టాల్ యజమాని కేటీఆర్ అభిమాని కావడంతో ఆయన పేరు మీద టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం మున్సిపల్ అధికారులు టీ స్టాల్ వద్దకు చేరుకొని ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించలేదని టీ స్టాల్ మూసివేయాలని సూచించారు. హోటల్ పైనే ఆధారపడి జీవిస్తున్నానని మూసివేస్తే ఉపాధి కోల్పోతానని అధికారులకు మొర పెట్టుకున్నాడు. కలెక్టర్ పర్యటనలో భాగంగా బతుకమ్మ ఘాటుకి వచ్చారని టీ స్టాల్ గమనించి వెళ్లిపోయిన తర్వాత మున్సిపల్ అధికారులు వచ్చి టీ స్టాల్‌ను మూసివేసారని బాధితుడు శ్రీనివాస్ ఆరోపించారు. కేవలం కేటీఆర్ ఫ్లెక్సీ పెట్టుకున్నాననే ఇలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు టీ స్టాల్ వద్దకు చేరుకొని శ్రీనివాస్‌కు మద్దతు తెలిపారు. హోటల్ తెరిపించి నిరసన వ్యక్తం చేశారు. దుకాణం మూసివేసి చిరు వ్యాపారి ఉపాధిని దెబ్బతీయొద్దని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, దార్ల సందీప్, సుంకపాక మనోజ్, కత్తెర వరుణ్, సబ్బని హరీష్ ఉన్నారు

ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్

సిరిసిల్లలో చిరు వ్యాపారి బత్తుల శ్రీనివాస్ టీ స్టాల్ మూసివేతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'ప్రతీది గుర్తుపెట్టుకుంటున్నా.. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అంటూ చిరు వ్యాపారి శ్రీనివాస్ హోటల్ వీడియోతో కలిపి ఎక్స్‌లో షేర్ చేశారు.

ఏటీఎం సెంటర్‌లో డబ్బులు డ్రా చేస్తుండగా.. గుండెపోటుతో అడ్వకేట్ మృతి



నవతెలంగాణ-కంటోన్మెంట్

హైకోర్టులో వాదనలు వినిపిస్తూ ఓ లాయర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన జరిగి 24 గంటలకు గడవక ముందే మరో అడ్వకేట్ మరణించారు. హైదరాబాద్ మారేడ్‌పల్లి సీఐ వెంకటేశ్వర్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో అడ్వకేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న చిలకలగూడకు చెందిన వెంకటరమణ (57) సమీపంలోని ఐటీబీ ఏటీఎంకు బుధవారం ఒంటిగంట ప్రాంతంలో డబ్బులు డ్రా చేయడానికి వెళ్లాడు. డ్రా చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమా చారం అందుకున్న మారేడ్‌పల్లి పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
గురువారం | ఫిబ్రవరి 20, 2025 | www.navatelangana.com

డివిజన్ కార్యదర్శిగా రమావత్ సక్రు నాయక్



నవతెలంగాణ-హయత్‌నగర్
సీపీఐ హయత్‌నగర్ డివిజన్ కార్యదర్శిగా రమావత్ సక్రు నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం పార్టీ కౌన్సిల్ సమావేశంలో డివిజన్ కార్యదర్శులను ఎన్నుకోవడం ఆ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. పార్టీ, ప్రజల కోసం అనునిత్యం శ్రమించే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికకు సహకరించిన నియోజకవర్గ కౌన్సిల్ సభ్యులకు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, సరూర్నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహాలకు సక్రు నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

యాకుత్‌పురా ఎమ్మెల్యేకు సేవాలాల్ జయంతి ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-చంపాపేట్
యాకుత్‌పురా నియోజకవర్గం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్‌ను బుధవారం బంజారా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత నియోజకవర్గం సైదాబాద్ మండలం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వినయ్ నగర్ కమ్యూనిటీ హాల్లో భారత గోర్ బంజారా సేవా సమితి ఆధ్వర్యంలో నేడు (గురువారం) నిర్వహిస్తున్న బంజారా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు రావాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా యకుత్‌పురా నియోజకవర్గం భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్, అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సురేందర్, డిప్యూటీ తహసీల్దార్ మురాజ్ హుస్సేన్, డి.రామ్ కోటి, జె. దాసు నాయక్, డెవలప్మెంట్ ఆఫీసర్ రమావత్ థావుర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయిన పెన్ క్యాప్ తొలగింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో
కరీంనగర్ ప్రాంతానికి చెందిన 26 ఏండ్ల యువకుడు.. తనకు ఐదేండ్ల వయసు ఉన్నప్పుడు ఆడుకుంటూ పెన్ క్యాప్ మింగేశాడు. నెల రోజుల నుంచి దగ్గు రావడం, బరువు తగ్గిపోవడం లాంటి లక్షణాలతో బాధపడుతున్నాడు. పది రోజులుగా దగ్గు విపరీతంగా పెరిగిపోయి, నిద్రపోవడానికి కూడా ఏమాత్రం వీలు కాకపోవడంతో వైద్యులను సంప్రదించి సీటీ స్కాన్ తీయించడంతో ఎడమవైపు కింది భాగంలో ఇన్ఫెక్షన్ ఉన్నట్టు తెలిసింది. దీంతో హైదరాబాద్‌కు పంపారు. ఇక్కడ కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో ఆ యువకుడికి సీటీ స్కాన్ చేసి, విషయం తెలుసుకుని దానికి చికిత్స చేసిన కన్సల్టెంట్ క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శుభకర్ నాదెళ్ల వివరాలను వెల్లడించారు. "ఆ యువకుడు ఇక్కడకు వచ్చినప్పుడు సిటీ స్కాన్ చేస్తే లోపల ఏదో గడ్డలా కనిపించింది. ఆ గడ్డ వల్లే ఊపిరితిత్తుల వద్ద ఆటంకం ఏర్పడి.. దగ్గు వస్తోందని భావించాం. దాన్ని తీసేందుకు ప్రయత్నిస్తూ లోపల చూసేసరికి.. పెన్ క్యాప్ కనిపించింది. దాదాపు మూడు గంటల పాటు కష్టపడి, ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోపీ సాయంతో ముందుగా దాని చుట్టూ పేరుకుపోయిన కణజాలాలు, లింఫ్‌నోడ్, కండలను కొద్ది కొద్దిగా తొలగించాం. క్రమంగా అదంతా క్లియర్ అయిన తర్వాత ఆ పెన్ క్యాప్‌ను బయటకు తీసేశాం. ఇన్నేండ్లపాటు ఒక ఫారిన్ బాడీ లోపల ఉండిపోవడం వల్ల ఊపిరితిత్తులు కూడా కొంత దెబ్బతిన్నాయి. అయితే, అక్కడ దెబ్బతిన్న ఇతర భాగాలను సరిచేసేందుకు యాంటీబయాటిక్స్ వాడాం. దాంతో అతను కోలుకున్నాడు. చిన్నపిల్లలు ఆడుకునేటప్పుడు వాళ్లు ఏం చేస్తున్నారో, నోట్లో ఏం పెట్టుకుంటున్నారో గమనించుకోవాలి. అలాంటివి ఏవైనా ఉంటే వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లి, దాన్ని తీయించాలి. లేకపోతే ఇలాంటి తీవ్రమైన సమస్యలు వస్తాయి" అని తెలిపారు.

రోడ్డు రవాణా రంగాన్ని రక్షించాలని నిరసన



నవతెలంగాణ-హయత్‌నగర్
హయత్‌నగర్‌లోని కుంట్లూరు రోడ్డు అడ్డా వద్ద తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాములు హాజరై మాట్లాడారు. నేడు దేశంలో భారతీయ న్యాయ సహితలో ప్రమాదకరమైన సెక్షన్ 106(1), (2)లను రద్దు చేయాలని, రవాణా కార్మికులకు సామాజిక భద్రతా చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఎంవి యాక్ట్ 2019ని రాష్ట్రంలో అమలు చేయొద్దు అని అన్నారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకునే విధంగా కేంద్రం మీద ఒత్తిడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వమే ఆన్లైన్ యాప్ ఏర్పాటు చేసి తక్కువ కమీషన్‌తో కార్మికులకు ఉపయోగపడే విధంగా తీసుకురావాలని, కేరళ తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రభుత్వం మీద ఆర్థిక భారం లేకుండానే చేయాలన్నారు. రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో, క్యాబ్, బస్సు తదితర అన్ని రకాల ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్‌ని, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలన్నారు. ఇన్కమ్ టాక్స్ పరిధిలో లేని అసంఘటిత రంగ కార్మికులకు నెలకు రూ.7500 జీవన భృతి చెల్లించాలని కోరారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పాలసీని రద్దు చేయాలన్నారు. ధరల పెరుగుదలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆహార వస్తువులు, నిత్యవసర వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించాలన్నారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని ఘననీయంగా తగ్గించాలన్నారు. ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్, ఫిట్నెస్ ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రమాద బీమాను ఐదు లక్షలు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఉచిత వైద్యం మొత్తం రవాణా కార్మికులకు వర్తింపజేయాలన్నారు. తదితర డిమాండ్లపై నిరసన వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు నక్క అశోక్ గౌడ్, యూనియన్ నాయకులు గువ్వల రమేష్, రామన్, రామణంపల్లి యాదయ్య, కుర్మా రాజు, సిహెచ్ చిరంజీవి, డి. శ్రీహరి, సదా శ్రీనివాస్, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-హస్తినాపురం
హస్తినాపురం డివిజన్ పరిధిలోని సప్తగిరి హిల్స్ కాలనీలో కార్పొరేటర్ సుజాత నాయక్‌తో కలిసి బుధవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పర్యటించారు. తర్వాత రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల కబ్జాలు, ఆక్రమణలతోనే ఇన్నాళ్లు పాలన సాగించిన కొందరు నాయకులు.. అభివృద్ధి పనుల విషయంలోనూ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో సప్తగిరి హిల్స్ వాసులకు రోడ్లు, డ్రైనేజీ కోసం అడిగితే ప్రజాప్రతినిధులం అని చెప్పుకునే నాయకులు ఇబ్బందులు పెట్టారని, కానీ తమ ప్రభుత్వం కాలనీలకు నిధులు మంజూరు చేసి.. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటిని అందిస్తుందన్నారు. రాజకీయాలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసి ఎల్బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, డివిజన్ల అధ్యక్షులు శశిధర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, కుట్ల నరసింహ యాదవ్, మకుటం సదాశివుడు, వేణుగోపాల్ యాదవ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్
మండలంలోని అనాజీపూర్ గ్రామానికి చెందిన రైతు ఎర్పుల చిన్న రంగయ్య 12 ఫిబ్రవరి 2025న మృతి చెందిన విషయం విధితమే. ఈ విషయం బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు చేగూరి భరత్ కుమార్ దృష్టికి చేరడంతో వెంటనే స్పందించారు. ఈ మేరకు బుధవారం మృతి చెందిన రైతు భార్య ఏర్పుల యాదమ్మకు 25వేల రూపాయల చెక్కును అందజేసి చేయూతను అందించారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మెన్ భరత్ కుమార్ మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘం నిరంతరం రైతుల సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. అకాల మరణం చెందిన రైతు కుటుంబాలకు బాసటగా నిలుస్తూ ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నార్లకొండ జంగమయ్య, వడ్డేపల్లి సతీష్ కుమార్, మేనేజర్ జక్కుల ఐకేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష



నవతెలంగాణ- హయత్ నగర్
పోక్సో కేసులో ఓ నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన విరాల ప్రకారం..హస్తినాపురానికి చెందిన పల్లపు మహేంద్ర. ఇతని స్వస్థలం ప్రకాశం జిల్లా. ఇతను 2023లో ఓ బాలికను పరిచయం చేసుకొని ప్రేమ పేరుతో వేధిస్తూ, ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా ఆదారాలు పరిశీలించి బుధవారం నిందితుడికి ఒక ఏడాది కఠిన జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత తెలిపారు. అదే విధంగా బాధిత బాలికకు రూ.50000 నష్టపరిహారం అందజేశారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ - ఎల్బీనగర్
మత సామరస్యాన్ని నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మహారాజ్‌ని స్మరించుకొని ఆయన ఆశయాలు, లక్ష్యాల కోసమే పోరాడుతామని ఏఐటీయూ నాయకులు సామిడి శేఖర్ రెడ్డి అన్నారు. ఏఐటీయూసీ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి రమావత్ సక్రు నాయక్ ఆధ్వర్యంలో నాగోల్‌లోని ఎస్.ఎ డాంగేభవన్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ హాజరై శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మన్సురాబాదు డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్, గిరిజన సమాఖ్య నియోజకవర్గ కార్యనిర్వాహణ అధ్యక్షులు శంకర్ నాయక్, అనిత, శోభ, పార్వతమ్మ, లింగస్వామి, యాదిగిరిరెడ్డి, హేమలత, మంజు పాల్గొన్నారు.



నవతెలంగాణ-తుర్కయంజాల్
తుర్కయంజాల్ మున్సిపాలిటీలో శివాజీ జయంతి వేడుకలను బుధవారం బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బచ్చిగళ్ళ రమేష్, మాజీ కౌన్సిలర్ కరాడి శ్రీలత అనిల్, గోపీనాథ్ గౌడ్, బాలకృష్ణ గౌడ్, కొలన్ రవీందర్ రెడ్డి, విశాల్ గౌడ్, గుండా కృష్ణ, నిట్టు శివకుమార్, సురేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-చంపాపేట్
ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హరి హర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయం నందు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి బుధవారం ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ వంగ చంద్రారెడ్డి, ఆలయ డైరెక్టర్లు సూర్య ప్రకాష్ గుప్తా పోరెడ్డి రవీందర్ రెడ్డి, లింగాల దశరథ గౌడ్, బొడ్ల మల్లికార్జున్, ఆకుల బిక్షపతి, హరి కృష్ణ, మణిపాల్ రెడ్డి, మిరియాల అంజయ్య, నరేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, అంజయ్య గౌడ్, హనుమాన్ సాగర్, వెంకటేశ్వర రెడ్డి, గురుమూర్తి, రఘునందన్ రెడ్డి, శివారెడ్డి, చీర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ -ఎల్బీనగర్
ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని చైతన్యపురిలోని శివాజీ మహారాజ్ విగ్రహానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ - నాగోల్
ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





నవతెలంగాణ-బడంగ్‌పేట్
బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం బాలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మని గిరీష్, గడ్డం వెంకటేష్‌ల ఆధ్వర్యంలో బుధవారం శివాజీ చౌక్‌లో ఉన్న శివాజీ మహారాజు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నాయకులు అంజా బాలరాజ్, నీరుడు శ్రీరాములు, మర్రి చంద్రశేఖర్, బాలాపూర్ బాబు జగ్జీవన్ రామ్ సంఘ అధ్యక్షులు జొన్నాడ నర్సింగ్ రావు, పగడాల ఉమేష్, ఇబ్రహీం యాదగిరి, గురువని నర్సింగ రావు, మరాటి నరసింహారావు, కిన్నెర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - మీర్ పేట్
ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చందన చెరువు కట్టపైన బీజేపీ మీర్‌పేట్ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.





నవతెలంగాణ- హయత్ నగర్
ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం జడ్జెస్ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు, యువజన నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-కొత్తపేట
ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా కార్పొరేటర్ నాయి కటి పవన్ కుమార్ బుధవారం కొత్తపేట డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంచి రాజేష్, జంగారెడ్డి, సురేందర్, నారాయణ, విజయ, ఉపేందర్ సింగ్, చందు రజక, తోట వం ేపాా ం ద ర్ యాదవ్, రాకేష్ యాదవ్, వెంకట రెడ్డి, సంగీత, పింకీ, శివ, మధు పాల్గొన్నారు.



'తుర్కయంజాల్ సేవ సహకార సంఘ సేవలు అమోఘం'



నవతెలంగాణ-తుర్కయంజాల్
తుర్కయంజాల్ సేవ సహకార సంఘం అభివృద్ధికి చేస్తున్న సేవలు అమోఘం అని హిమాచల్ ప్రదేశ్ అపెక్స్ బ్యాంక్ అధ్యక్షులు అన్నారు. బుధవారం సహకార విద్య/శిక్షణలో భాగంగా హిమాచల్ ప్రదేశ్ అపెక్స్ బాంక్ అధ్యక్షులు, డైరెక్టర్లు, సీనియర్ సిబ్బంది సంఘాన్ని సందర్శించారు. తర్వాత సంఘ అధ్యక్షులు, టీజీ క్యాబ్ వైస్ చైర్మెన్, డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్యను మర్యాదపూర్వకంగా కలిసి.. సంఘ సభ్యులకు అందించే సేవలు ,సంఘ అభివృద్ధికి కోసం చేపట్టిన చర్యలు, పనివిధానం మొదలగు విషయాలను తెలుసుకున్నారు. అనంతరం సంఘ బ్రాంచీలు బీఎన్‌రెడ్డి నగర్, కోహెడాలోని సంఘ గోదాములు సందర్శించి, సంఘ అభివృద్ధిని చూసి సంఘ అధ్యక్షులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సిటీఐ గౌతమ్, డీసీసీబీ ఏజి ఎమ్ శైలజ, హిమాచల్ ప్రదేశ్ డెలిగేట్స్ జీ.బి. శర్మ, శక్తి చంద్ ఠాకూర్, ప్రేమ్ కంషల్, సంఘ సెక్రెటరీ వై.రాందాస్, సంఘ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం



నవతెలంగాణ-మీర్‌పేట్
గృహిణి అదృశ్యమైన ఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదర్శ నగర్ భూపేష్ గుప్తా నగర్ కాలనీ చెందిన కొర్ర అరుణ హౌస్ వైఫ్. ఉదయం తెల్లవారు జామున లేచి చూసేసరికి కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య కనిపించడం లేదని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో భర్త అమర్ సింగ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ కిసర నాగరాజు తెలిపారు.

శ్రీ సప్తగిరి కన్స్ట్రక్షన్ ఎండి బొక్క భీమ్ రెడ్డి.. తన సొంత నిధులతో తుర్కయంజాల్ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆర్చ్‌ను కట్టించారు. ఈ మేరకు బుధవారం ఆ ఆర్చ్‌ను ఆయన ప్రారంభించారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో



'రాజకీయ లబ్దికోసమే సబితమ్మపై విమర్శలు'



నవతెలంగాణ-బడంగ్‌పేట్
కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులతో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, రాజకీయ లబ్దికోసమే బీజేపీ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్ విమర్శలు చేస్తున్నారని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, సీనియర్ నాయకులు పెద్దబావి ఆనంద్ రెడ్డిలు ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దబావి లక్ష్మమ్మ ఫంక్షన్ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేసిన అభివృద్ధి మీ కళ్ళకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆమె చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేసి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తుచేశారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే శ్రీరాములు యాదవ్ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మా ఫంక్షన్ హాల్‌కు నాలాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. బీజేపీ నాయకులే నాలాను కబ్జా చేసిన విషయం మీకు తెలియదా అని మండిపడ్డారు. మా ఫంక్షన్ హాల్ 2007లో ప్రారంభించి, 2009లో నిర్మాణ పనులను పూర్తి చేసి ఆనాటి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ రోడ్డుపై నీవు గతంలో తిరిగినప్పుడు రోడ్డు ఎలా ఉండేదో మీకు తెలియదా అని గుర్తు చేశారు. భూ కబ్జాలు ఎవ్వరు చేశారో ప్రజలందరికీ తెలుసు అని అన్నారు. 11 సంవత్సరాలుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా అభివృద్ధి కోసం మీరు ఎన్ని నిధులు మంజూరు చేయించారో చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుండి ప్రజలు ఇక్కడకు రావటంతోనే గ్రామాలుగా ఉన్న బడంగ్‌పేట్ జనాభా పెరిగి మున్సిపల్‌గా మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడిందన్నారు. గతంలో నాలాను కబ్జా చేసిన బీజేపీ వారిపై ఇరిగేషన్ అధికారులు కేసు నమోదు చేసిన విషయం మీకు తెలియదా అని, విషయం తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మాజీ కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివార్ రెడ్డి, సీనియర్ నాయకులు బీమిడి జంగారెడ్డి, అంజిరెడ్డి, మహేందర్ రెడ్డి, కర్రే కృష్ణ, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-తుర్కయంజాల్
తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేణుగోపాలస్వామి ఆలయ చైర్మెన్ కాటేపల్లి రాఘవేందర్‌రెడ్డి బుధవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులకు రూ.30వేలు విలువచేసే క్రీడా దుస్తులను అందజేసినట్టు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి భాయ్, ఉపాధ్యాయుడు దన్నె రాజు, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, కొండయ్య, ఉమామహేశ్వరి, రాధామాధవి, గణేష్, అమర్‌సింగ్, చంద్రమోహన్, బుడ్డా వెంకటేశ్, యాదయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వందకు వంద శాతం సర్వే జరగాల్సిందే

- బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలో అన్ని వర్గాలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో సామాజిక న్యాయం జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన వంద శాతం పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ అన్నారు. బుధవారం బోడుప్పల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు సర్వేలో పాల్గొనని కుటుంబాలను కలిసి సర్వే చేయాలన్నారు. పూర్తి స్థాయితో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ ఎ.శైలజ, జిల్లా బీసీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఘన్సి, తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన మాజీ మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ బుధవారం మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోడుప్పల్ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా బర్త్ సర్టిఫికెట్లు

- ఆస్పత్రులు పంపించే డేటా ఆధారంగానే సర్టిఫికెట్ల జారీ
- పుట్టిన పిల్లల వివరాలు నమోదు చేయడంలో నిర్లక్ష్యం
- కరెక్షన్ కోసం 'సేవా' కేంద్రాల చుట్టూ తిరుగుతున్న బాధితులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యా సంస్థల్లో అడ్మిషన్ల దగ్గర నుంచి ఆధార్ కార్డ్ వరకు అన్నింటికీ జనన ధ్రువీకరణ పత్రమే కీలకం. సాధారణంగా పాప, బాబు పుట్టగానే బర్త్ సర్టిఫికెట్ (జనన ధ్రువీకరణపత్రం) తీసుకుంటారు. డెలివరీ అయిన ఆస్పత్రి నుంచి డైరెక్ట్‌గా కార్పొరేషన్ ఆఫీస్‌కు పుట్టిన శిశువు వివరాలు వెళతాయి. ఇక్కడి వరకు ఓకే....ఇక్కడి నుంచే కథంతా మొదలవుతోంది... తల్లిదండ్రులు ఎంత కరెక్టు సమాచారం రాసిచ్చినా ఇటు ఆస్పత్రిలోనూ అటూ మున్సిపల్ కార్యాలయంలో పేర్ల ఎంట్రీ సమయంలో దొర్లుతున్న తప్పులు సరిచేసుకునేందుకు తిప్పలు పడాల్సి వస్తోంది. మీ సేవా, సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రుల్లో జన్మించే శిశువుల బర్త్ సర్టిఫికెట్లు తప్పుల తడకలుగా మారుతున్నాయి. ఫలితంగా తల్లిదండ్రులు, దరఖాస్తుదారులు కరెక్షన్ కోసం ఈ-సేవా, మీ సేవా కేంద్రాలతో పాటు మున్సిపల్ సర్కిల్ కార్యాలయాల చుట్టు చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇదే తరహాలో ఒక్కో సర్కిల్‌లో తప్పులు రావటంతో బర్త్, డెత్ లు నమోదు చేసే బాధ్యతలను ఆస్పత్రులకే అప్పగించారు. అయినా తప్పులు తగ్గడం లేదు. నగరంలో పేరుగాంచిన వివిధ సర్కిళ్లలోని సర్కారు ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాలకు సంబంధించిన బర్త్ సర్టిఫికెట్లలో ఎక్కువగా కరెక్షన్లు వస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా బేగంపేట సర్కిల్ పరిధిలోని గాంధీ ఆస్పత్రి, గోషామహల్ సర్కిల్ పరిధిలోని సుల్తాన్ బజార్ గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్, పెట్లబురుజులోని సర్కారు వెటర్నరీ హాస్పిటల్, అలాగే మెహిదీపట్నం సర్కిల్ పరిధిలోని నిలోఫర్ హాస్పిటల్‌తో పాటు మలక్ పేటలోని



పోలీస్ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు జరిగిన డెలీవరీ కేసులకు సంబంధించి జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించి ఒక్కో సర్కిల్‌లో దాదాపు 1000 వరకు కరెక్షన్ ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. వీటి పరిష్కారం కోసం దరఖాస్తుదారులు మీ సేవా, ఈ సేవా కేంద్రాలతో పాటు ఆయా సర్కిళ్లలోని బర్త్, డెత్ రిజిస్ట్రార్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దరఖాస్తుదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఈ సేవా కేంద్రాలతోపాటు కొందరు బ్రోకర్లు వీరిని నిలువుదోపిడి చేస్తున్నట్లు కూడా ఆరోపణలున్నాయి.

నగరంలో దాదాపు 4లక్షలపై జననం

ప్రతీ ఏడాది గ్రేటర్ హైదరాబాద్‌లోని 30 సర్కిళ్లలో దాదాపు 4లక్షల డెలవరీలు(జననాలు) జరుగుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో నివాసముంటున్న వారితోపాటు ఇతర జిల్లాల నుంచి డెలివరీల కోసం హైదరాబాద్‌కు గర్భిణీలు వస్తుంటారు. ఇక్కడ మెరుగైన వైద్యం సదుపాయం అందుతుందన్న నమ్మకంతో వీరిలో కొందరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరుతుంటే, మరికొందరు ప్రయివేటు ఆస్పత్రులల్లో చేరుతుంటారు. అక్కడే డెలవరీలు చేసుకుంటారు. శిశువు జననం తర్వాత సదురు ఆస్పత్రి వారు పూర్తి వివరాలను నమోదు చేస్తారు. శిశువు పుట్టిన తేదీ, సమయంతోపాటు తల్లిదండ్రుల పేర్లు, వారి చిరునామా ఇలా పలు వివరాలను నమోదు చేస్తారు. అయితే కొందరు ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో వివరాలను నమోదు చేస్తున్నారు. మరికొందరు గర్భిణి అడ్మిషన్ సమయంలో ఆధార్ కార్డులో ఉన్న వివరాల ప్రకారం పేర్లను నమోదు చేస్తున్నారు. అయితే పుట్టిన శిశువు పేరు స్థానంలో మేల్ బేబీ, ఫీమేల్ బేబీ అని నమోదు చేస్తున్నారు. మరికొన్ని సమయాల్లో గర్భిణి గానీ, ఆమె సహాయకులు గానీ చెప్పే వివరాలను నమోదు చేస్తున్నారు. అయితే వివరాల నమోదు చేసే క్రమంలో సిబ్బంది అలసత్వం, తొందరపాటు వంటి కారణాలతో తప్పుడు సమాచారం నమోదై, అదే సమాచారం బర్త్ సర్టిఫికెట్లలో తప్పులు వస్తుండటంతో కరెక్షన్ కోసం దరఖాస్తుదారులు ముందుగా మీ సేవా కేంద్రాల్లో అప్లయ్ చేసుకోవాలి. అందుకు నోటరీతోపాటు ఇద్దరు గెజిటెడ్ అధికారుల సంతకాలతో పలు పత్రాలను జతచేయాల్సివుంటుంది. అందుకోసం బాధితులు దాదాపు రూ.500 నుంచి 1000 ఖర్చుచేస్తున్నారు. అప్పటికీ పనికాకుంటే మున్సిపల్ సర్కిల్ కార్యాలయాల చుట్టు చక్కర్లు కొట్టాల్సిందే.

అవగాహన కల్పిస్తాం

బర్త్ సర్టిఫికెట్లలో తప్పులు వస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. ఆస్పత్రిలో చేరిన గర్భిణి వివరాలు, శిశువు వివరాల నమోదు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందితోపాటు ఆస్పత్రి వర్గాలకు అవగాహన కల్పిస్తాం. ఇందుకోసం ఓ సర్క్యులర్‌ను జారీ చేస్తాం.

- డాక్టర్ కె.పద్మజ, చీఫ్ మెడికల్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ

అక్రమ కట్టడాలపై సీపీఐ(ఎం) దీక్ష



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని కొర్రెముల, వెంకటాపురం గ్రామాల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో రెండుల రోజుల దీక్ష చేపట్టనున్నామని సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండలం కార్యదర్శి ఎస్.సబిత, చింతల యాదయ్యలు అన్నారు. బుధవారం పోచారం మున్సిపల్‌లో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశాన్ని ఎస్.సబిత అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ..పోచారం మున్సిపల్ పరిసర ప్రాంతాలలో నిర్మిస్తున్న అనేక ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. జోడిమెట్లలో వెంకటాపురం చెరువు పక్కన బఫర్ జోన్‌లో బహుళ అంతస్తుల భవనాలు, వెంకటాపురం రోడ్డు పక్కన ఎఫ్‌టీఎల్‌లో ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. కొర్రెముల, వెంకటాపురం గ్రామాలలో జీప్లస్ వన్ పర్మిషన్ తీసుకొని జీప్లస్ త్రీ నిర్మాణాలు చేపట్టారని అన్నారు. మామూలుగా ఇంటి పర్మిషన్ తీసుకొని పర్మిషన్ లేకున్నా సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. కాచవాని సింగారంలోని ముత్వల్లిగూడెంలో పర్మిషన్ లేకుండా ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. ఇంతజరుగుతున్నా పోచారం మున్సిపల్ కమిషనర్ చూసీ చూడనట్లుగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ అక్రమ నిర్మాణాలపై సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల కమిటీ పోచారం మున్సిపాలిటీ ఆఫీస్ ఎదుట రెండు రోజుల దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ కడమంచి యాదగిరి,కొయ్యడ చంద్రమోహన్, జి.నాగమణి, కే. అలివేల, చల్లగొండ అరుణ, బి. సునీతదేవి, అనసూర్య పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో నికోలస్ కోపర్నికస్, ఛత్రపతి శివాజీ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్త నికోలస్ కోపర్నికస్, ఛత్రపతి శివాజీ జయంతిని కమలానగర్ ఆఫీసులో స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత నిర్వహించారు. ముందుగా సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి కోపర్నికస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి రిటైర్డ్ ఈసీఐఎల్ అధికారి ఎం.భాస్కర్‌రావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కోమటి రవి మాట్లాడుతూ..నికోలస్ కోపర్నికస్ 16వ శతాబ్దంలో బైబిల్ మత గ్రంథానికి భిన్నంగా సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని రూపొందించి రుజువు చేశారని తెలిపారు. నాడు క్రైస్తవ మత పెద్దలు మత గ్రంథాలకు వ్యతిరేకంగా రూపొందించిన శాస్త్రవేత్తలను, అతి క్రూరంగా హింసించి హతమార్చారన్నారు. అలా కోపర్నికస్ హింసలకు గురయ్యారని చెప్పారు. తన సిద్ధాంతాన్ని ప్రచురణకు 30 ఏండ్లు పట్టిందని, అది బయటికి రాకుండా చాలా ప్రయత్నాలు చేశారన్నారు. చివరకు నిజం బయటకు వచ్చిందన్నారు. ఇలాగే అనేక మంది శాస్త్రవేత్తలు ప్రాణాలు అర్పించారని, వారికృషి ఫలితంగానే నేడు శాస్త్ర సాంకేతిక రంగంలో దూసుకెళ్తున్నామని చెప్పారు. నేటి పాలకులు మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నారని అన్నారు. కుంభమేళా పేరిట జబ్బులను ప్రజలకు అంటగడుతున్నారని చెప్పారు. సోషల్ మీడియా బాధ్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ బడుగు బలహీన వర్గాల నుండి తన స్వయం శక్తితో పోరాడి మొగల్ చక్రవర్తులకు వ్యతిరేకంగా నిలబడి రాజ్యం స్థాపించిన గొప్ప యోధుడని కొనియాడారు. అనంతరం అధ్యక్షులు యాదగిరిరావు, సభ్యులందరూ కోపర్నికస్, ఛత్రపతి శివాజీ చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివన్నారాయణ, శోభ, శారద, సౌమ్య జయరాజ్, రుక్కయ్య, ఎం. భాస్కర్ రావు, కోమటి రవి, ఎం. శ్రీనివాస్, జి. శ్రీనివాసులు, శ్రీనివాసరావు, లింగస్వామి, సత్యం, వెంకన్న, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు మానసికంగా ధృడంగా ఉండాలి



- శ్రీశ్రీ జ్ఞాన మందిర్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ
- జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ ఉచిత రక్త పరీక్షలు

నవతెలంగాణ - జవహర్ నగర్

పిల్లలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండేలా చూసుకోవాలని శ్రీ శ్రీ జ్ఞాన మందిర్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. బుధవారం జవహర్ నగర్ లోని శ్రీ శ్రీ జ్ఞాన మందిర్ స్కూల్‌లో జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులకు ఉచితంగా హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ ప్రారంభించిన ఉచిత పాఠశాలలో ప్రతిరోజు విద్యార్థులకు యోగా, ధ్యానం, సుదర్శన క్రియ నిర్వహించి రాగిజావ, పండ్లు చిరుధాన్యాలను అందజేస్తామన్నారు. హిమోగ్లోబిన్ పరీక్ష శిబిరంలో రక్తహీనత లక్షణాలు కలిగిన విద్యార్థులకు ఉచితంగా ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందజేశారు. రక్తహీనతను అధిగమించడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల కోసం శిబిరం ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ శిబిరంలో పాఠశాల కమిటీ సభ్యులు డాక్టర్ లలిత రామన్, పురుషోత్తం, కో ఆర్డినేటర్ బి. నర్సింగ్ రావు, ఉపాధ్యాయులు కర్నే సురేందర్, నందిని, రమ, తదితరులున్నారు.



'అఖిల కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలి'



- శ్రీ చైతన్య స్కూల్ ఎదుట బీజేపీ నేతల ఆందోళన

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ ఒత్తిడి చేయడంతో పదో తరగతి విద్యార్థిని అఖిల ఈనెల 11న ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా బుధవారం అఖిల కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య స్కూల్ డౌన్ డౌన్, వీవాంట్ జస్టిస్, యజమాన్యం చర్చలకు రావాలి అనే నినాదాలు చేశారు. ఆందోళనను గమనించిన స్కూలు యజమాన్యం విద్యార్థులను ఇంటికి పంపించారు.

యజమాన్యం తీరుపై రాగం అర్జున్, చెర్వుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడదామని చర్చలకు పిలిచి స్కూల్ యజమాన్యం ముఖం చాటేసిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగం అర్జున్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు చెర్వుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రెండు గంటలు ఏనుగు సుదర్శన్ రెడ్డితో కలిసి స్కూల్ బయట వేచిఉన్న తర్వాతే స్కూల్ ప్రతినిధులు చర్చలకు రమ్మంటేనే లోపలికి వచ్చామని, వచ్చాక ఏం మాట్లాడకుండా వెళ్లిపోవడంపై రీజినల్ మేనేజర్ చక్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలకు తోడుగా బీఆర్ఎస్వీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనాథ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు స్కూల్ ఎదుట బైటాయించి బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై కిషన్, సీఐ అద్దాని సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడించి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. యాజమాన్యం గురువారం ఉదయం మళ్ళీ మాట్లాడదామని మధ్యవర్తుల ద్వారా చెప్పించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్, మండల అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్,పాతూరి సుధాకర్ రెడ్డి,మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జకాట ప్రేమ్ దాస్,కృష్ణప్రియ, బీజేవైఎం అధ్యక్షుడు వంశీ విజయ్, మహేష్, వంశీధర్, ఈశ్వర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు చైతన్యమై రాజకీయాలలో రాణించాలి

- కాంగ్రెస్ జవహర్ నగర్ ఓబీసీ సెల్ అధ్యక్షులు వీరభాస్కర్
- బీసీ సెల్ పూర్తి స్థాయి కమిటీ నియామకం



నవతెలంగాణ - జవహర్ నగర్

బీసీలు రాజకీయాలలో చైతన్యవంతమై రాణించాలని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షులు పసుపులేటి వీరభాస్కర్ రావు అన్నారు. జవహర్ నగర్‌లో బీసీ సెల్ పూర్తి స్థాయి కమిటీని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజక వర్గ ఇన్‌చార్జి జంగయ్య యాదవ్, నాయకులు మలిపెద్ది సుద్దిరెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ చైర్మెన్ గువ్వ రవి ముదిరాజు నేతృత్వంలో బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఓబీసీ నూతన కమిటీని ప్రకటించారు. మేడ్చల్ శివాలయంలో హరివర్ధన్ రెడ్డి, రవి ముదిరాజ్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కమ్మరి రమేష్ చారి, జనరల్ సెక్రెటరీగా వాసంశెట్టి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా రెగోటి సురేష్ పద్మశాలి, జాయింట్ సెక్రెటరీలుగా ఇరుగు దిండ్ల వెంకటేష్, శివ కుమార్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్లు యాదగిరి ముదిరాజ్, కావలి నరసింహ ముదిరాజ్, బండి కృష్ణ, కృష్ణ గౌడ్, తిరపతయ్య వడ్డెర, ప్రచార కమిటీ కార్యదర్శిలుగా శ్రీనాథ్‌గౌడ్, వరికుప్పల వెంకటయ్యలను ప్రకటించారు. బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.

చిరు వ్యాపారుల అభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్ రజిత



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లో చిరు వ్యాపారుల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని, సబ్బండ వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం ఉప్పల్‌లో రూ.1.15 కోట్లతో కమ్యూనిటీ సెంటర్ నిర్మాణ పనులకు కాంగ్రెస్ ఉప్పల్ నియోకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డితో కలిసి కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేట్ రజితా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..చిరు వ్యాపారుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగూర్ బాషా, పీరంభి, అల్లా బాషా, ఖాజా మౌలానా, ఖాజా మల్లికార్జున్ , శ్రీనివాస్. కోరుట్ల శ్రీనివాస్, బ్రహ్మాజీ, ప్రవీణ్, సంపత్, శ్రీకాంత్, రామకృష్ణ, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేర్యాలలో బండారి పద్మ దశదిన కర్మ ..రాజకీయ నాయకుల నివాళి







నవతెలంగాణ-కాప్రా

చేర్యాలలోని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయన సోదరుడు బండారి వెంకటరెడ్డి సతీమణి బండారి పద్మ దశదిన కర్మను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సుధీర్ రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మెన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, రావుల శ్రీధర్ రెడ్డి, నందికంటి శ్రీధర్, మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు , ఈనాడు ఎడిటర్ డీఎన్ ప్రసాద్, కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరై బండారి పద్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ ఫేజ్-1 చౌరస్తాలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో, అన్నపూర్ణ కాలనీలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు హాజరయ్యారు.


రైల్వే అండర్ పాస్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌కు ప్రతిపత్రం అందజేత




నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని రైల్వే అండర్ పాస్ పనులను త్వరగా పూర్తి చేయా లని మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్‌లు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు బుధవారం ప్రతిపత్రం అందజేశారు. అనంతరం కౌడే మహేష్ మాట్లాడుతూ రైల్వే అండర్ బస్ పనులు సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. దీనివల్ల చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. అలాగే పలు పుణ్య క్షేత్రాలైన తిరుపతి, షిర్డీ, కాశీ, అయోధ్యలకు రైలు మేడ్చల్ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తున్నా మేడ్చల్ రైల్వే స్టేష న్‌లో ఆగడం లేదని తెలిపారు. ఈ అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు పేర్కొన్నారు. కలిసిన వారిలో బీఆర్ఎస్ నేతల శంకర్, రాజిరెడ్డి ఉన్నారు.



ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు బండారి వెంకట్ రెడ్డి సతీమణి బండారి పద్మ దశదిన కర్మ కార్యక్రమానికి చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరై పద్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, చర్లపల్లి డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ మహేష్, శ్రీకాంత్ యాదవ్, కనకరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. -నవతెలంగాణ - చర్లపల్లి



చర్లపల్లిలో రుద్రగోని లక్ష్మీనరసమ్మ దశదిన కర్మకు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని లక్ష్మీ నరసమ్మ చిత్రపటానికి నివాళుర్పించి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రుద్రగోని రామచంద్ర గౌడ్, కొండా జంగారెడ్డి, సీనియర్ పాత్రికేయులు రుద్రగోని నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు. -నవతెలంగాణ,చర్లపల్లి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
గురువారం | ఫిబ్రవరి 20, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని ఆశీర్వదించాలి



● కోఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్

ఈ నెల 27న జరగనున్న మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ అధినేత డా. వూట్కూరి నరేందర్ రెడ్డికి పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటును వేసి భారీ మెజారిటీతో నరేందర్ రెడ్డిని గెలిపించాలని పీసీసీ అధ్యక్ష బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లాలోని స్థానిక సత్య కన్వెన్షన్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లతో ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర బీసీ, ఎస్సి, ఎస్టి, మైనార్టీ శాఖ ప్రభుత్వ ప్రధాన సహదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కరు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జుక్కల్ శాసన సభ్యులు శ్రీ తోట లక్ష్మి కాంతా రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ అధినేత డా.వి. నరేందర్ రెడ్డి, కోఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 50 వేలకు పైగా ఉద్యోగాలను యువతకు ఇప్పించిందని, అన్ని వర్గాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సర్కార్‌లోనే సముచిత న్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ముందుటుం దని అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రాష్టం ఎంతో అభివృద్ధి చెందబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టభద్రులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్య, గృహ రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలి



● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్, డీసీసీ చైర్మెన్ విజయేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ ఆర్థిక సంవత్సర ముగింపు లోగా విద్య, గహరుణాల లక్ష్యాలను పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్, డీసీసీ చైర్మెన్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డీసీసీ, డీఎల్ ఆర్సీ సమావేశానికి అదనపు కలెక్టర్ అధ్యక్షత వహించి, 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మూడో త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ శాఖల ద్వారా ఆర్థిక సంవత్సర ముగింపులోగా విద్యా, గహరుణాల లక్ష్యాలను పూర్తి చేయాలని బ్యాంకర్లను సూచించారు. వార్షిక రుణ ప్రణాళిక కింద బ్యాంకుల పనితీరు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, ఎజెండా అంశాలు మొదలైన వాటిని సమీక్షించారు. రాబోవు 2025-26 సంవత్సరానికి నాబార్డ్ ద్వారా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కర దీపికను ఆవిష్కరించారు. నాబార్డ్ ప్రతి జిల్లాకూ ప్రతి ఏడాదీ పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ని సిద్ధం చేస్తుంది. ప్రాధాన్యతా విభాగంలో జిల్లాలో అందుబాటులో ఉన్న భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకుని జిల్లాలోని లీడ్ బ్యాంక్ జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేయడానికి వార్షిక జిల్లా క్రెడిట్ ప్లాన్‌ని సిద్ధం చేస్తుంది. దీని ప్రకారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు సంబంధించిన 2025-26 పీఎల్‌పీని బుధవారం కలెక్టర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం రూ.469.66 కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్ లోన్ రూ.893.53 కోట్లు, వ్యవసాయం మౌలిక సదుపాయాలు కోసం రూ.246.31 కోట్లు, అనుబంధ కార్యకలాపాలు కోసం రూ.1383.58 కోట్లు, సూక్ష్మ చిన్న, మధ్యతరహా సంస్థల కోసం రూ.3042.33 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగ రుణాలు, రంగాలు విద్య హౌసింగ్ సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రెన్యూవబుల్ ఎనర్జీ మొదలైన వాటి కోసం రూ.2121.73 కోట్లు సహా జిల్లా మొత్తం ప్రాధాన్యతా రంగానికి రూ.28157.15 కోట్లుగా నాబార్డ్ ఆర్థిక అంచనా వేసింది. జిల్లాలో అన్ని బ్యాంకులు చురుకుగా రుణాలిచ్చి 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని డీసీసీ చైర్మెన్ సూచించారు. ఈ సమావేశంలో నాబార్డ్ డీడీఎం అఖిల్ పున్నా, ఎల్‌డీఎం శివ ప్రసాద్, ఆర్బీఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, బ్యాంక్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మెట్రో కారిడార్ ఏర్పాటు చేయాలి

● ప్రజా సంఘాలు
● ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల, షాపూర్ నగర్ పారిశ్రామిక వాడ బొంతపల్లి పారిశ్రామిక వాడ వరకు విస్తరించిన కుత్బుల్లాపూర్ ఓ.ఆర్.ఆర్ నుంచి గండి మైసమ్మ, సూరారం, షాపూర్ నగర్ బాలానగర్ వై జంక్షన్ కూకట్‌పల్లి వరకు మెట్రో కారిడార్లు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్, ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసే మెట్రో కారిడార్ల వల్ల పేద ప్రజలకు, కార్మికులకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందని అన్నారు.గత పది సంవత్సరాల నుంచి బాలనగర్ నుంచి గండి మైసమ్మ వరకు ప్రయాణికులు,పాదాచారులు విపరీతమైన రద్దీ, ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడ్చల్ షామీర్ పేట్ కారిడార్లు విస్తరిస్తున్నారని దానిలో భాగంగానే ఓ.ఆర్.ఆర్ నుంచి వై జంక్షన్ వరకు కారిడార్ని విస్తరించాలని వినతిలో కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ సమస్య పట్ల నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. జాతీయ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు భూదల అమర్ బాబు, జాతీయ దళిత సేన అధ్యక్షులు అవిజ జేమ్స్, జై భీమ్ సేన అధ్యక్షులు మంచినీటి అంజన్న, దళిత ఐక్యవేదిక కన్వీనర్ ఎన్.వై.అశోక్, కార్మిక నాయకులు ఎం.జనార్ధన్ కలిసిన వారిలో ఉన్నారు. స్పందించిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ విషయాన్ని సత్వరమే సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకను బుధవారం శిల్పకళావేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మెన్ శ్రీ శిరీష్ తుర్లపాటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు కేవలం పాఠశాల విద్యలో మాత్రమే కాకుండా, సాంస్కృతిక, శారీరక అభివృద్ధిలో కూడా ముందుండాలని సూచించారు. ఈ వేడుకలో స్కూల్ డైరెక్టర్ రాధికా తుర్లపాటి, ప్రిన్సిపాల్ తులసీకుమారి నంద, హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఐరిస్ ఫ్లోరెట్స్‌కు చెందిన అన్ని శాఖల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు కరాటే, సంగీతం, సాంప్రదాయ నృత్యాలు, హైకోర్టుప్రదర్శన లాంటి విభిన్న ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వీరి ప్రతిభను ప్రోత్సహిస్తూ, స్కూల్ యాజమాన్యం విద్యార్థుల ఆకాంక్షలకు సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో ఆసక్తికరంగా పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటిన చిన్నారులు



● తేజశ్రీ, ఖుషీ శర్మలను అభినందించిన ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్షల్ ఆర్ట్స్ విభాగం నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన బ్రిలియంట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ స్టూడెంట్ "చిన్నారి తేజశ్రీ, ఖుషీ శర్మ" లు ఇటీవల బిర్లా ప్లానిటోరియం నందు కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో "ఇంటర్నేషనల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ 2025" అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుధవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో "ఇంటర్నేషనల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ 2025" అవార్డు గ్రహీతలు బీఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారి తేజశ్రీని అభినందిస్తూ రానున్న రోజుల్లో ఉత్తమ ప్రతిభతో మరిన్ని అవార్డులు సాధించి కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు మంచి పేరును తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు దేవేందర్ గౌడ్, కుత్బుల్లాపూర్ కేబుల్ టీవీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ ప్రెసిడెంట్ టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మెంబర్, 2 తెలంగాణ జర్నలిస్ట్ దుర్గారావు, టీయూడబ్ల్యూజే, ఐజేయు ప్రెస్ క్లబ్ మెంబర్, విజన్ ఆంధ్ర జర్నలిస్ట్ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన సంక్షేమ సంఘం సభ్యులు..

126-జగద్గిరిగుట్ట డివిజన్ షిర్డీ హిల్స్ కాలనీ నూతన సంక్షేమ సంఘం అధ్యక్షులు బండ మహేందర్, కోశాధికారి కె.వినోద్ యాదవ్‌లు కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ సంఘాలు ప్రజాప్రతి నిధులకు, కాలనీవాసులకు నిత్యం అందుబాటులో ఉండి అభివృద్ధికి వారధులుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామీ దేవస్థానం మాజీ చైర్మెన్ వేణు యాదవ్, బస్తీ వాసులు నగేష్, పోచయ్య, స్వామీ దాస్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కృష్ణారావు జన్మదిన వేడుకలు







నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినం సందర్భంగా.. నియోజకవర్గ బీఆర్‌ఎస్ మహిళా నాయకులు, ఆయన నివాసం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో గత మూడు పర్యాయాలుగా అఖండ మెజారిటీతో గెలుస్తూ.. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కూకట్‌పల్లికి అభివృద్ధిని పరిచయం చేసిన నాయకుడు కృష్ణారావు: తూము శ్రావణ్ కుమార్

కూకట్‌పల్లి నియోజకవర్గానికి అభివృద్ధిని పరిచయం చేసిన నాయకుడు కృష్ణారావు అని అన్నారు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, కూకట్‌పల్లి అభివృద్ధి ప్రధాత, డైనమిక్ లీడర్, శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం, మూసాపేట్ డివిజన్ అధ్యక్షులు జిల్లా అక్షయ్ ఆధ్వర్యంలో.. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గానికి అభివృద్ధిని పరిచయం చేసిన నాయకుడు కృష్ణారావు అని కొనిడాయారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, నపారి చంద్రశేఖర్, రమేష్ యాదవ్, అశోక్, నర్సింగ్ రావు, బాబు రావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కృష్ణారావు పుట్టిన రోజు సందర్భంగా పుస్తకాల పంపిణీ..

శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్, వెంకటేశ్వర నగర్ కట్ట మైసమ్మ దేవాలయం వద్ద, కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు జన్మదిన సందర్భంగా.. సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు ఆధ్వర్యంలో.. స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు, పూజలు చేసి, కేక్ కట్ చేశారు. అనంతరం వెంకటేశ్వర నగర్, 33 బ్లాక్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకి నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

బాలానగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి ప్రధాత మాధవరం కృష్ణారావు జన్మదినం సందర్భంగా బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిఆధ్వర్యంలో బుధవారం వినాయక నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి భారీ ఎత్తున కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఇందిరానగర్, దిల్ కుష్ నగర్ ఆయా బస్తీలను అభివృద్ధి చేశారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నేత ఎలిజాల యాదగిరి, బాలానగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి ఖాజా, బీఆర్‌ఎస్ మహిళానాయకురాళ్లు, కాలనీ, బస్తీ వాసులు అసోసియేషన్ సభ్యులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



బాలానగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో జననేత శాసన సభ్యులు కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రియతమ మాధవరం కృష్ణారావు జన్మదిన సందర్భంగా.. బుధవారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా కార్యక్రమంలో వివిధ కార్యక్రమాల్లో భాగంగా కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రభుత్వ పాఠశాలలో 300 మంది విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తాత కృష్ణారావు కు మనవడు కృష్ణె శుభాకాంక్షలు..



కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు పుట్టిన రోజు సందర్భంగా ఆయన రెండు నెలల మనవడు, కృష్ణె తాతకు జన్మ దిన శుభాకాంక్షలు తెలుపుతున్న చిత్రం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

పుట్టిన రోజు సందర్భంగా మహా కుంభ మేళాలో పుణ్యస్నానం ఆచరించిన ఎమ్మెల్యే..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని.. మహా కుంభమేళా త్రివేణి సంగమంలో బుధవారం గంగా, యమున, సరస్వతీ సంగమం ఘాట్‌లో కుటుంబ సమేతంగా, పుణ్య స్నానం మాధవరం కృష్ణారావు ఆచరించారు.



కేపీహెచ్‌బీ : ప్రజల పక్షపాతి, జన హృదయనేత, కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినం సందర్భంగా బుధవారం బాలాజీనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీనగర్ డివిజన్ కార్పొరేట ర్ పగుడాల శిరీష బాబురావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరాల ఆధ్వర్యంలో ముసాపేటలోని శ్రీ చిత్తారమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే కోరకు ప్రత్యేక పూజలు



విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం





● ప్రధానోపాధ్యాయులు కిషన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థుల్లోని చేతిరాత నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ముందుగు వేస్తున్నామని జగద్గిరిగుట్ట డివిజన్, శ్రీనివాస్ నగర్ మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ పేర్కొన్నారు. ప్రముఖ చేతిరాత శిక్షణా అకాడమీ"జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ"సహకారంతో వారం రోజుల పాటు చేతిరాత శిక్షణా తరగతులను తమ పాఠశాలలో నిర్వహించారు. బుదవారం నిర్వహించిన చేతిరాత పోటి పరిక్షలో విద్యార్థులు వారి ప్రతిభను చాటుకున్నారు.ప్రథమ బహుమతి 5.వతరగతి చదివే అంశుకుమారి,ద్వితీయ,తృతీయ బహుమతులకు ప్రీతి, రిజ్వాన్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జీతెందెర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టర్ వంపు మల్లయ్యను పుష్పగుచ్చంతో, మెమెంటోతో పాఠశాల యాజమాన్యం సత్కరించారు. ఈ సందర్భగా ప్రధానోపాధ్యాయులు కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత చేతిరాత శిక్షణా తరగతులు జితేందర్ అకాడమీ నిర్వాహకులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అకాడమీ నిర్వాహకులు వంపు మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులకు తన వంతు బాధ్యతగా తాను నేర్చుకున్న విద్యను పదిమందికి పంచాలనే దృఢ సంకల్పంతో విభిన్నమైన చేతిరాతను నేర్పుతున్నానన్నారు. విద్యార్థులు శ్రద్ధతో నేర్చుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో చేతిరాత శిక్షకులు రజిత, రాంబాబు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ సేవలు చిరస్మరణీయం



● కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గోవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఛత్రపతి శివాజీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గోవర్ధన్ రెడ్డి అన్నారు. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. న్యాయవాదులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఇచ్చిన స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నటరాజ్, ప్రధాన కార్యదర్శి తాండ రమేష్ కుమార్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ యాదయ్య, కోశాధికారి ఖలీల్ పాషా, మహిళా న్యాయవాద ప్రతినిధి సదాలక్ష్మి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ అని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని శ్రీరామ్ నగర్‌లో గల విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ శివాజీ ధైర్యసాహసాలు మన అందరికీ ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సిహెచ్. బుచ్చిరెడ్డి,శివకుమార్ గౌడ్,గుమస్త మధుసూదన్, అశోక్, రషీద్ బేగ్, పులి రాజు, రాజు యాదవ్, గణేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



రానున్న తరాలకు వీరుల చరిత్ర తెలియాలి

● కార్పొరేటర్ మహేందర్ కొడిచెర్ల



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా.. మూసాపేట ఆంజనేయ నగర్ చౌరాస్తాలో శివాజీ చౌక్ వద్ద వారి చిత్ర పటానికి మూసా పేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పూల మాల వేసి నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భారతదేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన వీరుడు మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన దీరుడు, హిందువుల సింహ స్వప్నం ఛత్రపతి శివాజీ మహారాజ్ అన్నారు. 1674 సంవత్సరం, హిందూ నెల జ్యేష్ఠ, శుద్ధ త్రయోదశి నాడు ఛత్రపతి శివాజీ పట్టాభిషేక వార్షికోత్సవం జరిగిన సందర్భంగా.. హిందూ సామ్రాజ్య దివాస్ జరుపుకుంటున్నాం అని అన్నారు.

నేడు హిందువులుగా జీవిస్తున్నారంటే నాడు ఛత్రపతి శివాజీ మహారాజ్ చేసిన పోరాట ఫలితమే అన్నారు. శివాజీ రాజనీతి జ్ఞానీ అని, కొందరు ముఖ్య అనుచరులతో కలసి ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి, తాను అనేక సామ్రాజ్యలను కైవసం చేసుకొని.. మొగలాయిల గుండెల్లో గుబులు పుట్టించే విధంగా చేసిన తీరును మన భావితరాలకూ, భవిష్యత్తు తరాలకు తెలియపర చాలన్నారు. శివాజీ మహారాజ్ తల్లి జిజియా భాయ్ మాత అతనికి, తను జన్మించిన భూమి పైన, ప్రజల పైన ప్రేమ కలుగెట్టూ విద్యాబుద్ధులు నేర్పిందని. తన బాల్య వయస్సు నుండే భారత రామాయణ, బలి చక్రవర్తి గాథలు చెప్పి వీర లక్షణాలు, మొలకింప చేసిందని ఆ విధంగా నేటి తరం మాతృమూ ర్తులు తమ పిల్లలకూ కూడా ఈ విధంగా తీర్చి దిద్దాలని అన్నారు. శివాజీ మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలు మొదలు పెట్టాడు అని, 17 సంవత్సరాల వయసులోనే సామ్రాజ్యాలను జయించడం మొదలు పెట్టిన విషయాన్ని గుర్తు చేశాడు. ఈ చరిత్రలను మరుగున పడే విధంగా మన పాఠ్యపుస్తకాలలో లేకపోవడం మన దురదృష్టకరమని, కనీసం మనమైనా రానున్న తరాలకు మన పూర్వీకుల పోరాట పటిమలు తెలియాపరుచాలని విజ్ఞప్తి చేశారు. శివాజీ సేన అధ్యక్షులు సంతోష్ కుమార్, ఓబీ సీ నాయకులు భాశెట్టి నర్సింగ్ రావు, మరాఠి మండలి అధ్యక్షులు ఉమా కాంత్, తదితరులు పాల్గొన్నారు.



మోండా కార్పొరేటర్ కొంతం దీపిక, ఆనంద్ పాటిల్ 395వ ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని పాట్ మార్కెట్, జనరల్ బజార్ గోల్డ్ అండ్ సిల్వర్ రిఫైనర్స్ అసోసియేషన్ భారీగా ఏర్పాటు ర్యాలీలో పాల్గొన్నారు. కార్పొరేటర్‌కు మరాఠా అసోసియేషన్ సాల్వాతో సన్మానించారు. అనంతరం అన్న ప్రసాదం స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ఆనంద్ పాటిల్, ధనరాజ్, దయారామ్ అనేకమంది ర్యాలీలో పాల్గొన్నారు. నవతెలంగాణ-బేగంపేట్



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని వేడుకలు తిరుమలగిరి లాల్ బజార్‌లో సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిత్రపటానికి పూలమాల అలంకరించారు. శివాజీ సేవలను కొనియాడారు. అలాగే అనంతరం లాల్ బజార్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నవతెలంగాణ-కంటోన్మెంట్

గవర్నర్‌ను కలిసిన ముప్పిడి నవీన్ కుమార్

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్‌లోని ఇఫ్లు యూనివర్సిటీలో బుధవారం ఏర్పాటు ఓ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మర్యాదపూర్వకంగా దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ప్రజా సమస్యలపై తమ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా గవర్నర్ దృష్టికి నవీన్ కుమార్ తీసుకెళ్లారు. కంటోన్మెంట్‌లో అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం కూడా వారి సంఘం నిరంతరం పోరాటాలు చేస్తూ ఉండని చెప్పారు. ముఖ్యంగా దళితులకు ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని, వారిని చైతన్యవంతం చేసేందుకు గాను సమస్త ఎంతగానో కృషి చేస్తామని తెలిపారు.



కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- చీరలు పంపిణీ చేసిన కార్పొరేటర్

నవతెలంగాణ-కంటోన్మెంట్



కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినాన్ని బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ హ్యాట్రిక్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ నిర్వహించారు. కేక్ కట్ చేసి డివిజన్లోని మహిళలకు కార్పొరేటర్ నరసింహ యాదవ్ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మెన్ నరేందర్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్ భాయ్, సెక్రెటరీ హరినాథ్, మైనార్టీ ప్రెసిడెంట్ సయ్యద్ అజాజ్ భాయ్, మహిళా అధ్యక్షురాలు లలిత, కర్రె లావణ్య, మక్కల నర్సింగ్ రావు, కర్రి జంగయ్య, బల్వంత్ రెడ్డి, గడ్డం నర్సింగ్ రావు, బీసీ సెల్ అధ్యక్షుడు మట్టి శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి సీనియర్ మహిళా నాయకురాలు నాయకులు

కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రారు..?

నవతెలంగాణ-బేగంపేట్



కాంగ్రెస్ అధికారంలోకివచ్చి ఏడాది దాటిన అసెంబ్లీకి రాకుండా కేవలం ఫాంహౌస్‌కు పరిమితమైన ప్రతిపక్ష నాయకులు కె.చంద్రశేఖరరావు హైదరాబాద్‌లో పార్టీ క్యాడర్‌తో మీటింగ్ పెట్టడంపై కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా.కోట నీలిమ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారపార్టీ తర్వాత, ప్రతిపక్షస్థానం ఇచ్చిన ప్రజలవద్దకు వచ్చే తీరికలేదా అని అన్నారు. అసెంబ్లీ సమావేశాలలో చర్చకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ప్రజల తరపున మంచి సూచనలు స్వాగతిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పినా పట్టదా.., తెలంగాణ తల్లి విగ్రహ ప్రారంభోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటికివెళ్లి మర్యాదపూర్వకంగా పిలిచినా రాకపోవడం యావత్ తెలంగాణ ప్రజలను, రాష్ట్రాన్ని అవమానించినట్టు కాదా అని నిలదీశారు. దేశ మాజీప్రధాని డా.మన్మోహన్ సింగ్ నివాళులర్పించడానికి అసెంబ్లీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశానికి గైర్హాజరవడం దేశంపట్ల, ఒక గౌరవప్రదమైన నేతకిచ్చే విలువ ఇదేనా, తెలంగాణ పౌరుల తరపున సంధించినపై ప్రశ్నలన్నిటికీ సమాధానమిచ్చే సత్తా ఉందా అని డా.నీలిమ పోస్ట్ చేసారు.

పోలీసే అక్రమాలకు పాల్పడితే ఎలా?

- బాధితురాలు పుష్పలత

నవతెలంగాణ-బంజారాహిల్స్



పోలీసులంటే నమ్మకం.. ఆ పోలీస్ అధికారే అక్రమాలకు పాల్పడితే ఎవరికి చెప్పుకోవాలని నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన పుష్పలత అన్నారు. ఓ ఎస్సై తప్పుడు ధృవపత్రాలతో అక్రమ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని తెలియజేసింది. ఆ రిజిస్ట్రేషన్ రద్దుచేసి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. స్థల వివాదంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎస్సైగా పనిచేస్తున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఎస్సై పేరున అక్రమంగా తన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ప్రస్తుతం సదరు ఎస్సైకి చెందిన బంధువులు తనపై దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-హయత్‌నగర్

విద్యుత్ మరమ్మతుల కారణంగా మన్సూరాబాద్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని సరూర్ నగర్ విద్యుత్ డీఈ రామకృష్ణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11 కెవి ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో ఆటోనగర్, బాలాజీ నగర్, చిత్ర సీమ కాలనీ, ఇందిరానగర్, జడ్జెస్ కాలనీ, ఆరెంజ్ అవెన్యూ, మల్లికార్జున నగర్,మన్సూరాబాద్ విలేజ్, ప్రశాంత్ నగర్, ఎం ఎస్ బి, శైలజ పూరి కాలనీ, శుభోదయం కాలనీ,శ్రీ సాయినాథ్ కాలనీ, శ్రీనివాస్ నగర్, సూర్యోదయ నగర్ కాలనీ, విజయశ్రీ కాలనీ, వివేకానంద నగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11.30నుంచి 12.30 నిముషాల వరకు 11 కెవి శివాలయం ఫీడర్ తెలిపారు. శివాలయం గుడి ఐసిఎస్ సి బ్యాంక్,సాయి నగర్, గీత హాస్పటల్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు.

మురికి నాలాపై సమగ్ర సర్వే చేయాలి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి
- పాత బస్తీలోని పలు ప్రాంతాల్లో నాలాలను పరిశీలించిన కమిషనర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



యాకుత్ పురా మురికి నాలాపై సమగ్ర సర్వే చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం యాకుత్పురాలోని పలు స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లను స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్‌లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగేలి కిడికి, హుస్సేన్ కోటి, మౌలానా చిల్ల, గంగా నగర్, రెయిన్ బజార్‌లలో పర్యటించారు. ముందుగా రంగేలి కిడికి వీధిలో మురుగు నీరు ఓవర్ ఫ్లోను పరిశీలించారు. జహంగీర్ నగర్ నుంచి గంగా నగర్ మురికి కాలువ నిజాం కాలంలో చేపట్టిన నాలా అయినందున గత వర్ష కాలంలో వరదకు పొంగిపోయిన నేపథ్యంలో మురికి నీరు వస్తున్నాయని మెయింటెనెన్స్ ఈఈ కమిషనర్‌కు వివరించడంతో మురుగు నీటీ నాలా పై సమగ్ర సర్వే చేయాలని, నిజాం కాలం నాటి మురికి కాలువ అయినందున నాలాల పరిస్థితి తెలుసుకోవలసిన అవసరం ఉందని మురుగు నాలా సమగ్ర సర్వే చేసి పూర్తి నివేదిక అందజేయాలని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత మౌలానా చిల్ల వద్ద గంగా నగర్ నాలాను పరిశీలించారు. నాలా పనులు మూడేళ్ల నుండి చేస్తున్నందున పూర్తి కాలేదని ఎమ్మెల్యే కమిషనర్‌కు వివరించారు. నాలా పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అట్టి పనులు పూర్తి చేయాలని ఏజెన్సీని కోరారు. నిధుల సమస్య లేదని పనులు నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. నాలాలో చెత్త పేరుకుపోయి నీరు నిలిచి ఇళ్లలోకి రావడం వలన ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పడంతో వెంటనే తొలగించాలని జోనల్ కమీషనర్ కు కమిషనర్ ఆదేశించారు. రెయిన్ బజార్ ఎగ్జిస్టింగ్ బాక్స్ డ్రెయిన్ లో వర్షపు నీరు వెళ్లక వరద నీటి నిలిచిపోవడంతో ఇళ్లకు నీరు వస్తుందని కాలనీ వాసులు కమిషనర్ కు వివరించారు. దీంతో బాక్స్ డ్రెయిన్ పనులు చేపట్టేందుకు రూ.1.60 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరగా పని యొక్క పూర్తి డీటైల్స్ రిపోర్ట్ పంపించాలని ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. టెండర్ పూర్తయిన తర్వాత పనులు యుద్ధప్రాతిపదికన ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మాణ పనులు చేపట్టాలని కమిషనర్ సూచించారు..

స్టార్మ్ వాటర్ నాలా మాస్టర్ ప్లాన్ తయారు చేయండి..

రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ లాగానే, హైదరాబాద్ నగరం యొక్క వర్షపు నీటి పారుదల క్రమబద్ధమైన అభివద్ధి, నిర్వహణ విస్తరణను నిర్ధారించడానికి నాలా అభివద్ధికి మాస్టర్ ప్రణాళిక అవసరమని కమిషనర్ తెలిపారు. ఇది వరద తగ్గింపు పరిష్కరించడం తో పాటు ఇప్పటికే ఉన్న నాలాలను కొత్త పట్టణ విస్తరణతో అనుసంధానించడానికి సహాయపడుతుందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాత బస్తీలో ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఎస్.ఎన్.డీ.పీ ద్వారా నాలా పనులు చేపట్టినట్టు తెలిపారు నగరంలో రూ. 545 కోట్ల వ్యయంతో ఎస్.ఎన్.డి.పి రెండో దశ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. పాత బస్తీలో చేపట్టిన పనులు వచ్చే వర్షాకాలం వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

స్కాలర్‌షిప్‌లు అందించిన మలబార్ చారిటబుల్ ట్రస్ట్

నవతెలంగాణ-కంటోన్మెంట్



ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుకుంటున్న బాలికలకు వారి ప్రతిభ ఆధారంగా మలబార్ ఛారిటబుల్ ట్రస్ట్ బుధవారం స్కాలర్‌షిప్ అందించారు. వెస్ట్‌మారేడ్‌పల్లి పద్మశాలి కళ్యాణమండపంలో ఈ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని విద్యార్థినిలకు ష్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్కాలర్‌షిప్‌లు అందుకున్న బాలికలను అభినందిచడంతో పాటు, కష్టపడి చదవుకోవాలని, జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న బాలికలు జీవితంలో పైకెదిగి తిరిగి సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని అప్పుడే ఒక మెరుగైన సమాజం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. అలాగే మలబార్ ఛారిటబుల్ ట్రస్ట్ తెలంగాణ రాష్ట్రంలో 3900 మంది బాలికలకు రూ.3.14 కోట్ల స్కాలర్‌షిప్‌లుగా పంపిణీ చేయడాన్ని ఆయన అభినందించారు. వ్యాపార సంస్థలు లాభాలు గడించడమే కాకుండా తమ వంతుగా సమాజానికి సేవ చేయాలని చెప్పారు. మలబార్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి కింద బాలికల విద్య పట్ల, మహిళా సాధికారిత పట్ల చూపిస్తున్న శ్రద్ధను ఆయన అభినందించారు. సమాజాన్ని అభివృద్ధి చేయడం కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదని, మలబార్ లాంటి పెద్ద వ్యాపార సంస్థలు మరిన్ని ముందుకొచ్చి బాధ్యత తీసుకుంటే సమాజ అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని మెరుగైన సమాజం ఏర్పడుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మలబార్ సిబ్బంది, స్కాలర్‌షిప్‌లు అందుకున్న వివిధ ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు, ఆ కాలేజీల ప్రిన్సిపల్స్, టీచర్లు పాల్గొన్నారు.

శివాజీ 395వ జయంతి వేడుకులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

పేదల సంక్షేమ రాజ్య పాలనకు శివాజీ మహారాజ్ నిదర్శనం కులమతాలకు అతీతంగా సేవలందించిన హిందు రాష్ట్ర స్వరాజ్యమే లక్ష్యంగా ఛత్రపతి శివాజీ పనిచేశారని ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిస్థానిక కార్పొరేటర్ విజయరెడ్డి, చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి యాదవు అన్నారు. శివాజీ 395వ జయంతి ఉత్సవాల్లో భాగంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేందర్ బాబు, కృష్ణ యాదవ్, మహేష్ యాదవ్, నగేష్, వంశీకృష్ణ, ఆదర్శ్, మధుకర్ యాదవ్, రాజు, గజ్జెల ఆనంద, నర్సింగ్ పాల్గొన్నారు.

శివాజీ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బేగంపేట్



భారత జాతి సగర్వంగా చెప్పుకునే ధీరుడు.. వీరత్వానికి ప్రతీకగా కొలుచుకునే యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఛత్రపతి శివాజీ 395వ జయంతిని పురస్కరించుకొని బుధవారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన జయంతి కార్యక్రమాలలో ఆయన పాల్గొని నివాళులు అర్పించారు. మత సామరస్యం కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.

బన్సీలాల్ పేట డివిజన్‌లో..

బన్సీలాల్ పేట డివిజన్‌లోని న్యూబోయగూడలో గల కేటీఆర్ పార్క్ వద్ద నిర్వహించిన ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలకు ఆయన హాజరై శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నిర్వాహకులు కైలాష్, నితిన్, సాయి, శాంతి, విక్కీ, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, మహేందర్ గౌడ్, రమణ, లంక రాజు, కుమార్ యాదవ్, వెంకట్, అబ్బాస్, ఫహీం, వెంకట్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాంగోపాల్ పేట డివిజన్‌లిలో...

రాంగోపాల్ పేట డివిజన్‌లోని జనరల్ బజార్‌లో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే పాల్గొని శివాజీ మహారాజ్‌కు నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహకులు శివాజీ మహారాజ్ ప్రతిమను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నిర్వహకులు ఆనంద్ పాటిల్, ప్రకాష్ పాటిల్, సురేష్ బోస్లే, ప్రవీణ్ పాటిల్, ప్రవీణ్ గాయాకర్, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, జనార్ధన్, గణేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ డివిజన్‌లో..

సనత్ నగర్ డివిజన్‌లోని జెక్ కాలనీలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అమీర్‌పేట్‌డివిజన్‌లో..

అమీర్‌పేట్ డివిజన్‌లో నిర్వహించిన ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలలో మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జయంతి సందర్భంగా గురుద్వార్ సమీపం నుండి మున్సిపల్ గ్రౌండ్ వరకు నిర్వహించే ర్యాలీలో ఆయన పాల్గొని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్ యాదవ్, గురుద్వార్ అధ్యక్షులు దర్శన్ సింగ్, సుమిత్ సింగ్, ఉత్తమ్ కుమార్ సింగ్ రాజ్ పురోహిత్, జితేందర్ శుక్లా, ప్రకాష్ గౌడ్, నిర్వహకులు ప్రకాష్ పవార్, ఆకాష్ పాటిల్, ప్రశాంత్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన సభ్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మద్ది భాస్కర్ రెడ్డి ప్రకాష్ యాదవ్, మల్లేష్ యాదవ్, దాదా రావు, ముత్యాలు, జీతూ, సాయిబాబా యాదవ్, కారం సింగ్, వరప్రసాద్, ధాఫెదర్ విజయ్ పాల్గొన్నారు. నవతెలంగాణ-కంటోన్మెంట్

బోరబండలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మరాఠా యోధుడు, జాతి వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను, బోరబండ కార్పొరేటర్ మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ బాబా పసివుద్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని, బోరబండలోని ఎస్ఆర్‌టీ నగర్‌లో గల శివాజి మహరాజ్ విగ్రనికి పూలదండ వేసి నివాళులు అర్పించారు.



కమిషన్ గడువు మరో 6 నెలలు పెంచాలి



- అంసా, తెలంగాణ మాల స్టూడెంట్ జేఏసీ

నవతెలంగాణ-ఓయూ

శమిమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ గడువును మరొక 6 నెలలు పొడిగించాలని అంసా, తెలంగాణ మాల స్టూడెంట్ జేఏసీ బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించిన విలేకరుల సమావేశంలో అన్నారు. మాల యూత్ ఫెడరేషన్ చైర్మెన్ మందల భాస్కర్ పాల్గొని శమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ యొక్క కాలపరిమితిని పెంచడానికి స్వాగతిస్తూనే ఇంకొక ఆరు నెలలు దీన్ని పెంచి పూర్తి సమగ్ర కులగనన చేసిన తర్వాతనే మిగతా వర్గీకరణ అంశంలో ముందుకెళ్లాలని అలాగే ఇప్పుడు చేసిన వర్గీకరణ అనేది తప్పులు తడకగా ఉంది అలాగే రోస్టర్ విధానంలో కూడా మా మాలలకు అన్యాయం జరిగే విధంగా రోస్టర్ విధానం కూడా తప్పులు తడకగా ఉండడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తూ రాబోయే రోజులలో ప్రభుత్వం మాలలను బి గ్రూప్ లో చేర్చి మాదిగలను సి గ్రూపులో చేర్చి రిజర్వేషన్లను అమలు చేసే ప్రక్రియను ముందుకు తీసుకుపోవాలని హెచ్చరించారు. అలాగే మార్చి మొదటి వారంలో తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలలోని అన్ని యూనివర్సిటీలలోని విద్యార్థులందరినీ కలుపుకొని మాల విద్యార్థులు నిరుద్యోగులు యువతను చైతన్యపరిచి ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా భారీ బహిరంగ సభను విద్యార్థి గర్జనను నిర్వహించబోతున్నామన్నారు. తెలంగాణ మాల జేఏసీ నాయకులు మాదాసి రాహుల్ మాట్లాడుతూ.. మాల విద్యార్థి లోకంగా ఇప్పుడు జరిగిన వర్గీకరణను మేము తీవ్రంగా ఖండిస్తూ అలాగే ఎస్సీ వర్గీకరణ మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం అలాగే మార్చిలో ఉమ్మడి పది జిల్లాలలోని అన్ని యూనివర్సిటీలలోని మాల విద్యార్థులు యువత నిరుద్యోగులను కలుపుకొని ఓయూలో భారీ బహిరంగ సభను విద్యార్థి గర్జనను నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్తామన మా విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో అంసా ఓయూ ప్రెసిడెంట్ నామ సైదులు, కొప్పుల అర్జున్, దాసరి రవి, ప్రవీణ్ , కాంబ్లె ప్రవీణ్, లింగమూర్తి, నారాయణ , నవీన్, నరేష్, వెంకటేష్, గంగారాం, కిరణ్, రంజిత్, శేఖర్, విజయ్ మాల విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణా సేవలు సులభతరం చేసిన భారతీయ రైల్వే

- మహా కుంభ్ మేళాకు ముందస్తు చర్యలు
- పలు ప్రత్యేక రైళ్లు ఏర్పాట్లు
- ఇప్పటి వరకు 12.583 రైళ్లు నడిపిన రైల్వే
- డే అండ్ నైట్ శ్రమిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ

నవతెలంగాణ-ఓయూ



ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్ మేళాకు ఇప్పటికే 53 కోట్లు కంటే ఎక్కువ మంది సందర్శించి పవిత్ర స్నానాలు ఆచరించడం ద్వారా ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మక మేళాగా నిలిచింది. నిత్యం లక్షలాది మంది భక్తులు రావడంతో భారతీయ రైల్వేలు యాత్రికుల ప్రయాణాన్ని సునాయాసంగా నిర్వహించడానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. దానిలో దక్షిణ మధ్య రైల్వే గత మూడేండ్లలో మహా కుంభ్ ప్రాంత అభివృద్ధికి రూ.5 వేలకోట్ల విలువైన పలు ప్రాజెక్టులను పూర్తి చేశాయి. రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ రూ.13 వేల ప్రత్యేక రైళ్ళు, అభివృద్ధి చెందిన జనసంచార నియంత్రణ విధానాలు చాలా ముఖ్యమైనవి. భారతీయ రైల్వే ఈ విశాల మేళాను సులభతరం చేయడానికి అనేక ముందస్తు చర్యలు చేపట్టింది.

చేపట్టిన ముందస్తు చర్యలు..

మహా కుంభ్ కోసం విస్తృత రైల్వే కార్యకలాపాలు ప్రయాణానికి అంతరాయం లేకుండా రైళ్ల మార్గాల మార్పు చేర్పులు చేశారు. ప్రయాణికుల రవాణాకు ప్రాధాన్యత ఇవ్వడానికి అన్ని సరుకు రైళ్ల ప్రత్యేకంగా సమర్పిత మార్గాలలో (డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్-డీఎఫ్‌సీ) మళ్లించారు. 200 రైళ్లను (రేక్స్) ఇంజిన్‌లతో కూడిన రెండు వైపులా నియమించడం వల్ల షంటింగ్ ఆపరేషన్లు నివారించారు.

అత్యధిక సంఖ్యలో రైళ్లు..

ఫిబ్రవరి 26, 2025 వరకు 13,000 రైళ్ల ప్రణాళిక చేశారు. ఇందులో 16 ఫిబ్రవరి 2025 నాటికి 12,583 రైళ్ల ఇప్పటికే నడిపారు. యాత్రికులను చేర్చడంలో నిరంతరం విశేష సేవాలు. అత్యధిక యాత్రికులను భారతీయ రైల్వేలు ఈ ఆధ్యాత్మిక క్షేత్రానికి చేర్చారు. జనవరి 13, 2025 నుంచి ప్రయాగరాజ్ కుంభ్ ప్రాంతంలో భారతీయ రైల్వేలు 3.09 కోట్ల మంది యాత్రికులను దర్శించుకున్నారు. ఫిబ్రవరి 17న 18.60 లక్షల మంది, ఫిబ్రవరి 16న, 18.48 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారు. ఇది రెండు రోజుల్లోనే అత్యధిక ప్రయాణికుల కదలికలుగా నమోదైంది. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు అభివృద్ధి చేసిన మౌలిక వసతులు. 9 రైల్వే స్టేషన్లలో రెండవ ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయడం ద్వారా జనసంచార నియంత్రణ. 48 ప్లాట్‌ఫామ్‌లు (పిఎఫ్)21 ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు (ఎఫ్‌ఓబీ) నిర్మాణం చేశారు. 1,186 సీసీటీవీ కెమెరాలను ప్రయాగరాజ్ మేళా ప్రాంతంలోని తొమ్మిది స్టేషన్లలో ఏర్పాటు చేసి సమగ్ర నిఘా వ్యవస్థ అమలు చేశారు. 23 శాశ్వత హోల్డింగ్ ప్రాంతాలు వేచి ఉన్న ప్రయాణికులను నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ప్రధాన స్టేషన్‌లో 12 భాషల్లో ప్రకటనలు... ప్రయాగరాజ్, నైనీ, చెయోకి, సుబేదార్గంజ్ స్టేషన్లలో అమలు చేశాయి. మొత్తం 554 టికెట్ కౌంటరు అందులో 151 మొబైల్ అండ్‌పై టికెట్ పాయింట్లు, టికెటింగ్ వ్యవస్థను వేగవంతం చేశారు.

భద్రతా అండ్ జనసంచార నియంత్రణ

నియంత్రణ కేంద్రాల ఏర్పాటు స్టేషన్ స్థాయి, డివిజన్ స్థాయి, జోన్ స్థాయి, రైల్వే బోర్డు స్థాయిల్లో ప్రత్యేక మానిటరింగ్ కేంద్రాలు. 13 వేల రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సిబ్బంది ఏర్పాటు. పదివేల ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ) పారామిలిటరీ సిబ్బంది. 3 వేల రైల్వే నడిపే సిబ్బంది పనిచేస్తున్నారు. 53 కోట్ల పవిత్ర స్నానాలు ఇప్పటికే పూర్తయిన మహా కుంభ్ కోసం, భారతీయ రైల్వేలు భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక రైళ్ల నుండి అత్యాధునిక జనసంచార నియంత్రణ చర్యల వరకు, ప్రపంచంలోని అతి పెద్ద ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాన్ని భక్తులు దర్శించుకునేందుకు భారతీయ రైల్వేలు సమర్థవంతంగా నిర్వహించేందుకు నిరంతరం శ్రమిస్తున్నాయి అని దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబధాల అధికారి ఎ. శ్రీధర్ వ్యక్తం చేశారు..

ఫిబ్రవరి 15: 14.76 లక్షల మంది
12: 17 లక్షల మంది
జనవరి 10 అండ్11: 14 లక్షల మంది
30: 17.57 లక్షల మంది
29: 27 లక్షల మంది
28: 14.15 లక్షల మంది
14: 13.87 లక్షల మందిని
కుంభమేళాకి చేర్చాయి భారతీయ రైల్వేలు

22 నుంచి మార్చి 29 వరకు ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం'(పీటీపీ)కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి మార్చి 29 వరకు ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రజలకు ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం'ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పన్ను సమస్యలు, పునస్సమీక్షా అభ్యర్థనలపై నివృత్తి చేసుకునే వీలుంది. ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, బిల్ కలెక్టర్ల ద్వారా / ఆర్టీజీఎస్ ద్వారా చెల్లింపుల నమోదు, ఆన్‌లైన్ బకాయిలు సరిచేయడం, కోర్టు కేసుల పరిష్కారం,ఐజీఆర్ఎస్ సమస్యలు స్వయంమూల్యాంకనం(సెల్ఫ్ అసింస్మెంట్) సంబంధిత విషయాలు, ఇతర పన్ను సంబం ధిత సమస్యలు తదితర అంశాలను పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆస్తిపన్నుకు సంబంధించిన ఏవైనా సమస్యలున్న వారు తమ సంబంధిత జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటింటికీ తాగునీరు..

- **ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలోనే మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీరు సౌకర్యం కల్పించినట్టు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గుడ పరిధిలో ఉన్న 4వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డితో కలసి విశాఖ నగర్ కాలనీలో కాలనీ వాసులు సౌకర్యార్థం నూతనంగా వాటర్ సరఫరా లైన్‌ను ప్రారంభించారు. కమిషనర్ సరస్వతి, బీఆర్ ఎస్ స్థానిక అధ్యక్షులు రామిడి రాంరెడ్డి,మాజీ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి సీనియర్ నాయకులు బోయపల్లి శేఖర్ రెడ్డి,ముత్యాల కృష్ణ, తదితరులున్నారు.

వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం హైదరాబాద్ శ్రీరామ్ నగర్ పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి లోని ఫార్మసీ, ప్రాథమిక పరీక్ష గది, ఎక్స్ రే, ఈసీజీ గదులను పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేసి రిజిస్టర్ లో సంతకం చేసిన ప్రకారం వైద్యులు, సిబ్బంది ఉన్నారా లేదా అని చూశారు. ఆస్పత్రిలో వైద్య సేవల కోసం వచ్చిన గర్భిణీలతో ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా స్టాక్ పూర్తికాక ముందే ఇండెంట్ చేసి మందులను తెప్పించుకో వాలన్నారు. గర్భిణీల చక వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ సిబ్బంది తమకు కొన్ని నెలలుగా వేతనం రావడం లేదని కలెక్టర్ కు తెలుపగా వేతనం మంజూరి కోసం, అలాగే అంబులెన్స్ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు, ఆస్పత్రికి చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి పెషెంట్స్ అధికంగా వస్తున్నందున ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు, ఆస్పత్రికి అదనంగా మరొక గైనకాలజిస్ట్ కోసం ప్రతిపాదనలు సమర్పించాలని డిసిహెచ్ఎస్ ను కలెక్టర్ ఆదేశించారు. ఇన్‌చార్జి డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ నవనీత రావు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యూకేషన్ సెంట్రల్ ఫోరం ఏర్పాటు

- **రాష్ట్ర అధ్యక్షుడిగా కె.ఆర్. రాజ్‌కుమార్, సెక్రటరీగా ఎండీ ఫక్రురుద్దీన్ అహ్మద్**
- **మొత్తం 34 మందితో నూతన రాష్ట్ర కార్యవర్గం**

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యాశాఖకు సంబంధించిన ఉద్యోగులు, ఇతర సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ సెంట్రల్ ఫోరం నూతనంగా ఏర్పాటైంది. ఈ సెంట్రల్ ఫోరంలో అన్ని జిల్లాలకు చెందిన ఉద్యోగులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ.. మొత్తం 34 మందితో కలిపి కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. విద్యాశాఖ సెంట్రల్ యూనియన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా కె.ఆర్. రాజ్ కుమార్, సెక్రటరీగా ఎండీ ఫక్రురుద్దీన్‌తో పాటు ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి ఎన్నికల అధికారిగా ఆ సంఘం సెంట్రల్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) చేతుల మీదుగా నియమాక పత్రాలు అందజేశారు. అనంతరం జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్‌తో పాటు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్‌కు స్కూల్ ఎడ్యూకేషన్ స్టేట్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో పూలబోకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆర్. రాజ్ కుమార్, ఎండీ ఫక్రురుద్దీన్ మాట్లాడుతూ సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్, ఉపాధ్యక్షులు గోవర్ధన్ రెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రెసిడెంట్ సత్యనారాయణ, శ్రీలత, కౌసర్, అక్బర్ హుస్సేన్, జుబెర్, నుమాన్, అనిల్, పరమేష్ దామోదర్, గౌస్, ఇస్మాయిల్, అమీర్, షుజా, కృష్ణ, ఇస్మాయిల్, షాబుద్దీన్, రాజు, రాజేశ్వర్, రవి పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులు వీరే..

టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులుగా కె. ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శిగా ఎండీ ఫక్రురుద్దీన్ అహ్మద్, అసోసియేట్ అధ్యక్షులు దేవేందర్ కుమార్, భరత్, ట్రెజరర్‌గా పవన్ బాబు, ఉపాధ్యక్షులుగా ఎం. భాస్కర్, ఆర్.అశోక్, కె. శ్రీనివాసులు, మొహమ్మద్ ముజాహిద్, ఈ. రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా వేణుకుమార్, రమేష్, కె. సుదర్శన్, శ్రీనివాస బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శ్రీపాదరావు, ఆర్. శివ, కె. శ్రీనివాస్, శేఖర్, పబ్లిక్ సెక్రటరీలుగా దిలీప్ కుమార్ యాదవ్, తుషార్ క్రాంతి సర్కార్, ఫెరోస్ అహ్మద్, అరుణ్ జ్యోతి, కల్చరల్ సెక్రటరీలుగా ఎస్. శ్రీనివాస్, ఎస్. రాకేష్, యూ. వినయ్, సయ్యద్ అఖీలుద్దీన్, ఈసీ మెంబర్స్ ఎస్.బి. శ్రీనివాస్, పి.సుకేష్‌కుమార్, ఎ.కె జీలానీ, యోగేందర్ కుమార్, దుర్గాప్రసాద్, ఎం. రాజ్‌కుమార్, శివరాజ్, వి. ప్రశాంత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

24న జాబ్‌మేళా

- **మూడుచింతలపల్లి జీపీ కార్యాలయంలో నిర్వహణ**
- **మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎం.సాంబశివరావు**

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-ఈజీఎంఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రయివేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ నెల 24వ తేదీన మూడుచింతలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎం.సాంబశివరావు తెలిపారు. మొబిలైజేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఫార్మసీ, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ప్రయివేటు లిమిటెడ్, జియో టెక్నాలజీస్, నిర్మాణ్ (శిక్షణ అండ్ ఉపాధి), ట్రెడ్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ కంపెనీల ప్రతినిధులు హాజరై వారి కంపెనీల్లో గల వివిధ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. వయస్సు 18-30 ఏండ్లు ఉండాలనీ, మరిన్ని వివరాలకు డీఆర్‌డీఏ ఫోన్ నెంబర్ 6281739511ను సంప్రదించాలని కోరారు.

పాల్గొనే కంపెనీల వివరాలు ఇలా..

అపోలో ఫార్మసీలో ఫార్మసిస్ట్, ట్రెనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రెనీ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయనీ, ఇందుకు స్త్రీ, పురుషులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. డి.ఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ (పీసీఐ), డిగ్రీ, ఇంటర్, పదో తరగతి విద్యార్హత ఉండాలి. నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో క్లర్క్, వేర్ హౌస్ సూపర్‌వైజర్, మెకానిక్ హెల్పర్స్, డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ అర్హత ఉండాలి. జియో టెక్నాలజీలో జియో ఫైబర్ అసోసియేట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ అర్హత ఉండాలి. టీ-4 సెక్యూరిటీలో సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ విద్యార్హత ఉంటుంది. నిర్మాణ్ (ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్) కంపెనీలో డాటా ఎంట్రీ, బీపీఓ, ఐటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఆ పైన విద్యార్హత ఉండాలి. ట్రెడ్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ కంపెనీలో మార్కెటింగ్ అండ్ క్లస్టర్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్, ఇతరాలు ఖాళీగా ఉన్నాయి. స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ విద్యార్హత ఉండాలి.



ఆర్ కె పురం డివిజన్ లో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు ఎల్లేటి భవనీ విజయ అధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు యువజన కాంగ్రెస్ నేత ప్రజా సేవకురాలు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందు తరాల వారికి ఛత్రపతి శివాజీ జీవితం ఎంతో మార్గదర్శ కంగా నిలుస్తుందన్నారు.శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్, డైరెక్టర్ కేతావత్ రాజు నాయక్, ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, ఎస్ఐ మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, జహంగీర్, పాండు, యూత్ సభ్యులు స్వామి యాదవ్, కుమార్, రాజు, టీన్, విశాల్, కిరణ్ గౌడ్, పప్పు, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

అభిరుచులకు అనుగుణంగా విద్యనందించాలి





- **ఉన్నత విద్యామండలి చైర్మెన్ డా. వి. బాల కిష్టా రెడ్డి**
- **ఘనంగా సెయింట్ ఆంథోనీ ఇన్‌స్టిట్యూషన్స్ రజతోత్సవ ముగింపు వేడుకలు**

నవతెలంగాణ-దుండిగల్

క్రమశిక్షణతో కూడిన విద్యను అభిరుచులకు అనుగుణంగా అందించవలసిన బాధ్యత ఉపాధ్యాయుల పై ఎంతగానో ఉందని తెలంగాణ ఉన్నత విద్యమండలి చైర్మెన్ డా. వి. బాల కిష్టారెడ్డి తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొంపల్లి లోని జిబిఆర్ కల్చరల్ క్లబ్‌లో బుధవారం సెయింట్ ఆంథోనీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ వారు నిర్వహించిన రజతోత్సవ చివరి రోజు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే పి. వివేకానంద,లోకసత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించ వలసిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయులపై తల్లి తండ్రులపై ఉందని తెలిపారు. కరోనా తర్వాత విద్య రంగ విధానంలో చాలా మార్పులు వచ్చాయన్నారు. కాలానికి అనుగుణంగా విద్యలో మార్పులు వస్తున్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని, విద్యార్థులు కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలాజీతో నైపుణ్యం పెంపిందించుకోవాలని సూచించారు. అన్నీ రంగాలలో టెక్నాలజి ఆర్టిఫిషల్ ఇంటలీజెన్సీ అభివృద్ధి చెందుతున్నదన్నారు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల అభిరుచికి తగట్టుగా ప్రోత్సహించాలని తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని తెలిపారు. జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచి కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా తమని తాము రూపాంతరించుకోవాలని తెలిపారు. అన్ని దానాల కన్నా విద్యా దానం మిన్న అని తెలిపారు. అలాంటి రంగంలో 25 సంవత్సరాల నుంచి విద్యను అందిస్తున్న సుందర్ రాజును అభినందించారు. సెయింట్ అంథోని గ్రూప్ చైర్మెన్ ఎస్పీ సుందర్ రాజు మాట్లాడుతూ తమ విద్యాసంస్థను 2000 సంవత్సరంలో సుచిత్రలో 95 మంది విద్యార్థులతో స్థాపించామని, నాటి నుంచి నేటి వరకు 90 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశంతో తమ సంస్థలో ఆకుంఠిత దీక్షతో పనిచేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్తును నిర్మించు కోవాలని, పదో తరగతి విద్యార్థినులకు ఉన్న త స్థాయికి చేరుకోవడానికి ఇది మొదటి మెట్టు అని, పరిస్థితులు ఎలా ఉన్నా కష్టపడి చదువుకోవాలని సూచించారు. విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందన్నారు.

అనంతరం విద్యా ర్థులు చేసిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు అందరిని అలరిం చాయి. గత సంవత్సరం పది ఫలితాల లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ,అతిథుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందించి శాలువాతో సత్కరించారు. మెట్రో టీవీ ఎండీ. జయప్రసాద్, నరేశెట్టి థామస్, కుత్బుల్లాపూర్ రికాగ్నైసేడ్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శివయ్య, ఎం. శ్రీనివాస్ గౌడ్,వర ప్రసాద్, కరస్పాండెంట్ రాం బాబు, శ్రీనివాస్ ప్రిన్సిపాల్ నరిశెట్టి సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
గురువారం ఫిబ్రవరి 20, 2025 www.navatelangana.com

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

● కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ డివిజన్‌లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందించాలని డివిజన్ కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్ తెలిపారు. డివిజన్‌లోని దయారా మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్, ముషీరాబాద్ అసెంబ్లీ బీజేపీ కో- కన్వీనర్ నవీన్ గౌడ్ తో కలిసి పర్యవేక్షించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాల్వేరు సత్యనారాయణ, డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు సోమ వెంకటేష్, సందీప్, దుర్గం బాలు, రుద్ర రవీందర్, బస్తి వాసులు, వాటర్ వర్క్స్ అధికారి వెంకటేశం, వాటర్ బిల్లు ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైలు పనుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

● మీర్ చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ మెట్రో రైలు పనుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మీ ర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ అన్నారు. దారుల్ షిఫా నుంచి బీబీ బజార్ చౌరస్తా మొఘల్‌పుర హెూల్బా హెూటల్ వరకు మెట్రో రైలు పనుల నిమితం కొనసాగుతున్న పురాతన భవనాల కూల్చివేతల నేపథ్యంలో ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్రో రైలు పనుల నిమిత్తం కొన్ని రోజులుగా పురాతన భనవనాల కూల్చివేతలు జరుగుతున్నాయన్నారు. తొలగించిన మట్టిని రోడ్లపై వేయకుండా ఎప్పటికప్పుడు తరలించాలని మెట్రో రైలు ప్రాజెక్టు అధికారులకు సూచించామన్నారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ నియంత్రణ చేపట్టామని తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రామిరెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేసి 250 గజాల స్థలంతో పాటు నెలకు రూ.30 వేల గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రామిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి, గౌరవ సలహాదారులు రంగారెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఉద్యమంలో పనిచేసి లబ్ధి పొందని కళాకారులను సాంస్కృతి సారథిలోని వివిధ పోస్టులలో అవకాశం ఇవ్వాలని ఉచిత బస్సు పాసులు, 250 గజాలు ఇంటి స్థలంలో పాటు నాలుగు గదుల ఇండ్లు నిర్మించి అందజేయాలన్నారు. ప్రతి జిల్లాలోని అమరులైన ఉద్యమకారులకు స్మారక భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు సోమన్న, యాదగిరి, చంద్రన్న ప్రసాద్, మాధవి, యాదగిరి, యాదగిరి తదితరులున్నారు.

తెలంగాణ ట్రాన్స్‌జెండర్లకు వెల్ఫేర్ అకాడమీ ఏర్పాటు చేయాలి



● టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ట్రాన్స్‌జెండర్లకు వెల్ఫేర్ అకాడమీ ఏర్పాటు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్ జెండర్స్‌పై వివక్ష చూపుతున్నాయని టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తెలంగాణ ట్రాన్స్ జెండర్, హిజ్రా వెల్ఫేర్ అకాడమీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం టీపీఎస్‌కే హాల్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వివక్షకు గురైన వర్గం ట్రాన్స్ జెండర్స్‌కు బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపించి ఒక పైసా కేటాయించలేదనీ వెంటనే తెలంగాణలో మహిళ శిశు సంక్షేమ శాఖ నుండి వీడదీసి ప్రత్యేకంగా ట్రాన్స్ జెండర్ హిజ్రా వెల్ఫేర్ అకాడమీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌జెండర్స్‌కు ఇందిరమ్మ ఇండ్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. ట్రాన్స్‌జెండర్స్ ఉత్సవాలు నిర్వహించి వారిని ఆదుకోవాలని సమస్యలతో కూడిన తీర్మానాన్ని మంత్రి సీతక్కకు అందజేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ గురువులు ప్రియా, నగ్మా అరతి, పప్పి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దృష్టి లోప నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కంటిపరీక్షలు నిర్వహిస్తోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కంటి వైద్య పరీక్షలు లక్ష మంది విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ నిర్వహించగా అందులో 7954 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ ఇప్పుడు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కంటి వైద్య శిబిరాలు నగరంలోని కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి, నాంపల్లి ఏరియా ఆస్పత్రి, మలక్‌పేట ఏరియా ఆస్పత్రి, గాంధీ ఆస్పత్రి, సరోజినీ ఆస్పత్రుల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఈ వైద్య శిబిరం మార్చి 6 వరకు కొనసాగనుంది. బాల్య దశ నుంచే పిల్లల్లో అంధత్వ నివారణకు చర్యలు చేపట్టాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యశాఖ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్ బీఎస్‌కే) ఆధ్వర్యంలో బుధవారం కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో కంటి వైద్య శిబిరాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ ప్రారంభించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య శిబిరాన్ని హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, డీఐఓ శ్రీధర్, ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ సాయి బాబా పరిశీలించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు పూర్తయిన తర్వాత కంటి అద్దాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సాధన, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సవిత, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ వసంత, డాక్టర్ రాజేశ్వరి, ఫార్మసిస్టులు విద్యార్థులు తదితరులున్నారు.

ఛత్రపతి శివాజీ పాలన నేటి పాలకులకు ఆదర్శం కావాలి



● మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

శివాజీ పాలన నేటి పాలకులకు ఆదర్శం కావాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి రెడ్డి అన్నారు. బుధవారం యూత్ కాంగ్రెస్ హిమాయత్ నగర్ డివిజన్ కార్యదర్శి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ 396వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనీష్ గంగపుత్రలు ఇతర కాంగ్రెస్ నేతలతో కలిసి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ హిందూ, ముస్లింలు కలిసి హిమాయత్ నగర్ డివిజన్ లో హిందూ సామ్రాట్ జయంతిని ఘనంగా నిర్వహించడం గొప్ప విశేషమన్నారు. హిందూ, ముస్లిం భేదం లేకుండా అన్ని మతాలకు సమ ప్రాధాన్యత కల్పించిన గొప్ప రాజు శివాజీ మహారాజ్ అన్నారు. దేశాన్ని పాలించే ప్రస్తుత పాలకులు, శివాజీ మతసామరస్యాన్ని గుర్తించి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు సమాన అవకాశాలు కల్పించాలని, హితోపదేశం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దిలీప్ రాజిరెడ్డి, అశోక్, ప్రభాకర్ గౌడ్, ఎండి. సర్ఫరాజు ధ్దీన్, అనీష్ గంగపుత్ర, తాజ్ ఖాన్, మల్లేష్, సయ్యద్ జుబీర్, మహేందర్, విశ్వంత్, అజార్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కు అభివృద్ధికి దశలవారీగా కృషి చేస్తున్నాం

● పీవీ నిరంజన్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కును దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు పీవీ నిరంజన్ రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ సహకారంతో గత రెండు నెలల కాలంలోనే పార్కులో స్టీల్ లైట్ల మరమత్తులు, టాయిలెట్ల మరమత్తులు, వాకింగ్ ట్రాక్, దోమలనివారణ తదితర సమస్యల పరిష్కారానికి కృషిచేశామని తెలిపారు. బుధవారం సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ప్రకటించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వారంలో సుమారు రెండు సార్లు ఆరోగ్య శిబిరాలను నిర్వహించడంతో పాటు యోగా తదితర కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్య క్రమంలో ప్రధాన కార్యదర్శి పీవీ నిరంజన్ రెడ్డి, కోశాధికారి ఎం.దశరత్, ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు వి. నాగ భూషణం, వెంకటకృష్ణారావు, ఎ.కిషన్‌రావు, డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'ఛత్రపతి శివాజీ మహారాజ్ లౌకిక పాలకుడు'

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ నరసింహ




నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అన్ని మతాలను ఆదరించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ అత్యంత ప్రగతిశీల, లౌకిక పాలకుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ పేర్కొన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్ నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ.టీ నరసింహ మాట్లాడుతూ మొఘలులపై అనేక యుద్ధాలను చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ యుద్ధం కేవలం రాజకీయ యుద్ధమని, దీనికి మతంతో సంబంధం లేదని, శివాజీ ఒక లౌకిక రాజు ఎప్పుడు ముస్లింలపై యుద్ధాలు చేయలేదని, ఆర్ఎస్ఎస్, బీజేపీలు అతని చరిత్రను నాశనం చేయడానికి, వక్రీకరించడానికి కుట్రలు పన్నుతూ ముస్లిం వ్యతిరేక రాజుగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ఎస్. బోస్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శి బి.స్టాలిన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, ఎండి.ఒమర్ ఖాన్, మామిడిచెట్ల వెంకట్ స్వామి తదితరులున్నారు.

ముషీరాబాద్‌లో కనుమరుగవుతున్న

కాంగ్రెస్సోళ్లు..!

● ముషీరాబాద్‌లో సమస్యలపై పోరాడే నాయకులు ఎక్కడ?
● డివిజన్ ప్రెసిడెంట్లు ఉన్నా కనపడరే..
● అధికార పార్టీ అయినా అంతంత మాత్రమే



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం అంటేనే ముందుగా గుర్తుకు వచ్చేది కాంగ్రెస్ పార్టీ. గతంలో ఎంతో మంది హేమాహేమీలు ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించి గెలుపొందారు. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న నియోజకవర్గం క్రమేపి కాంగ్రెస్సోళ్లు ఎక్కడ అనే దుస్థితికి చేరుకుంది. ముఖ్యంగా స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాడే నాయకుడు కరువయ్యాడు. డివిజన్ల వారీగా పార్టీ అధ్యక్షులు ఉన్నా కనీసం కొంత మందికి వారు ఎవరో కూడా తెలియని పరిస్థితి.. అధికార పార్టీ అయినా కూడా అంతంత మాత్రంగానే కార్యక్రమాలు ఉన్నాయి.

1952లో ముషీరాబాద్ నియోజకవర్గం ఏర్పడిన పుటి నుంచి దాదాపు 17 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా కాంగ్రెస్ దాదాపుగా తొమ్మిది సార్లు విజయం సాధించి ముషీరాబాద్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ కంచుకోటగా ఏర్పరచుకుంది. మొట్టమొదటిసారిగా 1952లో కాంగ్రెస్ నుంచి జీఎస్ మెల్కోటే నేతృత్వంలో కాంగ్రెస్ విజయం సాధించగా అప్పటినుంచి 2009 మణెమ్మ వరకు కాంగ్రెస్‌కి ఎదురు లేకుండా పోయింది. ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోటగా ఉండగా క్రమంగా కాంగ్రెస్ కంచుకోటకు బీటలు వారుతూ వచ్చాయి. స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ 2018-24 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమస్యల పరిష్కారంలో అభివృద్ధి పనులు నిర్వహించడంలో ఆలస్యంగా స్పందిస్తారని అపవాదం ఉన్న ఈ సందర్భాన్ని ప్రత్యామ్నాయ కాంగ్రెస్ నాయకులు ఉపయోగించుకోవడం లేదని ప్రజల వాదన.. ఇటువంటి సమయంలోనే ప్రజలకు ఇంకాస్త చేరువై సమస్యల పరిష్కారంలో ముందుండి నడిపించాల్సిన నాయకులు అటువైపు అడుగులు వేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. మాజీ కార్పొ రేటర్లు, బ్లాక్‌ల అధ్యక్షులు, సీనియర్ నాయకులది అదే తంతు ఇకనైనా పుంజుకోకపోతే కాంగ్రెస్ కంచుకోట కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయటంలో విఫలం

అధికార కాంగ్రెస్ పలు సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు పంపిణీ ప్రక్రియ మొదలుపెట్టింది. అయితే ముషీరాబాద్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ల డంలో కార్యకర్తలు నాయకులు పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు చెవులు కోరుక్కుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ సంక్షేమ పథ కాలను కేవలం వారి అను చరులకు మాత్రమే అందేలా చేసి సామాన్య ప్రజలకు చేరవేయలేదని విమర్శలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో దానిని ఎండగట్టి అసలైన లబ్ధిదారులకు అదే విధంగా చర్యలు తీసుకోవడంలో నాయకులు విఫలమవు తున్నారు. నియోజకవర్గంలో డ్రయినేజీ, రోడ్ల సమస్య తీవ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు.

యువతరం ముందుకు రావాలి.. రాజకీయాలను శాసించాలి

ఏ పార్టీ అయినా గెలుపు సూత్రం యువ తరంముందుకు రావడం.. వారికి సీనియర్ నాయకుల అనుభవం తోడైతే ప్రజా సమస్యలపై అవగాహన ఉంటే నాయకుల గెలుపును ఆపలేరు. అధికార కాంగ్రెస్‌లో ముషీరాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలను శాసించడానికి యువతరం ఎక్కువగా ముందుకు రావడం లేదు. ఒకవేళ వచ్చినా సీనియర్ నాయ కుల అనుభవం వారికి తోడుగా నిలవడం లేదు. తాను మాత్రమే ఉండాలనే అహం వారిని యువతకు తోడు నిలవడంలో వెనుకడుగు వేయిస్తుంది. ముషీరాబాద్‌లో యువతరం నడుం బిగించి నియోజకవర్గం అభివృద్ధికి ముందుండి పోరాడితే కాంగ్రెస్‌కి పూర్వ వైభవం వస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేయగలగాలి.. అందరినీ కలుపుకొని ముందుకు నడిచే ఓర్పు ఉండాలి. అటువంటి యువతరం రాజకీయాలు కాంగ్రెస్‌లో ఇప్పుడిప్పుడే మొదలైనట్టే కనిపిస్తుంది.

ఇటీవల యువ నాయకులు తమ అధినాయకత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే సహించేది లేదని అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని వినికిడి. కొంతమంది నాయకులు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజల తో మమేకమై పని చేస్తున్నట్టు కనిపిస్తు న్నారు. కొంతమంది నాయకులు తమ ఆధిపత్య ధోరణతో యువనాయకత్వానికి నాంది పలకాల్సింది పోయి తమ ఆధిపత్యాన్ని చలాయి ంచాలని చూస్తున్నారని దీనిపై అధినాయకత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి సమర్థవంతమైన నాయ కులను ప్రోత్సహించాలని ప్రజలు కార్యకర్తలు కోరుకుంటున్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలు గాంధీనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ పోచమ్మ దేవాలయం సమీపంలో నిర్వహించిన శివాజీ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ స్త్రీని గౌరవించి, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు.. సాహసం, దయ, సుపరిపాలన మూర్తీభవించిన హిందూ హృదయ సామ్రాట్, మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి అందరికీ శుభాకాంక్షలు తెలియచేస్తూ వారికి మా ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, సినివాస్, ప్రకాష్ యాదవ్, సురేష్, ఆనంద్ రావు, మైఖేల్, ప్రశాంత్, డేవిడ్, సతీష్, తదితరులున్నారు.

ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సురేందర్ రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో 2025 జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 17వరకు ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నుమాయిష్ విజయవంతంగా కొనసాగిందని ఎగ్జిబిషన్ సొసైటీ సురేందర్ రెడ్డి అన్నారు. నుమాయిష్ ముగింపు సందర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాజస్తానీ ప్రగతి సమాజ్, రామాయణ్ మేళా ప్రధాన కార్యదర్శి గోవింద్ రాఠీ, రామాయణ్ మేళా సమన్వయకర్త మనోజ్ జైస్వాల్‌లు ఎగ్జిబిషన్ సొసైటీ జనరల్ కమిటీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఆర్థిక సంఘం అధ్యక్షులు డాక్టర్ గంగాధర్‌రావు, ప్రతినిధులు రాజేశ్వర్‌లను ఘనంగా సత్కరించారు.



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియో జకవర్గంలోని కవాడిగూడ డివిజన్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ రచన శ్రీ హాజరై ఛత్రపతి శివాజీ వీర గాథను ప్రజలకు వినిపించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు వెంకటేష్ డివిజన్ ప్రెసిడెంట్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కర్షక ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలి

● సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి ఎస్ కిషన్, ఏ.కృష్ణ, వి.రామ్ కుమార్ నాయక్



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక కర్షక ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి ఎస్.కిషన్, ఏ.కృష్ణ, వి.రామ్ కుమార్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. చాంద్రాయణగుట్ట సీపీఐ(ఎం) జోన్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఫలకనమా లిమ్రా హెూటల్ చౌరస్తా వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ బడా కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గంకు, వారి అభివృద్ధికి, వారి సబ్సిడీలు కేటాయించే విధంగా ఉందన్నారు. ఈ బడ్జెట్ ఆదానీ, అంబానీ లాంటి డబ్బులు ఉన్నవారికి మరిన్ని డబ్బులు అందించే విధంగా ఈ బడ్జెట్‌లో పొందుపరిచారని కార్మికుల రైతులు ప్రజల అభివృద్ధిని ఆలోచించకుండా పేదలను మరింత పేదలుగా చేసే చర్యలు ఈ బడ్జెట్‌లో పొందుపరిచారన్నారు. గిరిజనులు, దళితులు, మైనార్టీలు ఈ వర్గ ప్రజలకు అభివృద్ధి చేయాలని ఆలోచన ఈ బడ్జెట్‌లో ఎక్కడ కనబడలేదన్నారు. బీహార్ లాంటి రాష్ట్రాలకి ఎక్కువ బడ్జెట్ కేటాయించారని దుయబద్దారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్మిక కర్షక ప్రజావ్యతిరేక బడ్జెట్ అన్నారు. బడ్జెట్‌ను వెంటనే సవరించి మరలా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాష మహమూద్ శీను మమ్మద్ సుధాకర్ తదితరులున్నారు.

బతుకమ్మ కుంటలో ఘనంగా గంగమ్మ పూజ



● సీఎం రేవంత్ రెడ్డికు ధన్యవాదాలు తెలిపిన హనుమంతరావు

నవతెలంగాణ-అంబర్‌పేట

హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన బతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేసి, రాబోయే బతుకమ్మ పండుగకు మహిళాలు తమ బతుకమ్మలను బతుకమ్మ కుంటలోనే నిమజ్జనం చేస్తారని మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి .హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రోహిన్ రెడ్డితో కలిసి బతుకమ్మ కుంటలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ..కబ్జాకు గురైన బతుకమ్మ కుంట చెరువు పునరుద్ధరణ జరగడం సంతోషదాయకమన్నారు. ఇన్నేండ్ల పోరాటానికి సరియైన ఫలితం దక్కిందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌చార్జి డాక్టర్ రోహిన్ రెడ్డి మాట్లాడుతూ గత కొద్ది కాలంగా కబ్జాకు గురైన బతుకమ్మ కుంట విషయాన్ని హనుమంతురావు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగిందని వివరించారు. సీఎం వెంటనే స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్ యాదవ్, లకుపతి యాదగిరి జ్యోతి గౌడ్ ,సత్తి బాబు, శంభుల శ్రీకాంత్ గౌడ్, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, పోలినేని రామ్ మోహన్ రావు, మోత రోహిత్, సత్తిబాబు గౌడ్, గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్, రావుల సుధాకర్, కృష్ణ గౌడ్,వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి జమీర్, శశి, కిషోర్, కోట్ల కిరణ్ ,రాజకిరణ్, నిజాం సునీల్ గౌడ్, రాకేష్ , మహిళా నాయకురాలు సునీతారెడ్డి, లావణ్య, విజితారెడ్డి, శాంతమ్మ, బతుకమ్మ కుంట నివాసులు పాల్గొన్నారు.

'హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలి'

● ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వీ.ఎస్.బోస్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వీ.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్ నగర్ లోని కార్యాలయంలో హమాలీ కార్మికులకు పెంచిన హమాలీ రేట్ల జీ.ఓ ను విడుదల చేయాలని 7 రోజులు నిరవధిక సమ్మె చేస్తే ప్రభుత్వం దిగివచ్చి హమాలీ రేట్లు పెంచుతూ జీ.ఓ విడుదల చేయడంతో యూనియన్ పోరాట విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వీ.ఎస్. బోస్ మాట్లాడుతూ అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను సవరించి కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా బీజేపీ కేంద్ర ప్రభుత్వం అవలంభించటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో పోర్టిఫైడ్ రైస్ ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్లను వెంటనే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మునీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, ఏఐటియుసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి. ఇమ్రాన్, యూనియన్ పలు జిల్లాల నేతలు గోర నర్సింహ్మ, దేవేందర్, రమణయ్య, సత్యనారాయణ, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టేస్టీ క్రిస్పీ దోసెలు

మనలో చాలా మంది టిఫిన్స్ అన్నింట్లోనూ దోశ అంటేనే ఎక్కువగా ఇష్టపడుతుంటారు. అయితే చాలా మంది సాదా దోశలే చేసుకుంటారు. మహా అయితే మసాలా, ఆనియన్ ఇలా ఎప్పుడూ వీటినే ట్రై చేస్తారు. వీటినే తినీ తినీ బోర్ కొట్టడం సహజం. అందుకే కాస్త కొత్తగా ట్రై చేస్తే రుచిగా ఉంటుంది. అలాంటి వాటిలో ఎగ్‌దోశ, సెట్ దోశ, సొరకాయ దోశ, రవ్వ దోశ ఇలా అనేక రకాల దోశలు ఉన్నాయి. వీటిని కాస్త వెరైటీగా స్పైసీ గార్లిక్ చట్నీతో ట్రై చేస్తే రుచి అద్దిరిపోతుంది. మరి ఇంకెందుకు ఆలస్యం ఈ దోశలకు కావాల్సిన పదార్థాలేంటో? ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందా...



స్పాంజ్ సెట్ దోశ

కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు బియ్యం, పావు కప్పు మినపప్పు, ఒక టీ స్పూన్ మెంతులు, పావు కప్పు అటుకులు, రుచికి సరిపడా ఉప్పు, అర టీ స్పూన్ పసుపు, నెయ్యి.

తయారీ విధానం: ముందుగా ఒక గిన్నెలో బియ్యం, మినపప్పు, మెంతులు వేసి మూడు సార్లు కడిగి, అవన్నీ మునిగేటట్లుగా నీళ్లు పోసి



మూడు గంటల పాటు నానపెట్టుకోవాలి. తర్వాత అటుకులు తీసుకొని ఒకసారి కడిగి నీళ్లు పోసి అరగంట నానపెట్టుకోవాలి. మూడు గంటల తర్వాత నానబెట్టిన బియ్యం, మినపప్పు, మెంతులు వడకట్టి మిక్సీలో వేసుకోవాలి. తర్వాత ఇందులోనే నానపెట్టిన అటుకులు నీళ్లతో మిక్సీలో వేసి దోశ పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. అనంతరం గ్రైండ్ చేసిన పిండిని వేరే గిన్నెలోకి తీసి కాస్త ఉప్పు వేసి మూత పెట్టి మరో ఎనిమిది గంటలు పులియపెట్టాలి. తర్వాత ఒకసారి పిండిని బాగా కలిపి పసుపు, ఉప్పు వేసి మరోసారి బాగా కలపాలి. ఇప్పుడు స్టౌ ఆన్ చేసి దోశ పెనం పెట్టుకుని వేడి చేసుకోవాలి. వేడైన తర్వాత కాస్త పిండి వేసి దోశని మరీ పలచగా కాకుండా మందంగా వేసుకోవాలి. దోశ చుట్టూ కాస్త నెయ్యి వేసుకుని కాసేపు మూత పెట్టి ఉంచాలి. తర్వాత మూత తీసి తెరగేసి ఇంకో పక్క కూడా కాల్చుకుంటే ఎంతో టేస్టీ, సాఫ్ట్ స్పాంజ్ సెట్ దోశ రెడీ!



సొరకాయ దోశ

కావాల్సిన పదార్థాలు: ఒక సొరకాయ, ఒక కప్పు పెసర పప్పు(మూంగ్ దాల్), ఒక టేబుల్ స్పూన్ బియ్యం, కొత్తిమీర ఆకులు, కొంచెం అల్లం, పచ్చిమిర్చి..

తయారు చేసే పద్ధతి: ఒక కప్పు పెసర పప్పు, టేబుల్ స్పూన్ బియ్యాన్ని తీసుకుని నాలుగు గంటల పాటు నానబెట్టండి.

నాలుగు గంటల తర్వాత వీటిలో సొరకాయ ముక్కలు, కొత్తిమీర, అల్లం, పచ్చిమిర్చీ వేసి పిండిలా చేసుకోవాలి.

అంతే దీంతో దోశ వేసుకుని తినేయడమే. ఆలస్యం ఎందుకు ఓ సారి ట్రై చేసి చూడండి.



రవ్వదోశ

కావాల్సిన పదార్థాలు: బొంబాయి రవ్వ – కప్పు, బియ్యప్పిండి – కప్పు, మైదా – అర కప్పు, పెరుగు – అర కప్పు, జీలకర్ర – టీస్పూను, మిరియాల పొడి – ఒక చెంచా, ఉప్పు – తగినంత, సన్నగా తరిగిన ఉల్లిగడ్డలు – రెండు టేబుల్‌స్పూన్లు, పచ్చిమిర్చి తురుము – రెండు టీస్పూన్లు, అల్లంతురుము – టీస్పూను, కొత్తిమీర తరుగు – రెండు టేబుల్‌స్పూన్లు, నూనె – కొద్దిగా, నీళ్లు – సరిపడా.

తయారు చేసే విధానం: ముందుగా ఒక గిన్నెలో పైన చెప్పిన విధంగా బొంబాయి రవ్వ, బియ్యప్పిండి, మైదా, పెరుగు, జీలకర్ర, మిరియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలుపుకోవాలి. ఆ తర్వాత కొద్దికొద్దిగా నీరు పోసుకుంటూ పిండిని ఉండలు లేకుండా బాగా కలుపుకోవాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిముక్కలు, కొత్తిమీర తురుము, పచ్చిమిర్చి తురుము, అల్లంతురుము వేసి మిక్స్ చేసుకోవాలి. అవసరమైతే మరికొన్ని నీళ్లు పోసి మిశ్రమాన్ని పలుచగా ఉండేలా చూసుకోవాలి. ఓ అరగంట పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్టౌ మీద దోశ పెనం పెట్టుకొని బాగా హీట్ అయ్యాక.. కాస్త ఆయిల్ వేసి ముందుగా ప్రిపేర్ చేసుకుని పెట్టుకున్న పిండి మిశ్రమాన్ని పెనంపై దోశలా పోసుకోవాలి. దానిపై కాస్త నూనె చల్లుకొని గోధుమరంగు వచ్చేంత వరకు ఒకవైపు కాల్చుకోవాలి. రెండోవైపు మామూలుగా కాల్చుకోవాలి. పల్చటి అట్లకాడతో దోశ ఏమాత్రం ముక్కలు కాకుండా జాగ్రత్తగా ప్లేట్‌లోకి తీసుకోవాలి. అంతే.. క్రిస్పీ, క్రిస్పీగా ఉండే నోరూరించే రవ్వ దోశ రెడీ!

ఎగ్ కారం దోశ

కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు మినపపప్పు, రెండున్నర కప్పులు బియ్యం, అరకప్పు అటుకులు, ఒక టీ స్పూన్ మెంతులు, మూడు టీ స్పూన్లు నూనె, అర టీ స్పూన్ ఆవాలు, అర టీ స్పూన్ జీలకర్ర, ఒక గుడ్డు, ఒక టీ స్పూన్ నెయ్యి, ఒక చిటికెడు ఉప్పు, ఒక చిటికెడు మిరియాల పొడి, కొద్దిగా ఉల్లిపాయ తరుగు, కొద్దిగా కొత్తిమీర

తయారు చేసే విధానం: ముందుగా మినపపప్పు, బియ్యం, అటుకులు, మెంతులు అన్నింటిని ఒకసారి శుభ్రంగా కడిగి, వేర్వేరు గిన్నెల్లో విడివిడిగా సుమారు నాలుగు గంటలపాటు నానబెట్టుకోవాలి.



తర్వాత వాటన్నింటిలోని నీటిని వడకట్టుకొని మిక్సీ జార్‌లోకి తీసుకొని తగినన్ని నీళ్లు పోస్తూ మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండిని 12 గంటలపాటు పులియబెట్టుకోవాలి. తర్వాత అందులో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలిపి పక్కకు పెట్టుకోవాలి. మరోవైపు స్పైసీ గార్లిక్ చట్నీ కోసం మిక్సీ జార్‌లో గంటపాటు నానబెట్టిన ఎర్ర మిర్చి, వెల్లుల్లి, చిన్న ఉల్లిగడ్డలు, కల్లుప్పు, చింతపండు వేసి అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌ ఆన్ చేసి ఒక పాన్‌లో నూనె తీసుకుని అందులో ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి. ఆ తర్వాత ఇందులో రుబ్బుకున్న పేస్ట్ వేసి, రెండు నిమిషాలు వేయిస్తే స్పైసీ గార్లిక్ చట్నీ రెడీ అయిపోతుంది. ఇప్పుడు స్టౌ పైన పెనం పెట్టుకుని ముందుగా రెడీ చేసుకున్న దోశ పిండిని వేసి అంచుల్లో నెయ్యి వేయాలి. దోశపై ముందుగా రెడీ చేసుకున్న స్పైసీ గార్లిక్ చట్నీని వేసి, ఓ గుడ్డును కొట్టి చుట్టూరా కలపాలి. దోశపైన ఉప్పు, మిరియాల పొడి, సన్నగా తరిగిన ఉల్లి ముక్కలు, కొత్తిమీర తరుగు, నెయ్యి వేసి దోశను కాల్చాలి. దోశ ఒక వైపు కాలిన తర్వాత మరో వైపు కూడా వేయిస్తే టేస్టీ ఎగ్ దోశ రెడీ!

స్పైసీ గార్లిక్ చట్నీ కోసం పదార్థాలు

20 ఎండుమిర్చి, 12 వెల్లుల్లి రెబ్బలు, 15 చిన్న ఉల్లిగడ్డలు, ఒక టీ స్పూన్ కల్లుప్పు, ఉసిరి కాయంత చింతపండు.

డస్ట్ ఎలర్జీ వేధిస్తోందా...

డస్ట్ అలర్జీ బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. చిన్న దుమ్ముకే తుమ్ములు రావడం, ముక్కు కారడం, కళ్లలో దురద, కళ్లు ఎర్రబడడం, గొంతులో నొప్పి వంటి సమస్యలకు దారి తీస్తుంది. శ్వాస సంబంధిత సమస్యలు ఎక్కువతున్నాయి. వాయు కాలుష్యం కూడా డస్ట్ అలర్జీకి దారి తీస్తుంది.

ఒకసారి డస్ట్ ఎలర్జీ మొదలైందంటే తగ్గడం అంత సులువుకాదు. ఎన్నో రకాల మందులు వాడాల్సి ఉంటుంది. అయితే డస్ట్ అలర్జీకి కొన్ని రకాల నేచురల్ టిప్స్ ద్వారా చెక్ పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎన్ని మందులు వాడినా తగ్గని డస్ట్ అలర్జీని కొన్ని రకాల వంటింటి చిట్కాలతో చెక్ పెట్టొచ్చని అంటున్నారు. ఇంతకీ ఆ నేచురల్ టిప్స్ ఏమిటో చూద్దాం.



- డస్ట్ అలర్జీని చెక్ పెట్టడంలో రాక్‌సాల్ట్ బాగా ఉపయోగపడుతుంది. ఒక కప్పు వేడి నీటిలో రాక్ సాల్ట్‌ను కరిగించి ఆ నీటిని ఆవిరి పట్టాలి. ఇలా చేయడం వల్ల ముక్కు క్లీన్ అవుతుంది. గొంతు నొప్పి, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. దుమ్ము, బ్యాక్టీరియా నాశనం అవుతుంది.
- డస్ట్ అలర్జీ ఉన్న వారిలో అల్లం, తేనె కూడా బాగా ఉపయోగపడుతుంది. ఈ రెండింటిలో ఉండే నేచురల్ యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు డస్ట్ అలర్జీని దూరం చేస్తుంది. ఒక చెంచా తేనెలో అల్లం రసం కలిపి ప్రతీరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే డస్ట్ అలర్జీ దూరమవుతుంది. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- శీతాకాలంలో డస్ట్ అలర్జీ మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఇలాంటి సమయంలో పసుపు, తులసి ఆకులు క్రియాశీకలంగా ఉపయోగపడతాయి. తులసి ఆకులను ఉడకబెట్టి, అందులో పసుపు వేయాలి. అనంతరం నీరు సగం అయ్యే వరకు వేడి చెయ్యాలి. గోరు వెచ్చగా చేసుకొని ఈ నీటిని తాగాలి. ఇది శరీరంలోని వ్యర్థాలను తొలగిస్తుంది.
- రాత్రి పడుకునే ముందే కొబ్బరి నూనె మసాజ్ చేసుకున్నా మంచి ఫలితం ఉంటుంది. ముక్కు, గొంతు దగ్గర కొబ్బరి నూనెను మసాజ్ చేయాలి. ఇది శ్వాస తీసుకోవడంలో తలెత్తే ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ప్రజలంటే లెక్కేలేదు

(మొదటిపేజీ తరువాయి)

చేకూర్చేందుకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు లేవన్నారు. వేతన జీవులను పెద్దఎత్తున సంతృప్తి పరుస్తామంటూ గొప్పలు చెప్పి ఇచ్చిందేమీ లేదని ఆరోపించారు. కానీ దేశ ప్రజల బడ్జెట్ అంటూ ప్రధాని మోడీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలున్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేకపోయారన్నారు. రాష్ట్ర విభజన హామీలను గాలికొదిలేశారని తెలిపారు. రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఐఎం, హైస్పీడ్ రైల్వే ట్రాక్‌లకు నిధుల ఊసే లేదన్నారు. మెట్రో రైలు సెకండ్ ఫేజ్ నిర్మాణానికి, మూసీ ప్రక్షాళనకు, ఫోర్త్ సిటీ కోసం రోడ్లు, దాని అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా.. కేంద్రం పట్టించు కోకపోవడం దుర్మార్గమన్నారు. పాలమూరు, కాళేశ్వరం జాతీయ హోదా ఇవ్వకపోవడంతో పాటు నిధులు కేటాయించలేదని తెలిపారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందనీ, ఏటా కోటీ ఉద్యోగాలిస్తా నన్న మోడీ ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదని చెప్పారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొన్ని రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారని తెలిపారు. రూ.50,65,345 కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రూ.12,76,338 కోట్లు, అంటే 25.2 శాతం వడ్డీల చెల్లింపునకే కేటాయించారని జాన్‌వెస్లీ వివరించారు. వ్యవసాయ రంగానికి గతం కన్నా రూ.10 వేల కోట్లు తగ్గించారన్నారు. ఎరువుల సబ్సిడీకి రూ.11 వేల కోట్లు కోత విధించారని పేర్కొన్నారు. ప్రధాని మోడీ దేశంలో రూ.25 కోట్ల మందిని దారిద్ర్యరేఖకు ఎగువకు తెచ్చామని చెప్తూనే 2029 వరకు 80 కోట్ల మందికి ఐదు కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తామని చెబుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి 2023–24లో రూ.89,154 కోట్లు ఖర్చు చేయగా.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. దళితులకు 16 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, 5 శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. 50 శాతం ఉన్న బీసీల సంక్షేమం పట్ల ఊసే లేదన్నారు. పెద్దసంఖ్యలో ఉన్న మైనార్టీల సంక్షేమానికి రూ.3.5వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించడం దారుణమన్నారు. శిశు సంక్షేమానికి, మహిళా అభివృద్ధికి ఎలాంటి నిధులు ఇవ్వలేదన్నారు. గిరిజనులకు 7 శాతం నిధుల కేటాయింపునకు బదులు 2 శాతం కేటాయించారని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు చాలా స్వల్పంగా 3 శాతంలోపే కేటాయింపులున్నాయ న్నారు. కార్పొరేట్లకు పన్ను రాయితీలు, బ్యాంకుల అప్పుల ఎగవేతకు అవకాశం కల్పిస్తూ తయారు చేసిన ఈ బడ్జెట్‌ను పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దాలని కోరారు. వలసలను, ఆత్మహత్యలను నిరోధించే విధంగా బడ్జెట్‌ను రూపొందించాలని తెలిపారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాల్లో వారసత్వపు పన్ను విధిస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం మాత్రం అందుకు సిద్ధంగా లేదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్థికవేత్త పికెట్టీ సూచించిన విధంగా రూ.10కోట్లు అంతకుమించిన ఆదాయం ఉన్న ధనికుల మీద సంపద పన్ను పునరుద్ధరించి కనీసం 33శాతం వారసత్వపు పన్ను విధిస్తే కేంద్ర ప్రభుత్వానికి కావలసినంత ఆదాయం పెరుగుతుందని తెలిపారు. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెంచేవిధంగా ప్రభుత్వ కేటాయింపులు బాగా పెంచవచ్చునని, కానీ పాలకులు ఇందుకు సిద్ధంగా లేరని అన్నారు. నెలవేతనం పొందుతున్న ఉద్యోగుల నుంచి ఆదాయం పన్ను రూపంలో 30శాతానికి పైగా వసూలు చేస్తున్న కేంద్రం శతకోటీశ్వరుల నుంచి మాత్రం తక్కువ పన్ను వసూలు చేస్తున్నదన్నారు. సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవికుమార్, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హన్మేశ్, ఎంసీపీఐ(యూ)రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, ఎస్‌యూసీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు తేజ, సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ్ పాల్గొన్నారు.

రైతులకు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్ : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో రహదారిపై ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆయా కార్యాలయాల నుంచి ప్రదర్శనగా బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రైతులకు, కార్మికులకు వ్యతిరేకమైన బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని, విద్యావైద్య రంగాలని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్ ఉందని ఆరోపించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలను, పేద వర్గాలను కేంద్రం విస్మరించిందని ఈ బడ్జెట్‌ను మార్చాలన్నదే వామపక్షాల ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేశారు. పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తూ పేదలపై పన్నుల భారం మోపుతున్నారని, కేంద్రానికి వస్తున్న రాబడిలో 97 శాతం పేదల కష్టార్జితమేనని అన్నారు. దేశంలో ఉన్న 200 మంది శత కోటీశ్వరులపై నాలుగు శాతం సంపద పన్ను విధించాలని ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ ఇవ్వాలని, బీమా రంగంలో ఎఫ్‌డీఐని పూర్తిగా విరమించుకోవాలని, ప్రయివేటీకరణకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు మచ్చా వెంకటేశ్వర్లు, సాబీర్ పాషా పాల్గొన్నారు. ములకలపల్లిలో ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. దమ్మపేటలో ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. భద్రాచలం పట్టణంలో అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ వామపక్ష పార్టీల నాయకులు నిరసన తెలిపారు. సంగారెడ్డి పట్టణంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సిద్దిపేట కొత్త బస్టాండ్ వద్ద బడ్జెట్‌ను నిరసిస్తూ నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. నకిరేకల్ పట్టణ కేంద్రంలోని మెయిన్ సెంటర్‌లో కేంద్రబడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, మావల, సాత్నాల, బోరజ్, జైనథ్, బేల మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి ఆయా తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

దేశ నిర్మాణంలో మొదటి అడుగు ఓటే..

న్యూఢిల్లీ : దేశ నిర్మాణానికి మొదటి అడుగు ఓటు అని, 18 ఏండ్లు నిండిన ప్రతి భారతీయుడూ ఓటరుగా మారాలని భారత ఎన్నికల సంఘం (సీఈసీ) నూతన సారథి జ్ఞానేశ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ మంగళవారం పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కొత్త సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '18 ఏండ్లు నిండిన ప్రతీ భారత పౌరుడు ఓటరుగా మారాలి. ఓటర్లు ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేయాలి' అని అన్నారు.

సీఈసీ, ఈసీల నియామకంపై విచారణ వాయిదా

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. సీఈసీ, ఈసీల నియామక ప్యానెల్‌లో గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సైతం ఉండేవారు.అయితే, కేంద్ర ప్రభుత్వం గతేడాది సీజేఐని తొలగించి.. ఆ స్థానంలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి చోటు కల్పిస్తూ.. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి.. చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీఈసీ, ఈసీల నియామకాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై 19న విచారిస్తామని కోర్టు ప్రకటించింది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఎన్జీఓ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు.సీఈసీ, ఈసీల ప్యానెల్ నుంచి సీజేఐని తొలగించి.. ప్రభుత్వ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. పిటిషన్‌పై అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, పిటిషనర్ జయ ఠాకూర్ తరఫున హాజరైన న్యాయవాది వరుణ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రభుత్వం కొత్త చట్టం మేరకు నియామకాలు చేపడుతుందని తెలిపారు. నియామకాలను సవాల్ చేసినట్టు పేర్కొన్నారు. చట్టంపై సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సమయంలో అర్ధరాత్రి కొత్త సీఈసీని నియమించడంపై మండిపడింది.

టెస్లాకు మోడీ సర్కార్ రెడ్ కార్పెట్

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడయిన ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లాకు మోడీ సర్కార్ రెడ్ కార్పెట్‌ను సిద్ధం చేసిందని తెలుస్తోంది. ఎప్పటి నుంచో మస్క్ తన టెస్లా వ్యాపారాలను భారత్‌లో ప్రారంభించాలని భావిస్తోన్నారు. ఇటీవలే ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో డోనాల్డ్ ట్రంప్, ఎలన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలోనే మస్క్ డిమాండ్‌లకు కేంద్రం తలొగ్గి ఉంటుందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తోన్నాయి. టెస్లా కంపెనీ భారత్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించడానికి వీలుగా 13 మంది ఉద్యోగుల భర్తీకి గాను ప్రకటన విడుదల చేయడంతో ఇక్కడ వ్యాపారం ప్రారంభంపై స్పష్టత వచ్చేసింది. వచ్చే రెండు, మూడు నెలల్లో దేశంలో ఈవీ కార్ల విక్రయాలను ప్రారంభించే అవకాశాలున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. వాటి ప్రారంభ ధర రూ. 21 లక్షలు ఉండొచ్చని ఆ పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తోన్నారు. టాప్ ఎండ్ మోడల్స్ ధర రూ. 2 కోట్ల వరకు ఉండవచ్చంటున్నారు. పలు రిపోర్టుల ప్రకారం.. జర్మనీలో ఉన్న బెర్లిన్ ప్లాంట్ నుంచి టెస్లా ఇవి కార్లను దిగుమతి చేయనున్నారు. దేశీయంగా రిటైల్ విక్రయాల కోసం ఢిల్లీలోని ఏరోసిటీ, ముంబయిలోని బీకేసీ బిజినెస్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలను ఎంపిక చేశారు. టెస్లా అధికారులు ఏప్రిల్‌లో భారత్‌ను సందర్శించనున్నారు. టెస్లా తొలినుంచి భారత మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు అధిక సుంకాలను కారణంగా చెబుతోంది. అదే విధంగా ఇక్కడ తయారీకి ప్రోత్సాహకాలను డిమాండ్ చేస్తోంది. కాగా.. మోడీ, ట్రంప్ తాజా భేటీలో సుంకాల తగ్గింపునకు అంగీకారం జరిగి ఉండొచ్చని.. ప్రోత్సాహకాలకు ఆమోదం తెలిపి ఉండొచ్చనే అనుమానాలు లేకపోలేదు. టెస్లాకు భారత్‌లో అవకాశాలు కల్పిస్తే.. ఇక్కడి వాహన కంపెనీలు ఎంత వరకూ పోటీని ఎదుర్కొగలవో వేచి చూడాలి.

'ఎక్స్' ప్రీమియం ప్లాన్ రెట్టింపు

ట్విట్టర్‌ను ఎలన్ మస్క్ స్వాధీనం చేసుకున్న తర్వాత దాన్ని పూర్తిగా వాణిజ్యపరంగా మార్చే పనిలో పడ్డారు. 'ఎక్స్' తన ప్రీమియం ప్లస్ ధరల్ని మరోమారు పెంచుతూ మస్క్ నిర్ణయం తీసుకున్నారు. భారత్‌లోనూ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరల్ని రెట్టింపు చేశారు. గత మూడు నెలల్లో ఈ ప్లాన్ ధరల్ని పెంచడం రెండో సారి కావడం గమనార్హం. తమ గ్రోక్ 3 ఎఐ మోడల్ సామర్థ్యాలు వినియోగించాలంటే 'ఎక్స్'లో ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుందని ఇంతక్రితం ఆ సంస్థ తెలిపింది. ఈ క్రమంలోనే భారత్‌లో నెలకు రూ.1,750 ఉన్న ప్లాన్ ధరలను తాజాగా.. రూ.3,470కి పెంచింది. ఇక ఏడాది ప్లాన్ ధర రూ.18,300 నుంచి రూ.34,340కి చేర్చింది. రెట్టింపైన ధరలపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోన్నారు. 2023 అక్టోబర్‌లో తొలిసారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చి.. తొలుత ప్లాన్ ధరను రూ.1,300గా ప్రకటించింది. గతేడాది డిసెంబర్‌లో దాని ధరను రూ.1,750కి చేర్చింది. ఎక్స్‌లో బేసిక్, ప్రీమియం, ప్రీమియం ప్లస్ పేరిట మూడు రకాల ప్లాన్లు అందిస్తోంది. బేసిక్ ప్లాన్ ధర నెలకు రూ.244గా, ప్రీమియం ప్లాన్ ధర నెలకు రూ.650గా ఉంది.

అమెరికా ఏకపక్ష టారిఫ్‌లతో తీవ్ర పర్యవసానాలు

బీజింగ్ : అమెరికా ఏకపక్షంగా విధించిన టారిఫ్‌లపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో చైనా రాయబారి లీ చెంగ్‌గాంగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ టారిఫ్‌లు ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలకు కారణమవుతాయని, ప్రమాదకరమైన ప్రభావాలు వుంటాయని ఆయన పేర్కొన్నారు. కొత్త ఏడాదిలో మొదటిసారిగా జరిగిన డబ్ల్యూటీఓ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తక్షణమే ఈ చర్యలను విరమించాలని ఆయన అమెరికాకు విజ్ఞప్తి చేశారు. నిబంధనల ఆధారిత బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను పరిరక్షించేందుకు అర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పక్షాలను ఆయన సమావేశంలో కోరారు. అమెరికా ఏకపక్షంగా విధించిన ఈ టారిఫ్‌లు చైనా, ఇతర వాణిజ్య భాగస్వామ్య దేశాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా టారిఫ్ ప్రకంపనలు కలుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు డబ్ల్యూటీఓ నిబంధనలను దారుణంగా ఉల్లంఘిస్తున్నాయని. ఆర్థిక అనిశ్చితిని ఎత్తిచూపుతున్నాయని, అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలిగిస్తున్నాయని లీ పేర్కొన్నారు. చివరకు నిబంధనలపై నిర్మితమైన బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు.

ఇటువంటి చర్యలను చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అమెరికా కూడా తన వైఖరిని సరిదిద్దుకోవాలని సూచించారు. ఈయూ, కెనడా, బ్రెజిల్, రష్యాలతో సహా 30కి పైగా డబ్ల్యూటీఓ దేశాలు అమెరికా ఏకపక్ష వైఖరినిపై తీవ్ర ఆందోళనలు వెలిబుచ్చాయి. అధికార రాజకీయాల శకానికి, ఆటవిక న్యాయానికి మళ్ళీ పరిస్థితులను నివారించాలని అంతర్జాతీయ సమాజానికి కెనడా, న్యూజీలాండ్, సింగపూర్‌లు విజ్ఞప్తి చేశాయి. డబ్ల్యూటీఓను ఒక వేదికగా ఉపయోగించుకుని చర్చలు జరపాలని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ ఎన్‌గొజి ఒకొంజొ ఇవీలా సభ్య దేశాలను కోరారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రస్తుత వాణిజ్య ఉద్రిక్తతలకు దోహదపడే అంశాలపై కూడా మాట్లాడుకోవాలని ఆమె కోరారు. ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో మనందరం ప్రశాంతతను పాటిస్తూ, చర్చలకు ద్వారాలు తెరిచి వుంచాలని ఆమె సూచించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

(మొదటిపేజీ తరువాయి)

గచ్చిబౌలి ఇండ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ఇతర అన్ని సమస్యలనూ రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వాటికి నిధులు బడ్జెట్ కేటాయించి ఉద్యోగ సంఘాలతో చర్చించి పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం ఆనందాన్ని కలిగించందని టీఎన్జీవో నాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి డి శ్రీధర్‌బాబు, టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ అధికారం మనదే

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేసీఆర్ వ్యాఖ్యానిం చారు. "సీఎంపై, ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఇంత తొందరగా వస్తుందనుకోలేదు. ఆ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు శాపంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదు. వారి 14 నెలల పాలనలో రాష్ట్ర ఆదాయం పడిపోయింది, బీఆర్ఎస్ ఏటా ఆదాయం పెంచుకుంటూ వెళ్లింది" అని కేసీఆర్ తెలిపారు. అదే అధికారులు న్నారు కానీ.. ఈ ప్రభుత్వానికి పని చేయించుకోవడం కూడా చేత కావడం లేదని ఎద్దేవా చేశారు. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే తమ బాధలు తీరుతాయని ప్రజలు భావిస్తున్న తరుణంలో నాయకులు, కార్యకర్తలు వారి నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేయాలని సూచించారు. "ఒక్కసారి ఓటమికే కొట్టుకుపోయే పార్టీ కాదు బీఆర్ఎస్. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించి చరిత్ర సృష్టించాం. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు పార్టీ శ్రేణులు కలిసి కట్టుగా కృషి చేయాలి" అని కేసీఆర్ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు.

పార్టీ నేతలపై కేసీఆర్ ఫైర్

బీఆర్ఎస్ నేతలపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఫైర్ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పలువురు నాయకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ ఎన్నికల్లో ఓటమి చెందగానే, పార్టీ పనైపోయిందని మన నేతలే ప్రచారం చేశారని సీరియస్ అయ్యారు. పార్టీ నేతలు వ్యతిరేక ప్రచారం చేయడంతోనే 10 మంది ఎమ్మెల్యేలు నైరాశ్యంతో పార్టీ మారారని మందలించారు. ఇలా ప్రచారం చేయడం పార్టీతో పాటు వ్యక్తిగత ప్రతిష్టకు నష్టం జరుగుతుందని హెచ్చరించారు. భవిష్యత్‌లో తప్పుడు ప్రచారాలు మానుకోవాలని వారికి హితవు పలికారు. బీఆర్ఎస్. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించి చరిత్ర సృష్టించిందనీ, ఆ స్ఫూర్తితో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు పార్టీ శ్రేణులు కలిసి కట్టుగా కృషి చేయాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపు నిచ్చారు. యువకులనుద్దేశించి సమావేశంలో కేసీఆర్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. "భవిష్యత్తు మీదే.. కష్టపడి పనిచేయండి" అని వారికి దిశానిర్దేశం చేశారు. పార్టీ వేడుకల సందర్భంగా, బీఆర్ఎస్ ప్రస్థానంపై వ్యాసాలు, డాక్యుమెంటరీలు రూపొందించాలని నాయకులకు సూచించారు.



పట్టు బిగించిన విదర్భ

ముంబయి తొలి ఇన్నింగ్స్ 270/10

నాగ్‌పూర్ : రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో 41 సార్లు చాంపియన్ ముంబయిపై విదర్భ పైచేయి సాధించింది. మూడో రోజు ఆట ముగిసే సరికి విదర్భ 260 పరుగుల ముందంజలో కొనసాగుతుంది. యశ్ రాథోడ్ (59 నాటౌట్, 101 బంతుల్లో 4 ఫోర్లు), అక్షయ్ వాడ్కర్ (31 నాటౌట్) రాణించటంతో విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 147/4 పరుగులు చేసింది. అథర్వ (0), ధ్రువ్ (13), కరుణ్ (6) నిరాశపరిచారు. అంతకుముందు ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ ఆకాశ్ ఆనంద్ (106) సెంచరీతో మెరిసినా..తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగుల ఆధిక్యం కోల్పోయింది. విదర్భ బౌలర్లలో పార్థ్ రాజేశ్ (4/55), యశ్ ఠాకూర్ (2/73) రాణించారు. మరో రెండు రోజుల ఆట ఉండటంతో విదర్భ గెలుపుపై కన్నేసింది.

సమరానికి సై

- బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ నేడు
- ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ

మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఎనిమిదేండ్ల క్రితం అడుగు దూరంలో చేజారిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని తిరిగి దక్కించుకునేందుకు టీమ్ ఇండియా మరోసారి వేటకు సిద్ధమైంది. పేస్‌కు సహకరించే దుబాయ్ పిచ్‌లపై పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా లేకుండానే రోహిత్‌సేన బరిలోకి దిగుతుండగా.. గ్రూప్ దశలో నేడు బంగ్లాదేశ్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. హై ఓల్టేజ్ పాకిస్థాన్‌తో మ్యాచ్ ముంగిట టీమ్ ఇండియాకు నేడు బంగ్లాదేశ్ కఠిన సవాల్ విసిరేందుకు ఎదురుచూస్తోంది.

నవతెలంగాణ-దుబాయ్



భారత్, బంగ్లాదేశ్ ముఖాముఖి సమరం..ఇక ఎంతమాత్రం సాదాసీదా మ్యాచ్ కాబోదు. భావోద్వేగాలతో సాగుతూ అభిమానుల మధ్య వాతావరణం వేడెక్కిస్తున్న భారత్, బంగ్లాదేశ్ పోరుకు ఈసారి దుబాయ్ వేదిక కానుంది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గ్రూప్-ఏ మ్యాచ్‌లో నేడు పొరుగు దేశాలు తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా టీమ్ ఇండియా బరిలోకి దిగుతుండగా.. ఐసీసీ ఈవెంట్లలో భారత్‌కు మళ్లీ షాక్ ఇచ్చేందుకు బంగ్లాదేశ్ సై అంటోంది. భారత్, బంగ్లాదేశ్ పోరు నేడు మధ్యాహ్నం 2.30 గంటలకు ఆరంభం కానుంది.

జోరుగా హుషారుగా..

చాంపియన్స్ ట్రోఫీ వేటకు టీమ్ ఇండియా ఉత్సాహంగా సిద్ధమవుతోంది. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి పరుగుల ఫామ్‌లోకి రావటం అందుకు ప్రధాన కారణం. దుబాయ్ పిచ్‌లపై తగినట్టు ఆట తీరులో మార్పులు చేసుకునేందుకు నాలుగు రోజులుగా రోహిత్‌సేన నెట్స్‌లో చెమటోడ్చింది. శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ సహా శ్రేయస్ అయ్యర్‌లు బ్యాటింగ్ భారం మోయనున్నారు. మిడిల్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు చేయటం భారత్ ఎదుర్కొంటున్న ఓ సమస్య. శ్రేయస్ అయ్యర్ రాకతో ఈ బలహీనతను సైతం అధిగమించినట్టే కనిపిస్తోంది.



వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్‌ను కాదని కెఎల్ రాహుల్‌ను తుది జట్టులోకి తీసుకోనున్నారు. హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలు ఆల్‌రౌండర్లుగా జట్టులో ఉండనున్నారు. ఈ ముగ్గురు సైతం బ్యాట్‌తో, బంతితో మంచి ఫామ్‌లో ఉన్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడే అవకాశం ఉంది. వరుణ్ చక్రవర్తికి సైతం అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ.. కుల్దీప్‌కు చాన్స్ ఇవ్వనున్నారు!. మహ్మద్ షమి, అర్షదీప్ సింగ్‌లతో కలిసి హార్దిక్ పాండ్య పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

స్టార్స్ లేకపోయినా..

బంగ్లాదేశ్ ఇటీవల మెరుగైన క్రికెట్ ఆడుతోంది. షకిబ్ అల్ హసన్, లిటన్ దాస్ వంటి స్టార్ క్రికెటర్లు బంగ్లా జట్టులో లేరు. అయినా, ముష్ఫికర్ రహీమ్, మహ్మదుల్లా వంటి సీనియర్ ప్లేయర్ల మేళవింపుతో ఆ జట్టు బలంగానే కనిపిస్తోంది. సౌమ్య సర్కార్, టంజిద్ హసన్, నజ్ముల్ శాంటోలు బ్యాటింగ్‌లో కీలకం. ముష్ఫికర్, మహ్మదుల్లా, హృదయ్‌లకు భారత్‌పై మంచి రికార్డుంది. పేస్‌కు అనుకూలించే పిచ్‌పై బుమ్రా లేకపోవటంతో బంగ్లా బ్యాటర్లు కాస్త ఊరట చెందవచ్చు. టస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహమాన్‌లు బౌలింగ్ విభాగంలో కీలకం. కానీ ఇటీవల నహిద్ రానా పదునైన పేస్‌తో ప్రత్యర్థులను భయపెడుతున్నాడు. నిలకడగా గంటకు 145కిమీ వేగంతో బంతులు సంధిస్తున్న రానా నేడు భారత బ్యాటర్లకు సవాల్ విసరనున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్ మెహిది హసన్ మిరాజ్‌కు భారత్‌కు తిరుగులేని రికార్డుంది. బ్యాట్‌తో, బంతితో అతడు అత్యంత ప్రమాదకారి. మెహిది హసన్ మిరాజ్ కోసం ప్రత్యేక ప్రణాళికలు భారత్ వద్ద లేకుంటే.. బంగ్లాదేశ్‌ను అతడు గెలుపు తీరాలకు సైతం చేర్చగలడు.

పిచ్, వాతావరణం

దుబాయ్ పిచ్ సంప్రదాయంగా పేస్ బౌలర్లకు అనుకూలం. ఇటీవల ఇక్కడ జరిగిన ఐఎల్‌టీ20 లీగ్‌లో 15 మ్యాచుల్లోనూ పేసర్లు పైచేయి సాధించారు. స్పిన్నర్ల కంటే మెరుగైన సగటుతో వికెట్లు పడగొట్టారు. దుబాయ్‌లో కొత్త, పాత పిచ్‌లు భిన్నంగా స్పందిస్తాయి. బంగ్లాదేశ్, భారత్ మ్యాచ్‌ను తాజా పిచ్‌ను వాడితే ఇరు జట్లు పేసర్లు కీలకం కానున్నారు. ఇప్పటికే వినియోగించిన పిచ్‌పై ఆడితే ఇరు జట్ల స్పిన్నర్లు ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలుస్తారు. భారత శిబిరంలో ఐదుగురు స్పిన్నర్లు ఉండగా.. బంగ్లాదేశ్ స్పిన్నర్లు భారత బ్యాటర్లను గతంలో ఇబ్బందిపెట్టిన సందర్భాలు ఉన్నాయి. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకోనుంది. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం బౌలర్ల లైన్ అండ్ లెంగ్త్‌పై ప్రభావం చూపనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, అర్షదీప్ సింగ్, మహ్మద్ షమి, కుల్దీప్ యాదవ్.

బంగ్లాదేశ్ : టంజిద్ హసన్, సౌమ్య సర్కార్, నజ్ముల్ హుస్సేన్ శాంటో (కెప్టెన్), తౌహిద్ హృదయ్, ముష్ఫికర్ రహీమ్ (వికెట్ కీపర్), మహ్మదుల్లా, మెహిది హసన్ మిరాజ్, రిషద్ హుస్సేన్, టస్కిన్ అహ్మద్, నహిద్ రానా, ముస్తాఫిజుర్ రెహమాన్.

న్యూజిలాండ్ బోణీ

60 పరుగుల తేడాతో పాక్ చిత్తు

కరాచి : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్ బోణీ చేసింది. కరాచిలో బుధవారం జరిగిన ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య జట్టు పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. 60 పరుగుల తేడాతో పాక్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 320/5 పరుగుల భారీ స్కోరు చేసింది. టామ్ లేథమ్ (118 నాటౌట్, 104 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సులు), విల్ యంగ్ (107, 113 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు సెంచరీలతో చెలరేగగా.. గ్లెన్ ఫిలిప్స్ (61, 39 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) డెత్ ఓవర్లలో దంచికొట్టాడు. డెవాన్ కాన్వే (10), కేన్ విలియమ్సన్ (1), డార్లీ మిచెల్ (10) నిరాశపరిచారు. భారీ ఛేదనలో పాకిస్థాన్ చతికిల పడింది. 47.2 ఓవర్లలో 260 పరుగులకే కుప్పకూలింది. ఖుష్దిల్ షా (69, 42 బంతుల్లో 10 ఫోర్లు,1 సిక్స్), బాబర్ ఆజామ్ (64, 90 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేసినా ఫలితం దక్కలేదు. సయిద్ షకీల్ (6), రిజ్వాన్ (3), ఫకర్ జమాన్ (24), తాహిర్ (1) విఫలం అయ్యారు. కివీస్ శతక వీరుడు టామ్ లేథమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

దీప్తికి పసిడి పతకం

జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలు



చెన్నై : పారిస్ పారాలింపిక్స్ పతక విజేత, తెలంగాణ స్టార్ దీప్తి జీవాంజి జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో సత్తా చాటింది. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న 23వ జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో జ్యోతి జీవాంజి పసిడి పతకం సాధించింది. మహిళల 400 మీటర్ల పరుగులో దీప్తి అగ్రస్థానంలో నిలిచింది. 57.82 సెకండ్లలోనే రేసును పూర్తి చేసి బంగారు పతకం కైవసం చేసుకుంది. గోల్డ్ మెడల్ సాధించిన దీప్తి జీవాంజిని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మెన్ కే. శివసేనా రెడ్డి అభినందించారు.

ఐపీఎల్ ఆతిథ్యానికి ఉప్పల్ సిద్ధం!

సన్‌రైజర్స్ సీఈవోతో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్



హైదరాబాద్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)18వ సీజన్‌కు ఆతిథ్యం అందించేందుకు ఉప్పల్ స్టేడియం సిద్ధంగా ఉందని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అన్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో షణ్ముగం సహా ఇతర సభ్యులు బుధవారం హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లను ఉప్పల్ స్టేడియంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న సీజన్లో ఐపీఎల్ మ్యాచులను మరింత మెరుగైన రీతిలో విజయవంతంగా నిర్వహించటంపై చర్చించారు. 'గత సీజన్ ఐపీఎల్‌లో ఉప్పల్ ఉత్తమ పిచ్‌గా నిలిచింది. ఈ సీజన్‌లోనూ ఇక్కడ ఉత్తమ పిచ్‌ను అందిస్తున్నాం. అభిమానులకు మెరుగైన వినోదం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఐపీఎల్ ఆతిథ్యానికి ఉప్పల్ స్టేడియం సిద్ధమని' జగన్‌మోహన్ రావు తెలిపారు. మార్చి 22న కోల్‌కత ఈడెన్ గార్డెన్స్‌లో ఐపీఎల్ 18 షురూ కానుండగా.. 23న హైదరాబాద్‌లో సన్‌రైజర్స్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ జరుగనుంది.

ప్రియాంక్ అజేయ సెంచరీ

కేరళ, గుజరాత్ రంజీ సెమీస్



అహ్మదాబాద్ : కేరళ, గుజరాత్ రంజీ ట్రోఫీ సెమీ ఫైనల్ ఆసక్తికరంగా సాగుతోంది. పరుగుల వేట మంద కోడిగా సాగుతున్న అహ్మదాబాద్‌లో కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 457 పరుగులు చేసింది. మహ్మద్ అజహరుద్దీన్ (177) సెంచరీ చేయగా.. సల్మాన్ నిజర్ (52), సచిన్ బేబి (69) అర్ధ సెంచరీలు సాధించారు. గుజరాత్ ఓపెనర్ ప్రియాంక్ పంచల్ (117 నాటౌట్, 200 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో కదం తొక్కటంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో దీటుగా రాణిస్తోంది. ఆర్య దేశాయ్ (73), మనన్ (30 నాటౌట్) సైతం ఆకట్టుకున్నారు. గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో 222/1 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో మరో 235 పరుగుల వెనుకంజలో నిలిచింది.



నవచిత్రం

'బాపు'.. ఓ అరుదైన సినిమా

"బాపు' ట్రైలర్ చూశాను. ట్రైలర్ చివర్లో ఓ డోర్ దగ్గర ఫ్యామిలీ అంతా చూస్తూ ఉంటుంది. అసలు ఏం చూస్తున్నారనే క్యూరియాసిటీ కలిగింది. ట్రైలర్‌ని చాలా బాగా కట్ చేశారు. ఇది చాలా మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. సినిమా టాక్ బావుంటే మన తెలుగు ఆడియన్స్ సెకండ్ డే నుంచి హౌస్ ఫుల్ చేస్తారు. ఈ సినిమాకి అన్నీ గుడ్ వైబ్స్ ఉన్నాయి' అని దర్శకుడు నాగ్ అశ్విన్ అన్నారు.

> ఈ సినిమాకి మా ప్రొడ్యూసర్ నాకు డబ్బులు ఇవ్వలేదు. ఆడియన్స్ టికెట్స్ కొని, కలెక్షన్స్ వస్తే అందులో నుంచి ఇస్తానని చెప్పారు. ప్లీజ్ అందరూ థియేటర్స్‌కి వెళ్లి మా రెమ్యునరేషన్ వచ్చేలా చేయండి (నవ్వుతూ). ఇదొక అరుదైన సినిమా. ఇలాంటి సినిమాలో ఓ మంచి పాత్ర చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా క్రెడిట్ మొత్తం మా డైరెక్టర్‌కి దక్కుతుంది.
>
> - బ్రహ్మాజీ

బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో ఒకరిగా ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషించిన డార్క్ కామెడీ-డ్రామా చిత్రం 'బాపు'. దయా దర్శకుడు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌కు డైరెక్టర్స్ నాగ్ అశ్విన్, చందూ మొండేటి, బుచ్చిబాబు సాన, హీరో సత్యదేవ్, మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

హీరో సత్యదేవ్ మాట్లాడుతూ,' ఖచ్చితంగా ఈ సినిమా బాగా ఆడుతుంది. అంత నేచురల్‌గా చేశారు. బ్రహ్మాజీ తన భుజంపై వేసుకొని ప్రమోట్ చేశారు. ట్రైలర్‌లో రా ఎమోషన్ కనిపిస్తోంది. టీమ్ అందరికీ ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. మంచి సినిమా ఏదైనా పెద్ద సినిమానే. 'బాపు' ట్రైలర్ చూస్తే చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఈనెల 21 కోసం ఎదురుచూస్తున్నాను' అని డైరెక్టర్ చందూ మొండేటి చెప్పారు.

మరో డైరెక్టర్ బుచ్చిబాబు సాన మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బావుంది. దయ చాలా బాగా తీశారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను' అని అన్నారు. "కిస్మత్' తర్వాత ఇది నా రెండో సినిమా. దయ ఈ కథ చెప్పినపుడు చాలా నచ్చింది. ఇంత అద్భుతమైన సినీ ప్రముఖులతో ఈ వేదిక పంచుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు. ఇదొక గౌరవంగా భావిస్తున్నాను' అని నిర్మాత భాను ప్రసాద్ రెడ్డి చెప్పారు.

డైరెక్టర్ దయ మాట్లాడుతూ,'మా నిర్మాతలకు థ్యాంక్స్. నా కథని నమ్మి నిర్మించారు. బ్రహ్మాజీ వలనే ఈ సినిమాకి ఇంత బజ్ క్రియేట్ అయ్యింది. ప్రివ్యూస్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. మీరంతా సినిమా చూసి, పెద్ద హిట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

ఉత్కంఠ భరితంగా 'శబ్దం'



ఆది పినిశెట్టి

'వైశాలి'తో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ రెండోసారి మరో ఇంట్రెస్టింగ్ సూపర్‌నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు. 7జి ఫిల్మ్స్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

బుధవారం మేకర్స్ 'శబ్దం' ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. 'వెయ్యి గబ్బిలాలు చెవిలో అరుస్తున్నట్లు ఉంటుంది డాక్టర్' అనే వాయిస్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం థ్రిల్లింగ్ స్పైన్-చిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కట్టిపడేసింది. ట్రైలర్‌లోని ఆడియో హాలోజినేషన్ కాన్సెప్ట్ ఆడియన్స్‌కి సరికొత్త అనుభూతినిచ్చింది. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ని చాలా డిఫరెంట్‌గా ప్రజెంట్ చేశారు. ట్రైలర్ సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్‌ని ఇచ్చింది. ఆది పినిశెట్టి పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ క్యారెక్టర్‌లో తన ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. లక్ష్మీ మీనన్ క్యారెక్టర్ చాలా ఆసక్తికరంగా ఉంది. అరుణ్ బత్మనాభన్ అందించిన విజువల్స్ సినిమాలో లీనమయ్యేలా చేశాయి. తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సస్పెన్స్‌ని మరింతగా పెంచింది. జాతీయ అవార్డు గ్రహీత సాబు జోసెఫ్ ఎడిటింగ్ షార్ప్‌గా వుంది. మనోజ్ కుమార్ కళాదర్శకత్వం హైలెట్‌గా నిలిచింది. ఈ చిత్రం ఈనెల 28న ఆంధ్రాలో ఎన్ సినిమాస్, నైజాంలో మైత్రి డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదల కానుంది. టెర్రిఫిక్ ప్రిమైజ్, అద్భుతమైన పెర్ఫార్మెన్స్, హంటింగ్ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి అని చిత్ర యూనిట్ తెలిపింది.

మహా కుంభమేళాలో టీజర్ రిలీజ్



తమన్నా

తమన్నా నటిస్తున్న చిత్రం 'ఓదెల 2', ఇది 'ఓదెల రైల్వేస్టేషన్'కి సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్స్ పై నిర్మాత డి. మధు నిర్మిస్తున్నారు. నాగ సాధు పాత్రలో తమన్నా కనిపించనుంది.

తాజాగా మేకర్స్ ఓ ఎగ్జైటింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్ర టీజర్‌ను ఈనెల 22న మహా కుంభమేళాలో లాంచ్ చేయనున్నారు. ఇలాంటి మహా కుంభమేళాలో లాంచ్ కానున్న మొట్టమొదటి టీజర్ 'ఓదెల 2' కావడం విశేషం. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో కుంభమేళా బ్యాక్ డ్రాప్‌లో నాగసాధుగా కనిపించిన తమన్నా లుక్ డివైన్ వైబ్‌తో పవర్‌ఫుల్‌గా ఉంది.

ఈ చిత్రానికి 'కాంతార' ఫేం అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ, యువ, నాగ మహేష్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి నిర్మాత: డి మధు, క్రియేటెడ్ బై: సంపత్ నంది, దర్శకత్వం: అశోక్ తేజ, డీవోపీ: సౌందర్ రాజన్, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్.

నవ్వుతూనే ఉన్నా..



రీతూ వర్మ

'ప్రసన్న 'మజాకా' కథ చెప్పినపుడు చాలా ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. అలాగే కథ హై ఎమోషనల్ కోషెంట్‌గా ఉంది. ముఖ్యంగా రెండు ఫీమేల్ క్యారెక్టర్స్‌కి కథలో చాలా ఇంపార్టెన్స్ ఉంది. అన్నింటికిమించి కథ వింటున్నంతసేపూ నవ్వుతూనే ఉన్నాను' అని కథానాయిక రీతూవర్మ చెప్పారు. సందీప్ కిషన్ నటించిన కొత్త 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకుడు. ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్ పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాత.

'మన్మథుడు' ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషించారు. శివరాత్రి కానుకగా ఈనెల 26న థియేటర్లలో గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రీతూ వర్మ మీడియాతో ముచ్చటించారు.

- ఇందులో యంగ్ కాలేజ్ గర్ల్‌గా కనిపిస్తా. బాల్యంలో ఎమోషనల్ కాన్ఫ్లిక్ట్ వలన తనపై ఎలాంటి ఎఫెక్ట్ పడింది?, సందీప్ క్యారెక్టర్‌తో తన రిలేషన్ షిప్ ఏంటి?.. ఇలా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్‌ని దర్శకుడు కొత్తగా ప్రజెంట్ చేశారు. ఇప్పటివరకూ చేయని క్యారెక్టర్‌లో కనిపిస్తా. ప్రేక్షకులకు నా పాత్ర నచ్చుతుందనే నమ్మకం ఉంది.
- సందీప్ కిషన్ మంచి నటుడు. ఇందులో అన్షుతో యాక్ట్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. తనకి ఇది కమ్ బ్యాక్ సినిమా. ఇక రావురమేష్‌తో నటించడం మరచిపోలేని అనుభూతి. సెకండ్ హాఫ్‌లో నాకు, ఆయనకి ఓ సింగిల్ టేక్ సీన్ ఉంది. ఆ రోజు షూట్ చేసినప్పుడు అవుట్ పుట్ విషయంలో అందరూ చాలా హ్యాపీ అయ్యారు. సీన్ చాలా అద్భుతంగా వచ్చింది. రావు రమేష్ డబ్బింగ్ పూర్తి చేసి, ఫోన్ చేశారు. ఆ సీన్ గురించి మాట్లాడుతూ.. 'చాలా అద్భుతంగా చేశావ్ అమ్మా..16 నా ఏళ్ల కెరీర్ లో అలాంటి సీన్ చూడాలేదు'అని ఆయన చెప్పడం నాకు చాలా మెమరబుల్.
- దర్శకుడు త్రినాథ్ రావు సినిమాలు ఎంటర్టైనింగ్‌గా ఉంటాయి, ఈ సినిమా కూడా అలాగే ఉంటుంది. అయితే ఇందులో హై ఎమోషనూ ఉంది. అలాగే పాటల్ని కూడా బాగా ఎంజాయ్ చేస్తారు.

'స్వప్నాల నావ'కు విశేష ఆదరణ



శ్రీజ కొటారు, వి.ఎన్.ఆదిత్య

'మనసంతా నువ్వే', 'నేనున్నాను' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలు అందించిన దర్శకుడు వి.ఎన్.ఆదిత్య లేటెస్ట్ ప్రాజెక్ట్ 'స్వప్నాల నావ'.

డల్లాస్‌కి చెందిన ప్రవాసాంధ్రుడు, ప్రముఖ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గోపీకృష్ణ కొటారు శ్రీ క్రియేటివ్ మ్యూజిక్ అండ్ ఎంటర్టైన్మెంట్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి, తొలి ప్రయత్నంగా 'స్వప్నాల నావ'ని రూపొందించారు. నిర్మాత గోపీకృష్ణ కుమార్తె శ్రీజ కొటారు ఈ పాటను ఆలపించడమే కాకుండా నర్తించడం విశేషం.

దివంగత ప్రముఖ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి దివ్య స్మృతికి అంకితంగా దర్శకుడు వి.ఎన్.ఆదిత్య దీన్ని మలిచారు. ఓ.ఎమ్.జీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత మీనాక్షి అనిపిండి దీనికి సమర్పకులుగా వ్యవహరించారు.

గాయకుడు,సంగీత దర్శకుడు పార్థసారథి నేమాని సంగీత దర్శకత్వంలో యశ్వంత్ ఈ పాటకి సాహిత్యం సమకూర్చారు. 'స్వప్నాల నావ'తో సిరివెన్నెల గొప్పతనాన్ని, ఆయనపై తనకి ఉన్న అభిమానాన్ని గొప్పగా చాటి చెప్పారు వి.ఎన్.ఆదిత్య. అందుకే ప్రేక్షకుల నుండి దీనికి విశేషాదరణ లభించింది.

తాజాగా యూట్యూబ్‌లో ఈ పాటకు 1 మిలియన్ వీక్షణలు నమోదయ్యాయి. టాలీవుడ్ గర్వించదగ్గ దిగ్గజ రైటర్ కమ్ లిరిసిస్ట్ సిరివెన్నెల సీతారామశాస్త్రికి వి.ఎన్.ఆదిత్య గొప్ప ట్రిబ్యూట్ ఇచ్చారు అంటూ వీక్షకులు ప్రశంసిస్తున్నారు.

సరికొత్త అనుభూతినిచ్చే హర్రర్ చిత్రం



శ్రీ రిషి సాయి బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.4గా తెరకెక్కుతున్న 'నిశ్శబ్ద' సినిమా టైటిల్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది.

హర్రర్ జోనర్‌లో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

టైటిల్ లాంచ్ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ, 'కథానుగుణంగా ఎక్కువ భాగం రాత్రి సమయంలో చిత్రీకరించడంతో సినిమా చాలా ఇంటెన్స్‌గా, రియలిస్టిక్‌గా ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. కథ, టేకింగ్‌లోనూ ఓ ప్రత్యేకత ఉంటుంది. ఫైనల్ అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చింది. త్వరలోనే టీజర్ విడుదల చేస్తాం. ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా హర్రర్‌ని ఇష్టపడేవారికి సరికొత్త అనుభవాన్నిస్తుంది' అని అన్నారు.

మనోజ్ కుమార్, ఆశిత రెడ్డి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈచిత్రంలో భాగ్య హరిత, నాగ లక్ష్మి టబు, షైని మహేశ్వరీ, తమన్నా హనుమాన్, ఫాతిమా, రామ్ రెడ్డి, రాజు, మహేందర్ రెడ్డి, విజయ్ వరంగల్, చంటి, చిత్ర, షన్ను చిత్ర, సై సూర్య, నయనిక, నితిన్, రమీజ షేక్ తదితరులు ఇతర పాత్రల్ని పోషించారు. ఈచిత్రానికి నిర్మాత: ఎం.సంధ్యా రాణి, కథ- కథనం -దర్శకత్వం : రమణ మూర్తి తంగెళ్లపల్లి, డిఓపీ :నందన్ కృష్ణ, ఆర్ట్ డైరెక్టర్: సురేష్, ఆన్‌లైన్ ఎడిటర్: త్రివిక్రమ్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఎల్ఐసీ నుంచి కొత్త 'స్మార్ట్ పెన్షన్ ప్లాన్'

మరుసటి నెల నుంచే పెన్షన్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) స్మార్ట్ పెన్షన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ కొత్త ప్లాన్‌ను ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రెటరీ ఎం నాగరాజు, ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ్ మొహంతి ఆవిష్కరించారు. పాలసీదారులకు ఈ పథకం పెన్షన్, ఉమ్మడిగా వివిధ రకాల ఆప్షన్స్ అందిస్తుందని ఎల్ఐసీ వెల్లడించింది. ఈ పాలసీ నిబంధనల ప్రకారం పాక్షిక లేదా పూర్తి ఉపసంహరణకు అనేక నగదు ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయని ఎల్ఐసీ వెల్లడించింది. స్టాక్ మార్కెట్ల ఒడి దుడుకులకు సంబంధం లేదని.. సొమ్ముకు గ్యారంటీ ఉంటుంది. సింగిల్ ప్రీమియంతో జీవితాంతం పెన్షన్ పొందడానికి వీలుంది. వార్షికంగా, ఆరు నెలలు, మూడు నెలలు, నెలవారీ యాన్యుటీ చెల్లింపులు పొందొచ్చు. కొన్ని షరతులకు లోబడి పాక్షికంగా లేదా పూర్తిగా ఉపసంహరించుకునే సదుపాయం ఉంది. అత్యవసరంలో రుణం పొందవచ్చు. 18 నుంచి 100 ఏండ్లలోపువారు ప్లాన్‌ను తీసుకోవచ్చు. నెలవారీ, మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాదికోసారి చొప్పున పాలసీదారుడు యాన్యుటీ చెల్లింపుల ఆప్షన్ ఎంచుకో వచ్చు. కాగా.. కనీస పెట్టుబడి రూ.1 లక్షగా నిర్ణయించింది. పాలసీ తీసుకున్న తర్వాత నెల నుంచే పెన్షన్ వచ్చేలా ఆప్షన్ ఎంచుకోవడానికి వీలుంది.

6.3 శాతమే వృద్ధి..!

ఎస్బీఐ రీసెర్చ్ అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి రేటు 6.3 శాతానికే పరిమితం కావొచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రీసెర్చ్ అంచనా వేసింది. ఈ సంస్థ రిపోర్ట్ ప్రకారం.. కీలకమైన 34 సూచీల పరిశీలన చేయగా.. 6.2-6.3 శాతం మధ్య ఉండొచ్చని విశ్లేషించింది. ఎన్ఎస్ఓ గణంకాలు 6.4 శాతంతో పోల్చితే ఇది తక్కువ. గతేడాది మూడో త్రైమాసికంలో నెలకొన్న భౌగోళిక అనిశ్చిత్తులు, సరఫరా చెయిన్‌లో నెలకొన్న ఇబ్బందులు జీడీపీని మందగించేలా చేస్తున్నాయని ఎస్బీఐ తన రీసెర్చ్‌లో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ 6.5 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని ఇటీవల ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2024-25లో భారత జీడీపీ 6.4 శాతంగా, వచ్చే 2025-26లో 6.7 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. గడిచిన 2023-24లో భారత జీడీపీ 8.2 శాతం వృద్ధిని కనబర్చింది. దీంతో పోల్చితే భారీగా తగ్గనుందని.. ప్రభుత్వ ప్రయివేటు సంస్థల రిపోర్టులు స్పష్టం చేస్తోన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర బలహీనతలు కొనసాగుతున్నాయి. ఇటీవల పట్టణ వినిమయం పడిపోవడంతోనే కేంద్రం ఆదాయపు పన్ను శ్లాబును పెంచగా.. ఆర్బీఐ కూడా వడ్డీ రేట్లను తగ్గించింది. దీంతో మార్కెట్‌లో నగదు ప్రవాహం పెరుగుతుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తోన్నాయి. కానీ.. పేదవాడి ఆదాయాలను పెంచే చర్యలు మాత్రం శూన్యంగా ఉండటంతో వృద్ధికి మద్దతు ఎలా లభిస్తుందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

వరంగల్ వ్యాపారులకు జస్ట్‌డయల్ సేవలు

హైదరాబాద్ : వరంగల్‌లోని వ్యాపారాలు డిజిటల్ అవకాశాలను పొందడానికి వృద్ధిని సాధించడానికి మద్దతును అందించనున్నట్లు జస్ట్‌డయల్ తెలిపింది. ఇక్కడ తమ కార్యకలాపాలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక సంస్థలు వినియోగదారులతో కనెక్ట్ అవ్వడానికి, అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొంది. కొత్త మార్గాలను అన్వేషించడానికి ఎంఎస్ఎంఇ రంగాన్ని శక్తివంతం చేయడానికి మద్దతును ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

21వేల కంటెంట్ క్రియేటర్లతో మీషో జట్టు

హైదరాబాద్ : ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ మీషో 21,000 మంది పైగా కంటెంట్ ఇన్‌ఫ్లుయెర్స్‌తో జట్టు కట్టినట్లు తెలిపింది. ఇందులో టైర్ 3, టైర్ 4 నగరాల నుండి సహా అన్ని పరిమాణాల ఇన్ఫ్లుయెన్సర్లు ఉన్నారని పేర్కొంది. 18.7 కోట్ల వార్షిక లావాదేవీ వినియోగదారుల జీవనశైలిని క్రియేటర్లు మారుస్తోన్నారని మీషో మానిటైజేషన్ అండ్ కంటెంట్ కామర్స్ జనరల్ మేనేజర్ ప్రసన్న అరుణాచలం పేర్కొన్నారు. 2024 జనవరిలోని ఆర్డర్ సంఖ్యతో పోల్చితే ఈ ఏడాది మూడు రెట్ల పెరుగుదల ఉందన్నారు.

పెరిస్కోప్ లెన్స్‌తో నథింగ్ ఫోన్ (3ఎ) సీరిస్

న్యూఢిల్లీ : లండన్ కేంద్రంగా పని చేస్తోన్న టెక్నాలజీ కంపెనీ నథింగ్ తన ఫోన్ (3ఎ) సీరీస్‌ను పెరిస్కోప్ లెన్స్‌ను ఎఐ స్పష్టతనుపెంచే అల్గారిథమ్‌తో అందుబాటులోకి తెస్తోన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మార్చ్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. 50ఎంపి పెరిస్కోప్ లెన్స్‌తో సహా 70ఎంఎం పోర్ట్రేయిట్, 3ఎక్స్ ఆప్టికల్ జూమ్, 6ఎక్స్ ఇన్ సెన్సార్ జూమ్, 60ఎక్స్ అల్ట్రాఓట జూమ్ ఫీచర్లతో దీన్ని అందిస్తున్నట్లు పేర్కొంది.

హైదరాబాద్‌లో రూట్‌మేటిక్ కమాండ్ సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : ట్రాన్స్‌పోర్ట్ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఉద్యోగుల ఫ్లీట్ మేనేజ్‌మెంట్ సంస్థ రూట్‌మేటిక్ తాజాగా హైదరాబాద్‌లోని మణికొండలో అత్యాధునిక కమాండ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది సమర్థవంతమైన, సాంకేతికతతో స్థిరమైన రవాణా పరిష్కారాల పట్ల తమ నిబద్ధతకు నిదర్శనమని తెలిపింది. భారత్‌లో ఇది తమ మూడవ కమాండ్ సెంటర్ అని రూట్‌మేటిక్ ఫౌండర్, సిఇఒ శ్రీరామ్ కన్నన్ పేర్కొన్నారు. తమకు బెంగళూరు, పూణేలోని సెంటర్లు కార్పొరేట్ క్లయింట్‌లకు సర్వీస్‌లను అందిస్తున్నాయన్నారు. హైదరాబాద్ ఫ్లీట్‌లో 100 ఎలక్ట్రిక్ వాహనాలు సహా 300 వాహనాలు ఉన్నాయన్నారు. నగరం అంతటా 50కి పైగా ప్రముఖ కార్పొరేట్ క్లయింట్‌లకు సేవలు అందిస్తోందన్నారు.

సైయంట్ కొత్త సీఈఓగా సుకమల్ బెనర్జీ



హైదరాబాద్ : ప్రముఖ ఇంజనీరింగ్ టెక్నాలజీ కంపెనీ సైయంట్ లిమిటెడ్ తన నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా సుకమల్ బెనర్జీని నియమించుకుంది. ఫిబ్రవరి 19 నుంచే బెనర్జీ నియామకం అమల్లోకి వచ్చిందని.. ఐదేండ్ల పాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారని సైయంట్ ఓ ప్రకటనలో తెలిపింది. బెనర్జీ నియామకానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ, ఎంబీఏలో ఫైనాన్స్ అండ్ స్ట్రాటజీని చేశారు.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎ06 5జీ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ ఎ06 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. 50 ఎంపి కెమెరా, 5,000 ఎంఎహెచ్ బ్యాటరీతో ఆవిష్కరించింది. 4జిబి ర్యామ్, 64 జిబి స్మార్ట్‌ఫోన్ ధరను రూ.10,499గా నిర్ణయించింది. 4జిబి, 128జిబి ధరను రూ.11,499గా, 6జిబి, 128జిబి ధరను రూ.12,999గా ప్రకటించింది. సెల్ఫీ కోసం 8ఎంపి కెమెరను అమర్చింది.

వెల్‌స్పన్ లివింగ్‌కు ఈఎస్‌జీ రేటింగ్

ముంబయి : వస్త్రాలు, లగ్జరీ గూడ్స్ విభాగంలో అత్యధిక ఈఎస్‌జీ రేటింగ్‌ను పొందినట్లు వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ తెలిపింది. ఎస్అండ్‌పి గ్లోబల్ కార్పొరేట్ సస్టైనబిలిటీ అసెస్మెంట్‌లో మొత్తం ఈఎస్‌జీ స్కోర్ 83ను సాధించినట్టు పేర్కొంది. టెక్స్‌టైల్, లగ్జరీ గూడ్స్ విభాగంలో ఇదే అత్యున్నత ర్యాంక్ అని.. ప్రపంచ వ్యాప్తంగా 4వ స్థానంలో నిలిచినట్టు పేర్కొంది. 2023లో 66 స్కోర్ ఉందని.. మరో 26 స్కోర్ మెరుగుదల ఉందని తెలిపింది.

వ్యూహాలకు పదును

జోరందుకున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం



- ప్రధాన పార్టీల అభ్యర్థుల స్థాయిలోనే స్వతంత్రుల క్యాంపెయిన్
- సోషల్‌మీడియాలో విమర్శ, ప్రతి విమర్శలతో హోరు
- గ్రూప్ ఫోన్‌కాల్స్, ఎస్ఎమ్ఎస్‌లతోనూ ఓటర్లకు చేరువగా..
- పార్టీ కేడర్లతో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ప్రధాన పార్టీల సమావేశాలు
- నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశాలు, సభలు
- అన్నీ తానై ప్రచారపర్వాన్ని సాగిస్తున్న 'బండి'
- ప్రజా, విద్యార్థి, ఉద్యోగ సంఘాలతో స్వతంత్రుల మీటింగ్స్
- ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఉపాధ్యాయ అభ్యర్థుల క్యాంపెయిన్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సెగ్మెంట్‌కు పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రధాన పార్టీల్లో నేతలంతా సభలు, సమావేశాలతో ఆయా ఉద్యోగ, ప్రజా, విద్యార్థి సంఘాలకు చేరువవుతుంటే.. అదేస్థాయిలో స్వతంత్రులు సైతం కలుస్తున్నారు. అధికార కాంగ్రెస్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలపైనే పార్టీ అధిష్టానం బాధ్యత పెట్టగా.. వారంతా పోటాపోటీగానే క్యాంపెయిన్ చేస్తున్నారు. బీజేపీలో మాత్రం అన్నీ తానై ప్రచారంలోకి దిగిన 'బండి'.. కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలకే పరిమితం అవుతున్నారు. ఇదంతా ఒకెత్తయితే సోషల్ మీడియాను సాధ్యమైనంత వరకూ వినియోగించు కుంటున్నారు. వ్యక్తిగత వాయిస్, పోస్టర్లతో హోరెత్తిస్తూనే ప్రత్యర్థుల వ్యక్తిగత బలహీనతలపైనా పోస్టులు పెడుతున్నారు. మరోవైపు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మాత్రం ఎన్నికల నిబంధనల మేరకు ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఉపాధ్యాయులను కలుస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ దూరంగా ఉండటంతో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని అందరూ భావించారు. అయినప్పటికీ ఆ రెండు పార్టీల అభ్యర్థులతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో ఉన్న 56 మందిలో ముగ్గురు, నలుగురు స్వతంత్రులూ బలంగానే ప్రచారంలోకి దిగారు. అధికారపార్టీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి, 'కమలం' అభ్యర్థి అంజిరెడ్డికి దీటుగానే స్వతంత్రులుగా పోటీలో ఉన్న ప్రసన్న హరికృష్ణ, యాదగిరి శేఖర్‌రావు, సర్దార్ రవీందర్‌సింగ్ తమ ప్రభావం ఉన్న సంఘాలు, ప్రాంతాల్లో పెద్దఎత్తునే సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే వీరంతా ప్రధానంగా సామాజిక మాధ్యమాలనే సాధనాలుగా చేసుకొని పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. అందులోనూ ప్రత్యర్థిపై వ్యతిరేక ప్రచారం చేసేందుకు కొన్ని ఏజెన్సీలతో రూ. కోట్ల వ్యయాన్ని వెచ్చించి బేరం కుదుర్చుకున్నారనే విమర్శలు ఆయా అభ్యర్థుల నోటి నుంచే వస్తుండటం గమనార్హం. అదే స్థాయిలో సోషల్‌మీడియా వేదికగా ఆయా పార్టీ అభ్యర్థులపైనా, స్వతంత్రులపైనా వ్యక్తిగత వ్యతిరేక పోస్టులు పెట్టేపనిలో పడ్డారు. ఇక పార్టీ శ్రేణులు, తమ అనుచరులతో ఆయా ఉమ్మడి జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించిన అభ్యర్థులు.. ఓటర్ లిస్టు పట్టుకుని పట్టభద్రుల ఇండ్లకు వెళ్లి మరీ కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు ప్రధాన పార్టీలు రోజువారీ వేతనం ఇస్తూ కొందరిని నియమించుకోవడం గమనార్హం. మరోవైపు ఎన్నికల సంఘం కఠిన నిబంధనల నేపథ్యంలో ఉపాధ్యాయ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు పాఠశాలల్లో కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలపైనే భారం

అధికార పార్టీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు సహా పలువురు సీనియర్ నేతలు బాధ్యతలు తీసుకున్నారు. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బాధ్యతలు చూస్తుండగా.. ఎమ్మెల్యేలంతా తమ సెగ్మెంట్లకు పరిమితమయ్యారు. పార్టీ మండలాధ్యక్షులు, శ్రేణులతో నియోజక వర్గాలవారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ముఖ్య నేతలకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. అందులో కరీంనగర్‌కు స్థానిక నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నిజామాబాద్ అర్బన్‌కు సుడా చైర్మెన్ నరేందర్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గానికి కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేష్, పీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేష్‌కు నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు. పట్టభద్రుల స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల్లో సందడి..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఉదయం 7 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ఓటర్లను వారి ఇంటి వద్ద కలుస్తూ తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రత్యర్థి సంఘాల నాయకులు తమ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటైనా వేయాలని అభ్యర్థిస్తున్నారు. పట్టభద్రులతో పోల్చితే ఉపాధ్యాయుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి నెలకొంది. పీఆర్‌టీయూ నుంచి పోటీచేస్తున్న వంగ మహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి పోటీచేస్తున్న కొమురయ్య, టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్, ఎస్సీ ఎస్టీ యూఎస్ మద్దతుతో పోటీచేస్తున్న అశోక్‌కుమార్ ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో సంఘం కార్యాలయాలు, ఇతర చోట్ల సమావేశాలు నిర్వహిస్తూ విజయం సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు.

బీజేపీలో అన్నీ తానై.. కాంగ్రెస్‌పై విమర్శలకే పరిమితమై..


బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి తరుపున బీజేపీ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నీ తానై ప్రచార బాధ్యతలు తనపై వేసుకున్నారు. ఇప్పటికే నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పార్టీ మండలాధ్యక్షులతో సమావేశమయ్యారు. వివిధ సంఘాలు, పార్టీ శ్రేణులతో ప్రయివేటు ఫంక్షన్‌హాళ్ల వేదికగా సభలు నిర్వహిస్తూ వస్తున్నారు.ఈ సమావేశాల్లో ప్రధానంగా అధికార కాంగ్రెస్‌పైనే విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అభ్యర్థి గెలుపు, ఎమ్మెల్సీగా గెలిస్తే తమ పార్టీ పాత్రపై అంశాలు ప్రజల్లోకి వెళ్లడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ఎదురుదెబ్బ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూవివాదంపై చేవెళ్ల, మోకిలా పోలీసు స్టేషన్లలోని కేసుల్ని కొట్టేయాలంటూ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం కొట్టేసింది.

ఈ మేరకు జస్టిస్ కె.లక్ష్మణ్ తీర్పు చెప్పారు. రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో 20 ఎకరాల భూమిని ఆక్రమించి, అక్కడ ఉన్న తన ఫంక్షన్ హాలును కూల్చివేశారని, బెదిరించారని సామా దామోదర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలన్న జీవన్‌రెడ్డి వినతిని హైకోర్టు తోసిపుచ్చింది.



నాగంపై కేసును కొట్టేసిన కోర్టు

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిబంధనలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారనే కేసులో మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డికి ఉపశమనం లభించింది. ఆయనపై నమోదైన కేసును హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారనే క్రిమినల్ కేసును న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ కొట్టివేశారు.

బార్ కౌన్సిల్ ఎన్నిక పై వివరాలివ్వండి: హైకోర్టు

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ పాలక వర్గానికి ఎన్నికలు నిర్వహించే షెడ్యూల్‌ను ఈ నెల 25వ తేదీన జరిగే విచారణలో చెప్పాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను హైకోర్టు ఆదేశించింది. గతంలో ఆదేశించినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ వివరాలు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను 25కు వాయిదా వేశారు.

ఇందల్వాయి కేసులో ఒకరికి యావజ్జీవం 13 మందిపై కేసు కొట్టివేత

నిజామాబాదు జిల్లా ధర్పల్లి మండలం నల్లవెల్లి గ్రామంలో మిగులు భూమి కోసం జరిగిన భూపోరాటం, ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హత్య కేసులో వడ్డే భాస్కర్‌కు యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ ఈవి.వేణుగోపాల్‌ల హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పు చెప్పింది. ఆ కేసులో నిజామాబాద్ సెషన్స్ కోర్టు 14 మంది సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలకు యావజ్జీవ కారాగార శిక్ష విధించిన విషయం విదితమే. దీనిపై శిక్షపడ్డవారు హైకోర్టులో అప్పీల్ చేసుకున్నారు. హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ కేసులో ఇరువురి న్యాయవాదుల వాదనలను విన్నది. ఒకరికి యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేస్తూ మిగతా పదమూడు మందిని నిర్దోషులుగా తీర్పు ఇచ్చింది. 14 మంది నిందితుల తరపున న్యాయవాది ఆర్. ప్రశాంత్ వాదించారు.

దాజీనగర్ పాఠశాలపై ముఖ్యమంత్రి ఆరా

నివేదిక తెప్పించుకోవాలని కలెక్టర్‌కు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బడి షెడ్డులో సగం, గుడిలో సగం అంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలం బట్టిసావర్గాం పంచాయతీ దుబ్బగూడలో దాజీనగర్ ప్రభుత్వ పాఠశాల పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. కనీస వసతుల్లేని చోట తరగతి గదుల నిర్వహణపై రేవంత్‌రెడ్డి ఆవేదన చెందారని ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వెంటనే స్థానికంగా అందుబాటులో ఉన్న తాత్కాలిక భవనంలో పాఠశాల నిర్వహణ ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పూర్తి నివేదికను తెప్పించుకోవాలని అధికారులను కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దుబ్బగూడ పాఠశాలకు సంబంధించి శాశ్వత ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముగిసిన జేఎల్ అభ్యర్థుల కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ (జేఎల్) అభ్యర్థులకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈనెల 13 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 1,286 మంది అభ్యర్థులు జేఎల్ పోస్టులకు ఎంపికయ్యారు. ఇంటర్ బోర్డు అధికారులు మల్టీ జోన్-1కు 659 మంది, మల్టీజోన్-2కు 627 మంది అభ్యర్థులను కేటాయించారు. మెరిట్ ఆధారంగా కళాశాలల వారీగా అభ్యర్థులను ఎంపిక చేశారు. అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, ఆర్జేడీ జయప్రదబాయి ఈ ప్రక్రియను నిర్వహించారు. నియామక పత్రాలను అతి త్వరలో ఇవ్వాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు.

శివాజీ జయంతి ఉత్సవాల్లో అపశృతి

- విద్యుద్ఘాతంతో యువకుడు మృతి



(ఫైల్)

నవతెలంగాణ-వర్గల్

శివాజీ జయంతి ఉత్సవాల్లో భాగంగా జెండావిష్కరణలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని జెబ్బపూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం శివాజీ జయంతి సందర్భంగా జెబ్బపూర్ గ్రామంలో జెండావిష్కరణ చేస్తుండగా జెండా కర్రగా వాడిన ఇనుప పైపు పైన ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో 8 మంది యువకులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో లింగ ప్రశాంత్ (22) పరిస్థితి విషమంగా మారడంతో స్థానికులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రశాంత్ మృతిచెందినట్టు డాక్టర్లు ధృవీకరించారు.

మరికొంత మంది యువకులు బన్నీ, వేణు, కనకరాజు, గణేష్, స్వామి, మహేష్‌లు కూడా విద్యుత్ షాక్‌కి గురయ్యారు. వారు ప్రస్తుతం చికిత్సను పొందు తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వారి కుటుంబసభ్యులు తెలిపారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి తెలిపారు.

కొమరయ్యను గెలిపించాలి : బీసీటీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యను గెలిపించాలని బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షులు కె కృష్ణుడు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో బీసీటీఏ, టీఆర్టీయూ, ప్రయివేటు టీచర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ బహుజన ఉపాధ్యాయులు, అధ్యాపకులు కొమరయ్యకు ఓటేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు నగేశ్ యాదవ్, ప్రయివేటు టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్, బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఎక్కువ టికెట్లు ఎందుకు అమ్మారు..?

తొక్కిసలాటపై కేంద్రం, రైల్వేలకు ఢిల్లీ హైకోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ : ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై కేంద్రం, భారత రైల్వేపై బుధవారం ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా మండిపడింది. పరిమితికి మించి అన్ని ఎక్కువ టికెట్లను ఎందుకు విక్రయించారని ప్రశ్నించింది. "కోచ్‌లలో ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే నిబంధనలను అమలు చేయడంలోనూ, టికెట్ లేకుండా ప్రవేశించే వ్యక్తులకు జరిమానా విధించేలా మీరు ఎలాంటి చర్యలు తీసుకున్నారు. ఇలాంటి చిన్నవిషయాలను సరిగా అమలు చేసి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేదికాదుకదా. సరే.. రద్దీ సమయంలో పరిమితి కంటే ఎక్కువమందిని అనుమతించామనుకుందాం. మరి దానికి తగ్గట్టుగా సీటింగ్ సామర్థ్యాన్ని పెంచాలి కదా. ఆ విషయంలో నిర్లక్ష్యం జరిగినట్లు కనిపిస్తోంది. ప్రయాణికులకు జారీ చేసిన టిక్కెట్ల సంఖ్య.. సీట్ల సంఖ్యను ఎందుకు మించిపోయింది?" అని ప్రశ్నించింది. ఢిల్లీ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు నివారించేందుకు భద్రత చర్యలు, రైలు బోగీల్లో ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే నిబంధనల అమలు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం విచారించింది.

కౌన్సిలర్ భర్త దారుణ హత్య

- కత్తులతో దాడి చేసిన గుర్తుతెలియని దుండగులు



(ఫైల్)

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు కౌన్సిలర్ నాగవల్లి సరళ భర్త నాగవల్లి రాజలింగమూర్తిని గుర్తుతెలియని దుండగులు హత్య చేసిన ఘటన బుధవారం పట్టణంలోని రెడ్డి కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి 15వ వార్డ్ కౌన్సిలర్ సరళ భర్త లింగమూర్తిని భూపాలపల్లి మెయిన్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేసి విచక్షణ రహితంగా పొడిచి హత్య చేశారు. దాంతో కడుపులో పేగులు బయటపడి అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హుటాహుటిన అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అప్పటికే రాజలింగమూర్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. నాగవెల్లి రాజలింగమూర్తి సామాజిక కార్యకర్తగా అనేక సమస్యలపై ఉద్యమించేవారని, రాష్ట్రంలో సంచలనం రేపిన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేసు వేసి సంచలనం సృష్టించిన వ్యక్తిగా ఆయనకు పేరు ఉంది. మృతునికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన్ను ఎవరు హత్య చేశారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హత్యకు కారణమైన దుండగులను వెంటనే గుర్తించి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నరేష్‌కుమార్ తెలిపారు.

రాష్ట్ర పోలీసులకు ఆధునీకరణలో కాచ్ అవార్డు

- అభినందించిన డీజీపీ జితేందర్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



రాష్ట్ర పోలీసులకు ప్రతిష్టాత్మకమైన కాచ్ వెండి అవార్డు లభించింది. రాష్ట్ర పోలీసు శాఖలో ప్రజలకు అనుకూలమైన డిజిటల్ ఆధునీకరణ వ్యవస్థను తీసుకొచ్చినందుకుగానూ ఈ అవార్డు దక్కింది. ముఖ్యంగా ఈ-పెటీ కేసుతో పాటు పోలీసు స్టేషన్ల ఆధునీకరణ వ్యవస్థలో ప్రజలకు సౌలభ్యంగా ఉండే తీరులో డిజిటల్ వ్యవస్థను చేపట్టినందుకుగానూ ఈ అవార్డు వచ్చింది.

అంతేగా క, సీసీ కెమెరాలు, స్మార్ట్ పోలీసింగ్‌ను కూడా ఈ అవార్డుకు పరిగణనలోకి తీసుకున్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీసు ఐటీ సెల్ విభాగం డీఎస్పీ రవిచంద్ర ఈ అవార్డును రాష్ట్ర పోలీసు శాఖ తరఫున స్వీకరించారు. ఈ అవార్డు లభించడానికి కారణమైన రాష్ట్ర పోలీసు శాఖ ఐటీ విభాగం అదనపు డీజీ వి.వి.శ్రీనివాసరావు, డీఐజీ శ్రీనివాస్‌తో పాటు ఆ విభాగం అధికారులను రాష్ట్ర డీజీపీ జితేందర్ అభినందించారు.


తెలంగాణతో పాటు మూడు రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

నకిలీ కరెన్సీ ముఠాకు చెందిన సభ్యుల అరెస్టు

తెలంగాణతో పాటు మూడు రాష్ట్రాల్లో ఎన్ఐఏ అధికారులు బుధవారం మెరుపు దాడులను నిర్వహించి నకిలీ నోట్ల ముఠా సభ్యులను అరెస్టు చేశారు. ఎన్ఐఏ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు బీహార్‌లోని భగల్‌పూర్, పాట్నా, భోజ్‌పూర్, జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో ఈ దాడులను ఏకకాలంలో ఎన్ఐఏ అధికారులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆ ప్రాంతాల నుంచి రూ.1,49,400 నకిలీ నోట్లతో పాటు వాటిని తయారు చేసే పరికరాలు, పెన్‌డ్రైవ్‌లు, కెమికల్స్, ఇతర సామాగ్రిని స్వాధీనపర్చుకున్నారు. మహ్మద్ నాజర్ సద్దాం(భగల్‌పూర్), మహ్మద్ వారిఫ్(భోజ్‌పూర్), జాకీర్ హుస్సేన్(పాట్నా) ముగ్గురు నిందితులను ఎన్ఐఏ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో అరెస్టు చేశారు.

వోక్సన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆత్మహత్య

నవతెలంగాణ-మునిపల్లి



వోక్సన్ యూనివర్సిటీలో ఫ్యాకల్టీ డిజైనర్ ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని కంకోల్ శివారులోని యూనివర్సిటీలో బుధవారం జరిగింది. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన సుమంత్ కుమార్(35) మండలంలోని కంకోల్ గ్రామ శివారులో గల వోక్సన్ యూనివర్సిటీలో 2023లో స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైనర్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. కాగా, బుధవారం యూనివర్సిటీలోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ రాజేష్ నాయక్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సదశివాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు ఎస్ఐ చెప్పారు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రకృతి సేద్యానికి అమెరికా సంస్థ సాయం

- ఏపీ సీఎంను కలిసిన పెగాసస్ ప్రతినిధులు



అమరావతి: ప్రకృతి సేద్యంతోపాటు మార్కెటింగ్, డెవలప్‌మెంట్, ఫైనాన్సింగ్ వంటి అంశాల్లో రాష్ట్రానికి సాయం అందించేందుకు అమెరికా సంస్థ పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ ముందుకొచ్చింది. ఇటీవల దావోస్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఆ సంస్థ ప్రతినిధులు చర్చలు జరిపారు. ఆ ప్రక్రియ కొనసాగింపులో భాగంగా బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పెగాసస్ క్యాపిటల్ అడ్వయిజర్స్ ఛైర్మన్ క్రెయిగ్ కోగుట్, ఆపరేటింగ్ అడ్వయిజర్ గినా మెగ్‌కార్తి, ట్రస్ట్ సిఇఓ కీత్ అగోడా తదితరులు కలిశారు. ప్రకృతి వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ కోసం ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రమోట్ చేసేందుకు రైతు సాధికారి సంస్థతో పెగాసస్ క్యాపిటల్ ప్రతినిధులు ఎంఓయు చేసుకోనున్నారు. దీనిపైనా సిఎంతో వారు చర్చించారు. ప్రకృతి వ్యవసాయం, భిన్నమైన వాతావరణాన్ని తట్టుకోగల పంటలను అందించడం రైతు నుండి వినియోగదారుల వరకూ ఎండ్‌టు ఎండ్ అనుసంధాన వ్యవస్థను రూపొందించడం, మార్కెటింగ్, ఫైనాన్సింగ్, డేటా మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయడం తదితర అంశాల్లో తమ సంస్థ సహాయపడుతుందని వారు సిఎంకు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను ప్రభుత్వ లక్ష్యాలను సిఎం చంద్రబాబునాయుడు వారికి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగవుతోందని, 2028-29 నాటికి 40 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించి 50 లక్షల ఎకరాల్లో సాగయ్యేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

ఢిల్లీకి చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. గురువారం రాంలీలా మైదానంలో ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా పదవీ స్వీకార ప్రమాణోత్సవంలో ఆయన పాల్గొంటారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో భేటీ అయ్యే అవకాశం ఉంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మిర్చి రైతుల సమస్యలపై మాట్లాడి సాయం కోరనున్నారు. అనంతరం రాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు.

రైతుల కోసం ఉద్యమిస్తాం

- టిడిపి కూటమి సర్కార్ నిర్లక్ష్యంతోనే ధరల పతనం
- ఏ పంటకూ దక్కని గిట్టుబాటు ధరలు
- గుంటూరులో మాజీ సిఎం జగన్ విమర్శ



గుంటూరు : రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు తమ పార్టీ ఉద్యమిస్తుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గుంటూరు మిర్చి యార్డును సందర్శించారు. పలువురు రైతులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. భారీ రద్దీ నడుమ ఆయన రైతులతో పూర్తిగా మాట్లాడకుండానే మీడియాతో మాట్లాడి వెనుదిరిగారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఏ ఒక్క రైతూ సంతోషంగా లేరని తెలిపారు. ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడంతో వారు చాలా కష్టాలు పడుతున్నారని వివరించారు. పంటలకు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో రైతులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారని తెలిపారు. రైతుల పాలిట టిడిపి కూటమి ప్రభుత్వం శాపంగా మారిందని విమర్శించారు. తమ ప్రభుత్వ హయంలో మిర్చికి క్వింటాలుకు రూ.20 వేల నుంచి 27 వేల వరకు ధర లభించిందని గుర్తు చేశారు. ఈ ఏడాది ధర రూ.8 వేల నుంచి రూ.11 వేల మాత్రమే వస్తుండడంపై టిడిపి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇప్పటి వరకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, సున్నా వడ్డీ అమలు కావడం లేదని అన్నారు. మిర్చి రైతులను చంద్రబాబు ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుంటూరు జిల్లాలోనే చంద్రబాబు నివసిస్తున్నారని ఏ రోజైనా యార్డుకు వచ్చి రైతులతో మాట్లాడారా? అని నిలదీశారు. చంద్రబాబు ఇప్పటికైనా గుంటూరు మిర్చి యార్డుకు వచ్చి రైతుల కష్టాలు తెలుసుకోవాలని సూచించారు. మిర్చికి గిట్టుబాటు కల్పించకపోతే తాము రైతులకు అండగా ఉండి ఉద్యమిస్తామన్నారు. పత్తి, వరి, పప్పుదినుసులకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదని తెలిపారు.

పోలీసులు లేకుండా సాగిన జగన్ పర్యటన

ఎన్నికల కోడ్ నేపథ్యంలో మాజీ సిఎం జగన్ పర్యటనకు అధికారులు అనుమతి ఇవ్వలేదు. అయినా, జగన్ నిర్దేశిత సమయానికి మిర్చి యార్డుకు వచ్చారు. అయితే, పోలీసులు ఎటువంటి బందోబస్తూ ఏర్పాటు చేయలేదు. ఆయన కాన్వాయ్‌లోని వ్యక్తిగత భద్రతా సిబ్బందితోనే జగన్ యార్డులోకి వచ్చారు. రైతులు, యువకులు, వివిధ ప్రాంతాల ప్రజలు యార్డుకు భారీగా రావడంతో యార్డు కిక్కిరిసిపోయింది. దీంతో, ఆయన రైతులతో మాట్లాడేందుకు యార్డులోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడ్డారు.

జగన్‌పై కోడ్ ఉల్లంఘన కేసు

కాగా జగన్‌పై గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసు స్టేషన్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదైంది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా బుధవారం జగన్ గుంటూరు మిర్చి యార్డు సందర్శించి, రైతులతో మాట్లాడడంతో పాటు ప్రభుత్వంపైనా విమర్శలు చేశారని.. ఇది కోడ్ ఉల్లంఘన కింద వస్తుందని ఆయనపై కేసు నమోదు చేసినట్టు నల్లపాడు సిఐ కె.వంశీధర్ తెలిపారు. మిర్చి యార్డు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

కందులు కొనాలి : రైతుల ఆందోళన

నవతెలంగాణ-బేల

ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో మూడురోజులుగా కందులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం రోడ్డు పైనా బైఠాయించి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. కాగా బుధవారం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు అక్కడ ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని రైతులు పలు పార్టీల నాయకుల దృష్టికి తీసుకెళ్లగా వారు మార్కెట్ యార్డుకు సందర్శించి వారి సమస్యను తెలుసుకున్న నాయకులు పీఏసీఎస్ సీఈఓతో మాట్లాడి కొనుగోళ్లు జరిగేలా చూశారు. లేబర్ అంతర్గత గొడవతో రైతులను ఇబ్బంది పెట్టటం సరికాదని, వెంటనే కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్‌ను పంపి తూకం చేయడంతో గొడవ సద్దు మణిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ తేజ్ రావ్ మస్కే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏదైనా పాలకులు ఎవరున్నా రైతుల పక్షాన నిలబడాలన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాత ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి కష్టాలు పడాల్సి వస్తుందని, బేల మార్కెట్ యార్డులో మూడు రోజులుగా కందుల కొనుగోలు చేయక రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకొనే నాదుడే లేడన్నారు. చైర్మెన్, సొసైటీ వాళ్ల అంతర్గత గొడవతో రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ రోజు రైతులు వచ్చి తమ గోడును వినిపించడంతో సమస్యను పరిష్కరించుకోగలిగామని తెలిపారు. మళ్ళీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని మార్కెట్ యార్డ్ అధికారులను కోరారు.

చర్చలు మళ్లీ వాయిదా

ఆర్డీవో కార్యాలయం ఎదుట పేదల పడిగాపులు

రామోజీ యాజమాన్యం గైర్హాజరు

- చర్చించకుండానే వెళ్లిపోయిన ఆర్డీవో
- పరిమిత నాయకత్వంతో చర్చిస్తామని వెల్లడి
- ఇరు వర్గాల మధ్య చర్చలు నేటికి వాయిదా
- కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ధర్నా

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి



రామోజీరావు యాజమాన్యం, ఇండ్ల స్థలాల లబ్దిదారుల పక్షాన సీపీఐ(ఎం) నాయకులకు మధ్య జరగాల్సిన చర్చలు బుధవారం మళ్లీ వాయిదా పడ్డాయి. ఎలాంటి చర్చలు జరపకుండానే ఆర్డీవో తన కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు. రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యానికి అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చినా గైర్హాజరయ్యారు. దాంతో ఇరువర్గాల మధ్య జరగాల్సిన చర్చలు గురువారానికి వాయిదా పడ్డాయి. 2007లో తమకు కేటాయించిన ఇండ్ల స్థలాలకు వెళ్లకుండా అడ్డుపడుతున్న రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల లబ్దిదారులు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే వారం రోజులుగా జిల్లా కలెక్టరేట్ ఎదుట దఫా దఫాలుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు ధర్నా నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపారు.

ఇండ్ల స్థలాల విషయంలో రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యానికి, పేదలకు మధ్య అధికారుల సమక్షంలో గతంలో జరిగిన ఒప్పందం మేరకు అమలు చేస్తారా? లేదా తమకు కేటాయించిన ఇండ్ల స్థలాల్లోకి వెళ్లి గుడిసెలు వేసుకోవాలా? అనేది తేల్చాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అయితే రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం, సీపీఐ(ఎం) నాయకత్వంలో పేదలతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డిని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగుతుండటంతో సీపీఐ(ఎం) జిల్లా నాయకత్వం మరోసారి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. అయితే సోమవారం ఇరువర్గాలను పిలిపించి చర్చలు జరుపుతామని ఇబ్రహీంపట్నం ఆర్డీవో రెండ్రోజులుగా వాయిదా వేస్తూ వస్తున్నారు. కాగా బుధవారం ఇరు వర్గాలను పిలిపించి చర్చలు జరుపుతామని చెప్పిన తరుణంలో సీపీఐ(ఎం) నాయకులు, వందలాది మంది పేదలు ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయానికి ఉదయమే చేరుకున్నారు.

కానీ రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం మాత్రం గైర్హాజరైంది. సీపీఐ(ఎం) నాయకులు, ఆర్డీవోతో చర్చలు జరిపారు. రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం అందుబాటులోకి రాలేదని వారికి సమాచారం ఇచ్చి గురువారం చర్చలు నిర్వహించేందుకు చొరవ చూపుతానని నాయకులకు ఆర్డీవో చెప్పి అత్యవసర పనిమీద బయటకు వెళ్లిపోయారు.

ఏ ఒక్కరి ఇంటి స్థలం రద్దయినా ఊరుకోం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి. యాదయ్య

2007లో పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాల సర్టిఫికెట్ ఒక్కటి రద్దయినా ఊరుకోబోమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.యాదయ్య హెచ్చరించారు. సీపీఐ(ఎం) నాయకత్వంలో ఆర్డీవో సమక్షంలో రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంతో జరగాల్సిన చర్చలకు నాగన్‌పల్లి, పోల్కంపల్లి రాయపోల్, ముకునూరు గ్రామాల నుంచి వందలాది మంది పేదలు తరలివచ్చారు. ఈ చర్చలు విఫలం కావడంతో ఆర్డీవో కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 17 ఏండ్ల కిందట ప్రభుత్వమే ఇచ్చిన ఇండ్ల స్థలాల్లోకి పేదలు అడుగు పెట్టకుండా అడ్డుకుంటున్న రామోజీరావు యాజ మాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అధికారుల తీరు రామోజీ యాజమాన్యానికి ఊడిగం చేసేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 17 ఏండ్లలో ఈ ఇండ్ల స్థలాల లబ్దిదా రుల్లో ఎంతమంది చనిపోయారు? ఎన్ని కుటుంబాల యువకులు ఉద్యోగాలు సంపాదించారు? ఎంతమంది నిజంగా ఇల్లు లేని వారు ఉన్నారన్న వివరాలను సర్వే చేసి ఆ మేరకు ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఇండ్ల స్థలాల సర్టిఫికెట్ ఇచ్చిన వారందరికీ స్థలాలు చూపాల్సిందేనని డిమాండ్ చేశారు. ఏ ఒక్కరి ఇంటి స్థలాన్ని రద్దు చేసినా ఊరుకో బోమని అధికారులను హెచ్చరించారు. గతంలో ఆర్డీఓ, పోలీసుల సమక్షంలో రామోజీరావు యాజమాన్యం లిఖితపూ ర్వకంగా ఇచ్చిన ఒప్పంద పత్రాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిం చారు. తమ ఆక్రమణలో ఉన్న 20 ఎకరాల పేద ఇండ్ల స్థలాలకు బదులు, మరో ప్రాంతంలో 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇస్తామని ఒప్పంద పత్రాలు రాసి ఇచ్చినా ఎందుకు ఆ హామీని నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యానికి వత్తాసు పలికేందుకే కావాలని చర్చలు వాయిదా వేస్తున్నారన్నారు. అధికార యంత్రాంగం ఇదే విధంగా చర్చలను వాయిదా వేస్తూ పోతే తమకు కేటాయించిన స్థలంలోనే లబ్దిదారులతో గుడిసెలు వేయించి రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం నిర్మించుకున్న గోడలను బద్దలు కొడతామని హెచ్చరిం చారు. అంతే కాకుండా రామోజీరావు ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, సామెల్, జగదీష్, కె.జగన్, ఈ.నర్సింహ, ఇబ్రహీం పట్నం మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గ రాములు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ జంగయ్య, పి.జగన్, పి.అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు టి.నర్సింహ, మండల కమిటీ సభ్యులు ఏ. వెంకటేష్, సిహెచ్ నర్సింహ, ఏ.నర్సింహ, ఆనంద్, నాయకులు అశోక్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలతో కట్లేరు ప్రాజెక్టు నింపాలి

- ప్రాజెక్టులో పేరుకుపోయిన మురికిని తొలగించి స్థిరీకరణ పెంచాలి
- ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలి : రైతు సంఘం జిల్లా నాయకులు దివ్వెల వీరయ్య డిమాండ్
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పంట పొలాల పరిశీలన



నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని కట్లేరు ప్రాజెక్టు కింద వేలాది ఎకరాల మొక్కజొన్న, వరి పంట పొలాలు నీళ్ల లేక ఎండిపోతున్న మొక్కజొన్న, మాగాణి పంట పొలాలను సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుధవారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం సభ్యులు దివ్వెల వీరయ్య, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ.. కట్లేరు ప్రాజెక్టు ఆయకట్టు కింద సుమారు 6000 ఎకరాల పొలాలు సాగు చేయగా నీళ్ల లేక నెర్రెలు బారీ ఎండిపోతున్నాయని అన్నారు. లంకా సాగర్ ద్వారా కట్లేరుకు నీళ్ల వదిలి పంట పొలాలను, రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఇదే దుస్థితి ఏర్పడుతుందని తెలిపారు. నీరు పారే పంట కాలువల్లో కంప చెట్లు పెరిగి చెత్తాచెదారంతో కాలువలు నిండిపోయి నీటి పారుదలకు అడ్డుపడుతూ అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. వాటిని తొలగించి మరుమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలాగా నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా మొద్దు నిద్ర పోతున్నారని విమర్శించారు. అధికారులు అలసత్వాన్ని విడనాడి ప్రజా ప్రతినిధులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వేసవికాలం సమీపించిన తరుణంలో మధిర నియోజకవర్గంలో సాగు, తాగునీరుకు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళికలతో పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో పార్టీ, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగాన్ని, ప్రజలను సమాయత్త పరిచి ప్రత్యేక ఆందోళనలతో పాటు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గొల్లపూడి పెద్దకోటేశ్వరరావు, రైతులు కన్నెబోయిన శ్రీనివాసరావు, గొల్లపూడి హరినారాయణ, బాపయ్య, మోక్షనందం, గోపి, కొమ్మినేని రామారావు, నాగేశ్వరరావు, శీలం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

3న ఏపీ బడ్జెట్?

- ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు వాయిదా



అమరావతి : 2025-26 ఆర్థిక సంవత్సరపు వార్షిక బడ్జెట్‌ను మార్చి 3వ తేదిన అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. తొలుత ఈ నెల 28వ తేదీన బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. తాజాగా మూడవ తేదికి మార్చినట్లు సమాచారం, 22, 23 తేదీల్లో శాసనసభ్యులకు నిర్వహించాలని నిర్ణయించి అవగాహన సదస్సును కూడా వాయిదా వేశారు. . 27వ తేదీన ఏడు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆ జిల్లాలకు సంబంధించిన శాసనసభ్యులు, మంత్రులు బిజీగా ఉంటారు. ఆ కారణంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

'ఉక్కు' కాంట్రాక్టు కార్మికులపై కేంద్రం దాడి

- ఇప్పటికే 700 మందిపై వేటు
- మరో 2,400 మంది తొలగింపే లక్ష్యంగా ముందుకు
- నేడు సమ్మె నోటీసు యోచనలో కార్మికవర్గం

విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిలో అత్యంత పనిభారం మోస్తున్న 12 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించే చర్యలను కేంద్రం తీవ్రతరం చేసింది. తొలుత నాలుగు వేల మందిని తొలగించేందుకు గతేడాది అక్టోబర్ ఒకటిన ఢిల్లీ నుంచి ప్లాంట్‌కు వచ్చి రెండు రోజుల పాటు రాత్రీ పగలూ ఇక్కడే తిష్టవేసి ఉక్కు సహాయ కార్యదర్శి జాబితాలను తయారు చేయడంపై కార్మికులంతా అప్పట్లో తీవ్రస్థాయిలో పోరాడారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ఒకేసారి నాలుగు వేల మందిని తొలగిస్తే ఉద్రిక్త పరిస్థితి ఏర్పడుతుందని కేంద్రానికి నివేదించడంతో ఆ ప్రక్రియ కాస్త ఆగింది. కానీ, ఆ తర్వాత చాపకింద నీరులా 700 మందికి ప్లాంట్ యాజమాన్యం ఉద్వాసన పలికేసింది. మిగతా వారిని ఎలా తొలగించాలనే ప్రణాళికలతో తాజాగా ముందుకెళ్తోంది. మరో 2,400 మంది కాంట్రాక్టు కార్మికుల జాబితాలను తయారు చేసి గేటు పాస్‌లు లాక్కొనే కుట్రలను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలన్నీ కలిసి ఈ నెల 20న సమ్మె నోటీసు ఇచ్చి అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు ర్యాలీ, అడ్మిన్ బిల్డింగ్ వద్ద బహిరంగ సభ నిర్వహించాలని భావిస్తున్నాయి. ఇప్పటికే తొలగించిన 700 మందిని తిరిగి తీసుకోవాలని, మరో 2,400 మందిని నిలిపేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి.

జిబిఎస్‌తో గుంటూరులో మరో మహిళ మృతి




గుంటూరు : గులియన్ బారే సిండ్రోమ్ వ్యాధితో (జిబిఎస్) బాధపడుతూ గుంటూరు ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో మహిళ బుధవారం మరణించారు. నరసరావుపేటకు చెందిన షేక్ గౌహర్ జాన్ (44) ఈ నెల రెండవ తేదీన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. కొద్ది రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందిన తర్వాత బుధవారం మృతి చెందారు. మరో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. కాగా జిబిఎస్‌తో ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అలసందలపల్లికి చెందిన కమలమ్మ మూడురోజుల క్రితం మృతి చెందారు. విశాఖ కెజిహెచ్‌లో ఈ నెల 17న విజయనగరం జిల్లా లక్కవరపు కోట మండలం మల్లివీడు గ్రామానికి చెందిన రేణుకా మహంతి (63) మరణించారు. దీంతో రాష్ట్రంలో జిబిఎస్ మృతుల సంఖ్య మూడుకు చేరింది.

పీఎం కిసాన్‌కు 'విశిష్ట' కోతలు

. భూధార్‌ను తప్పనిసరి చేసిన కేంద్రం . యునిక్ ఐడిలకు టెక్నికల్ ఎర్రర్స్

- ఏపీలో భారీగా తగ్గనున్న లబ్ధిదారులు
- ఇప్పటికే ఇకెవైసి, ఆధార్ బేస్డ్ నిబంధనలతో లక్షల్లో కుదింపు
- అన్నదాతా సుఖీభవపై ప్రభావం



అమరావతి : రైతులకు కేంద్రం ఏడాదిలో మూడు కిస్తుల్లో అందించే రూ.ఆరు వేల పిఎంకిసాన్ పెట్టుబడి సహాయానికి భూధార్ కార్డును తప్పనిసరి చేసిన దరిమిలా లబ్ధిదారుల సంఖ్య బాగా తగ్గిపోనుంది. ఇప్పటికే పిఎంకిసాన్‌కు ఇ-కెవైసి, ఆధార్ బేస్డ్ పేమెంట్స్ వంటి పలు నిబంధనలను మోడీ సర్కారు ముందుకు తేవడంతో అంతకంతకూ లబ్ధిదారులకు కోత పడుతోంది. అర్హులైన లక్షలాది రైతులు ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి సాయాన్ని సైతం కోల్పోతున్నారు. తాజాగా పౌరులకు ఆధార్ మాదిరి రైతులకు విశిష్ట సంఖ్య (యునిక్ ఐడి) జారీకి మోడీ సర్కారు రంగంలోకి దిగింది. ఇక నుంచి పిఎంకిసాన్ కిస్తు జమ కావాలంటే భూధార్ తప్పనిసరని మెలిక పెట్టింది. కేంద్రం ఆదేశాలు అందుకున్న టిడిపి కూటమి సర్కారు రాష్ట్రంలో భూధార్ నమోదులను ప్రారంభించింది. త్వరలో ఈ సంవత్సరంలో ఇవ్వాల్సిన పిఎంకిసాన్ మూడవ కిస్తు జమ కానున్న తరుణంలో పిఎంకిసాన్ లబ్ధిదారులకు తొలిప్రాధాన్యమిచ్చి హడావుడిగా భూధార్ కార్డులిచ్చే ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది.

సాంకేతిక సమస్యలు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ (ఎపిఎఫ్ఆర్)లో సొంత భూమి కలిగిన రైతులను నమోదుచేసి, ఓనర్‌షిప్‌ను పట్టాదార్‌ప్యాస్‌పుస్తకం, ఇతర అధీకృత రికార్డులతో సరిచూసి, అన్నీ సరిగ్గా ఉంటే యునిక్ ఐడిని జారీ చేస్తున్నారు. భూధార్ కోసం కేంద్రం ప్రత్యేకంగా 'అగ్రిస్టాక్' ప్రాజెక్టు పేరిట మైక్రోసాఫ్ట్, ఇతర అంతర్జాతీయ ఐటి కంపెనీలతో ఎంఒయులు కుదుర్చుకుంది. డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా రైతులను గుర్తించేందుకే ఈ ఒప్పందాలు. రాష్ట్రంలో పిఎంకిసాన్ పొందేందుకు 60,02,607 మంది రైతులున్నారని పేర్కొని వారిని అన్ని విధాలా పరిశీలించి విశిష్టసంఖ్య ఇస్తున్నారు. కాగా బుధవారం సాయంత్రం వరకు పిఎంకిసాన్ లబ్ధిదారుల్లో 19,02,430 మందికి ఐడిలు జారీ అయ్యాయి. ఐడి కోసం పరిశీలించిన రైతుల డేటాలో పలు సాంకేతిక సమస్యల వలన 97,458 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆధార్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్, పట్టాదార్‌ప్యాస్ పుస్తకాల వంటి పక్కా రికార్డుల వెరిఫికేషన్‌లో ఎక్కడ టెక్నికల్ ఎర్రర్ వచ్చినా రైతులకు ఐడి జారీ ఆగుతుంది. అవన్నీ పెండింగ్‌లో పడుతున్నాయి. విఆర్‌ఒ, తహసీల్దార్లు మాన్యువల్ పద్ధతుల్లో వెరిఫై చేసి ఓకే చెబితేనే యునిక్ ఐడి వస్తుంది. లేదంటే లేదు. ఇటువంటి సాంకేతిక కారణాలతో రైతులు పిఎంకిసాన్ సాయానికి దూరం కానున్నారు. లబ్ధిదారుల తగ్గింపునకే కేంద్రం భూధార్‌ను ముందుకు తెచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రం తాను అమలు చేసే 'అన్నదాతా సుఖీభవను పిఎంకిసాన్‌తో కలిపి అమలు చేస్తామనడంతో లబ్ధిదారుల కుదింపు కూటమి సర్కారు పథకానికీ వర్తించనుంది.

లక్షల్లో వ్యత్యాసం

ఎపిలో రెండు కోట్ల ఎకరాలు సుమారు 76 లక్షల కమతాల చేతుల్లో ఉండగా పిఎంకిసాన్‌కు 60 లక్షల మందే అర్హులన్నారు. 2024-25లో ఇప్పటికి వేసిన రెండు కిస్తులు 41,22,252 మంది బ్యాంక్ ఖాతాల్లో జమయ్యాయి. అర్హులు 41,77,423 మంది అని, 99 శాతం మందికి నగదు జమయ్యాయని తెలిపారు. కాగా ఈ రెండు కిస్తులూ టిడిపి కూటమి అధికారంలోకొచ్చాక జూన్‌లో, అక్టోబర్‌లో పడ్డాయి. అర్హులైన లబ్ధిదారుల్లో దాదాపు 20 లక్షల వరకు కోత పడింది. కొత్తగా కేంద్రం భూధార్ అనడంతో లబ్ధిదారులు మరింతగా తగ్గిపోతారని అంచనా వేస్తున్నారు.